
పోలింగ్ కేంద్రానికి బస్సులో బయల్దేరిన సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 486 సమస్యాత్మకంగా గుర్తించిన అధికారులు అక్కడ పటిష్టమైన భద్రత కల్పించారు. సగానికి పైగా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేశారు. ఒంగోలు అసెంబ్లీ స్థానాన్ని క్రిటికల్ సెగ్మెంట్‌గా గుర్తించిన నేపథ్యంలో మొత్తం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ మధ్య పోలింగ్ జరగనుంది.



గిద్దలూరులో పోలింగ్ సామగ్రిని పరిశీలించుకుంటున్న సిబ్బంది

ఓటుకు వేళాయె..

నేడు పోలింగ్

- సర్వం సిద్ధంచేసిన యంత్రాంగం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఓటింగ్
- పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది, సామగ్రి
- జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు
- ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోటీలో 140 మంది అభ్యర్థులు
- సగానికి పైగా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, ఒంగోలు సెగ్మెంట్లో అన్నిచోట్లా ఏర్పాటు

జిల్లాలో ఎన్నికలు జరిగే స్థానాలు : ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలు
రంగంలో ఉన్న అభ్యర్థులు : 140మంది (పార్లమెంట్-25, అసెంబ్లీ-115)
మొత్తం ఓటర్లు : 18,22,470 మంది
పురుషులు : 9,07,980
స్త్రీలు : 9,14,379
థర్డ్ జండర్: 111
మొత్తం పోలింగ్ కేంద్రాలు : 2,183
సమస్యాత్మకంగా గుర్తించినవి : 486
మైక్రో అబ్జర్వర్లు : 486
పోలింగ్ సమయం: ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు




గిద్దలూరులో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఓటరు స్లిప్పుల పంపిణీలో గందరగోళం

ముందుగానే ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులు ఇవ్వాలన్న ఈసీ ఆదేశం జిల్లాలో సక్రమంగా అమలు కాక ఓటర్లలో కొంత గందరగోళం నెలకొంది. దీంతో పోలింగ్ సమయంలో ఆయా కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉండి స్లిప్పులు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. కాగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, మెటీరియల్‌ను పంపిణీకి యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. సంతనూతలపాడు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారైన జేసీ గోపాలకృష్ణ ఆ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా, ఇతర చోట్ల ఆర్వోల సమక్షంలో పంపిణీ చేశారు.

ఒంగోలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోలింగ్ సోమవారం జరగనుంది. రానున్న ఐదేళ్ల తమ భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధిని నిర్దేశించే పాలకులను ఎంపిక చేసుకొనేందుకు ఓటు ద్వారా ప్రజలు తీర్పు ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18,22,470 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 9,07,980 మంది కాగా, మహిళలు 9,14,379 మంది, మరో 111 మంది థర్డ్ జండర్ ఓట్లు ఉన్నాయి. వెయ్యి మంది లోపు ఓటర్లు ఉన్న దగ్గర ఒకటి, అంతకు మించి ఓటర్లు ఉంటే రెండేసి పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా 486 సమస్యాత్మకంగా గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25 మంది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 115మంది కలిపి 140 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

విధుల్లో 14,768మంది సిబ్బంది

ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ అధికారి(పీవో), ఏపీవో, మరో నలుగురు ఇతర సిబ్బందిని నియమించారు. కొందరు రిజర్వుడ్ సిబ్బందితో కలిసి మొత్తం 14,768 మంది పోలింగ్ విధుల్లో ఉండనున్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన 486 కేంద్రాలలో ఒక్కో చోట ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. దాదాపు మూడున్నర వేలకుపైగా పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండనున్నాయి. సగానికి పైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని చోట్లా సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ జరగనుంది.

పోలింగ్ ముగిసిన వెంటనే స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు చేర్చేలా ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ ఒంగోలు సమీపంలోని రైజ్ కళాశాలలో నిర్వహించనున్నారు. అన్ని సెగ్మెంట్ల ఈవీఎంలను అక్కడికి చేర్చుతున్నారు. పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, వైపాలెం, దర్శి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలు దూరంగా ఉండటంతో అక్కడి ఈవీఎంలను తొలుత ఆ ప్రాంతంలోని ఒక చోటకు చేర్చనున్నారు. ఆ తర్వాత అన్నీ కలిపి రైజ్ కాలేజీకి తెచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇక తూర్పుప్రాంతంలోని ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల ఈవీఎంలు పోలింగ్ అనంతరం నేరుగా రైజ్ కాలేజీకి చేర్చనున్నారు.

ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- ఓటు హక్కు వినియోగించుకొనే వారు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఓటరు స్లిప్పుతోపాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డును తప్పని సరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలి.
- ఈవీఎంలో బటన్ నొక్కిన తర్వాత బీప్ శబ్దం వచ్చినప్పుడు మాత్రమే ఓటు వేసినట్లు నిర్ధారణ అవుతుంది.
- ఈవీఎం బటన్‌ను వీవీప్యాట్ నుంచి స్లిప్ బయటకు వచ్చే వరకు నొక్కి ఉంచాలి.
- వీవీప్యాట్ స్లిప్‌తో ఓటు ఎవరికి వేసింది నిర్ధారించుకోవచ్చు.
- పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదు.
- పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సరికి అక్కడ మీ ఓటు లేకపోయినా, ఓటర్ లిస్ట్‌లో పేరు గల్లంతైనా.. ఓటరు కార్డు, ఆధార్ చూపించి సెక్షన్ 49ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు.
- అప్పటికే ఎవరైనా మీ ఓటు వేసినట్లయితే ధైర్యంగా టెండర్ ఓటును అడగవచ్చు.



పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

జిల్లా అంతటా ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికే సిబ్బంది, మెటీరియల్‌ను చేర్చారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకచోట సంబంధిత రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటలకే క్కడికి చేరుకున్న ఆ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి మెటీరియల్ అందజేశారు. వారిని మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సుల్లో రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. అక్కడ రెవెన్యూ, మునిసిపల్ సిబ్బందిని ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుండగా కేంద్రాల వద్ద మంచినీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలను కల్పించారు.

భారీ భద్రత

- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- బూత్‌లోకి సెల్‌ఫోన్ నిషేధం

ఒంగోలు (క్రైం), మే 12 : జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకుంది. పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది. 2,402 మంది సివిల్ పోలీసులతోపాటు 13 కంపెనీల్లోని వెయ్యి మంది కేంద్ర బలగాల సేవలను వినియోగించుకుంటోంది. రెండు నియోజకవర్గాలకు ఒక అదనపు ఎస్పీని ఇన్‌చార్జిగా నియమించారు. వీరితోపాటు 9 మంది డీఎస్పీలు, 38 మంది సీఐలు, 73 మంది ఎస్సైలు, 8 మంది ట్రైనీ ఎస్పీలు విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. బూత్‌లోకి సెల్‌ఫోన్‌ను నిషేధించారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమించినా, శాంతిభద్రతలు ఉల్లంఘించినా ప్రజలు వాట్సాప్ నెంబర్ 9121102266కు సమాచారం ఇవ్వవచ్చు. డయల్ 100, 112 నంబర్లకు ఫోన్‌చేసి చెప్పవచ్చు. ఆదివారం స్థానిక రావ్ అండ్ నాయుడు కాలేజీ నుంచి ఎన్నికల విధులకు వెళ్తున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ గరుడ్ సుమిత్ సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్

నిన్న అరాచకాలు.. నేడు ప్రలోభాలు

- ఐదేళ్లలో అక్రమాలు, ప్రశ్నిస్తే దాడులు.. ఆపై కేసులు
- ఎన్నికల వేళ ప్రతిపక్షాలకు అవే ప్రచారాస్త్రాలు
- జనాగ్రహంతో వైసీపీ విలవిల
- భారీ తాయిలాలు
- ఓటుకు నోటు.. ఆపై వస్తువుల పంపిణీ



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారాన్ని అడ్డం పెట్టుకొని నిన్నమొన్నటి వరకూ అరాచకాలు, భూఆక్రమాలకు జిల్లాలో వైసీపీ నాయకులు తెగబడ్డారు. వాటిని మననం చేసుకున్న ప్రజలు ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో గెలుపుకోసం వారిని శాంతింపజేసేందుకు భారీ ప్రలోభాలకు తెరతీశారు. సోమవారం పోలింగ్ జరగనుండగా కొన్ని నియోజకవర్గాల్లో అదనపు తాయిలాలు ఇవ్వడం అందులో భాగంగానే కనిపిస్తోంది. అయితే నిశిరాత్రి ప్రారంభమైన అదనపు తాయిలాలపై జనం తిరగబడటంతో వైసీపీ నాయకులు విలవిల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత ఐదేళ్లలో జిల్లాలో అరాచకాలు, భూఆక్రమణలు భారీగా జరిగిన సంగతి జగమెరిగిన సత్యం. జిల్లాకేంద్రమైన ఒంగోలు భూఆక్రమణలతో దద్దరిల్లిపోయింది. అధికారపార్టీ వారే అందుకు కారణం. చివరికి సిట్ ఏర్పాటు ద్వారా సరిదిద్దుకునే ప్రయత్నం చేసి వైఫల్యం చెందారు. ఈ వ్యవహారం వైసీపీకి తలనొప్పిగా మారింది. ఇదే విషయమై ప్రజల్లోనూ విస్తృత చర్చ నడిచింది. మార్కాపురంతోపాటు ఆ డివిజన్‌లోనూ భూఆక్రమణలు భారీగా జరిగాయి, ప్రభుత్వ భూముల ఆక్రమణలతోపాటు ప్రైవేట్ వ్యక్తుల భూములు లాగేసుకున్నారు.

ప్రజల నెత్తిన టోపీపెట్టిన వ్యక్తికే టికెట్

కనిగిరి నియోజకవర్గంలో అధికారపార్టీ నేతలు అక్రమంగా ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో తమ పేర్లపై మార్చుకోవడం, ప్రైవేట్ వ్యక్తుల భూములను కబ్జా చేయడం భారీగా జరిగింది. కనిగిరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో ప్రజల నెత్తిన టోపీ పెట్టిన వ్యక్తి ఇప్పుడు వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. సంతనూతలపాడులో అధికారపార్టీ నేతలు పోలీసుల అండతో సాగించిన దాడులు, ఆకృత్యాలతో అనేక కుటుంబాలు వీధులపాలయ్యాయి. మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై చేసిన దాడి, వైసీపీ నేతల శాడిజానికి పరాకాష్టగా నిలిచింది. ఒక షాపు అద్దె విషయాన్ని అడ్డుపెట్టుకొని ఒక ఇంటిపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేసి హింసించడం ప్రజల కళ్లముందు మెదలాడుతోంది. అలాగే కొండపి నియోజకవర్గం టంగుటూరు పంచాయతీలోని రావివారిపాలెం గ్రామంలో నడిరోడ్డుపై ఒక దళిత మహిళ హనుమాయమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన వైసీపీ శ్రేణుల అరాచక చర్యను అక్కడి వారు ఇప్పటికీ మర్చిపోలేదు. గిద్దలూరు నియోజకవర్గంలో మా ఊరుకు రోడ్డెయ్యండి అని అడిగిన పాపానికి జనసేన కార్యకర్త యోగయ్యను అధికారపార్టీ నేత వెంటాడి వేధించారు. అది భరించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. అదే నియోజకవర్గంలో మునయ్య అనే గిరిజన యువకుడు టీడీపీలో చేరాడనే నేపంతో నెలక్రితం వైసీపీ నాయకులు దారుణంగా హత్య చేయించారు. ఎర్రగొండపాలెంలో ముఖ్యప్రజాప్రతినిధి సారథ్యంలో భూదందాలు భారీగా జరిగాయి. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ఒక వ్యక్తి దారుణంగా హత్య, బాధిత కుటుంబ సభ్యుల పోరాటంతో పోలీసులపై చర్య తీసుకొని, అధికార పార్టీ నేతను మాత్రం కాపాడటం అక్కడ ప్రజానీకం ఇప్పటికీ మరిచిపోలేదు. కొనకనమిట్ల మండలంలో కడప నుంచి వచ్చిన వైసీపీ వారు భూఆక్రమణలకు దిగడమే కాక ఒక వ్యక్తిని పొట్టనబెట్టుకున్నారు. ఇలాంటి అనేక ఉదంతాలు జనాగ్రహానికి కారణమయ్యాయి.

వెంటాడుతున్న ఓటమి భయం

ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉద్యోగులు ముకుమ్మడిగా టీడీపీ కూటమికి వేయడంతో వైసీపీ నాయకులకు భయం పెరిగింది. దీంతో ఓటు రేటును భారీగా పెంచారు. ఒంగోలులో ఓటుకు రూ.3వేలు ఇచ్చిన వైసీపీ ఆ తరువాత ఇంటింటికీ బియ్యం బస్తాను పంపిణీ చేసింది. అంతకు ముందు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అయినా ప్రయోజనం కనిపించడం లేదన్న అనుమానంతో ఆదివారం నిశిరాత్రి మరికొన్ని ప్రలోభాలకు తెరతీయగా ప్రజలు, టీడీపీ శ్రేణుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో వైసీపీ శ్రేణులు వెనక్కితగ్గారు. దర్శిలో కూడా వైసీపీకి ఎక్కడా తగ్గకుండా టీడీపీ ఢీ అంటే ఢీ అంది. దీంతో పరిస్థితి తమకు అనుకూలంగా లేదని గమనించి ఆదివారం నిశిరాత్రి వైసీపీ శ్రేణులు ఇంటింటికీ చీరల పంపిణీకి శ్రీకారం పలికాయి. ఈ వ్యవహారాన్ని ప్రజలు వ్యతిరేకించడమే కాకుండా అనేక గ్రామాల్లో పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో ఓటమి భయం పెరిగి ఆదివారం రాత్రి వైసీపీ నాయకులు అదనపు ప్రలోభాలకు తెరతీయగా ప్రతిచోటా ప్రజలు వాటికి అడ్డుకట్ట వేయడం విశేషం. మార్కాపురంలో అయితే వైసీపీ తరఫున ప్రలోభాల పాత్ర పోషిస్తున్న కొందరిని ప్రజలు పోలీసులకు పట్టించారు.

మరో చాన్స్ ఎందుకు?

- ఏమి చేశారని మళ్లీ ఓటేయాలి!
- ఐదేళ్ల జగన్ పాలనపై ప్రజల మండిపాటు
- వెలిగొండ, మార్కాపురం జిల్లా ఏర్పాటు, పారిశ్రామిక రంగాలను నిర్లక్ష్యం చేశారని అసంతృప్తి
- అమలుకాని గత ఎన్నికల హామీలు
- ఇతర ప్రధాన అభివృద్ధిపై విస్తృత చర్చ
- అవినీతి, అరాచకం తప్ప ఉపకరించే ఒక్కపనీ చేయలేదని ఆక్రోశం
- వైసీపీ అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన

ఒంగోలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తీర్పు చెప్పేరోజు వచ్చేసింది. సోమవారం ఓటు అనే బ్రహ్మాస్త్రం ప్రయోగించేందుకు అందరూ సిద్ధమయ్యారు. దీంతో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లుగా అన్యాయాలు, అక్రమాలు, అశాంతి పాలన సాగించడమే అందుకు కారణమైంది. ఈ ఐదేళ్లలో జిల్లా అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, మళ్లీ జగన్‌కు అనుకూలంగా ఓట్లు ఎందుకు వేయాలన్న ప్రశ్న ప్రజల నుంచి అధికంగా వస్తోంది. ఎన్నికల కోడ్ అమలు నుంచి ఇప్పటి వరకూ దాదాపు 55 రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు వివిధ రూపాల్లో జరిగాయి. పోటీలో ఉన్న టీడీపీ అభ్యర్థులు, నాయకులు.. ఆపార్టీకి మద్దతు ఇస్తున్న జనసేన, బీజేపీ నేతలు జగన్ ప్రభుత్వంలో జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. వైసీపీ ప్రజాప్రతినిధుల అవినీతి, అరాచకాలు, సహజసంపద దోపిడీ పెద్దఎత్తున జరిగాన్న విషయాన్నీ వారికి వివరించారు. అదే సమయంలో ఉద్యోగులు, వ్యాపారులు, నిరుద్యోగులు, ఇతర వర్గాల వారు జగన్ ప్రభుత్వ తీరుపై తీవ్రఅసంతృప్తితో ఉన్నారు. ఈ అంశాలన్నీ ప్రస్తుత ఎన్నికల్లో చర్చకు దారితీస్తున్నాయి.

యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ

ఆ నియోజకవర్గం, ఈ నియోజకవర్గం అన్న తేడాలేకుండా ఎమ్మెల్యే నుంచి గ్రామస్థాయి వరకూ వైసీపీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు ఇసుక, మట్టి, గ్రావెల్, ఖనిజాలు, ఇతర సహజవనరుల యధేచ్ఛగా దోచుకున్నారు. రేషన్ బియ్యం మొదలు పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ వరకూ పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారు. వీటికితోడు భూకబ్జాలు, వివిధ వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు, ఉద్యోగులపై ఒత్తిళ్ల తదితర పలు అంశాలను ప్రజలు మననం చేసుకుంటున్నారు. మొత్తంగా జిల్లాకు వైసీపీ పాలనలో జరిగిన మేలు ఏమీలేదన్న అభిప్రాయానికి ఎక్కువ శాతం మంది వచ్చారు.

విద్య, వైద్య, రవాణా రంగాల్లో పురోగతి కరువు

అన్ని వర్గాల ప్రజలు ఐదేళ్ల ఐదేళ్లలో కీలకమైన ట్రిపుల్ ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలకు ఒక్క ఇటుక కూడా పెట్టకపోవడం, ఉపాధి కల్పించే పారిశ్రామిక రంగం ఊసెత్తకపోవడం, రాష్ట్రస్థాయిలో ఉద్యోగాల భర్తీలో చేస్తున్న నిర్లక్ష్యంపై నిరుద్యోగ యువత, విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైద్యరంగంలో మార్కాపురం మెడికల్ కాలేజీ, దోర్నాల ట్రైబల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంలో నిర్లక్ష్యం నెలకొంది. ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల కల్పనలో అలసత్వం.. రోడ్లు, ఇతర మౌలిక రంగాలను పట్టించుకోకపోవడం, తాగునీటి పథకాల పనులు సాగక వర్షాకాలంలోనూ ట్యాంకర్ల నీరే దిక్కుకావడం వంటి పరిస్థితితో అన్ని ప్రాంతాల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో జిల్లాకు జరిగిన అన్యాయం, గత ఎన్నికల వేళ జగన్ ఇచ్చిన హామీలు నేరవేర్చకపోవడం, ఆ పార్టీ నేతల దౌర్జన్యాలు, దోపిడీ అంశాలను మననం చేసుకుంటున్నారు.

అన్ని విధాలా దగాకు గురైన పశ్చిమప్రాంత ప్రజలు

ఏడాదిలో వెలిగొండ నీరు ఇస్తానని గత ఎన్నికల సమయంలో పశ్చిమప్రాంత ప్రజలకు హామీ ఇచ్చిన జగన్ దాన్ని నెరవేర్చకుండా మోసం చేశారు. ఆప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లా ఏర్పాటును పూర్తిగా విస్మరించారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి ప్రాంతంలోని నిమ్జ్ ఊసెత్తకపోవడంపై పశ్చిమ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో ఓట్లు దండుకొని జగన్ తమను దగా చేశారన్న అభిప్రాయాన్ని వారు వెలిబుచ్చుతున్నారు.

తూర్పుప్రాంత అభివృద్ధిపైనా నిర్లక్ష్యం

తూర్పుప్రాంతంలో కీలకంగా ఉన్న గుండ్లకమ్మ గేట్లకు మరమ్మతులు కూడా చేపట్టకపోవడం, సాగర్ నీటి సరఫరాలో వైఫల్యం, జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయకపోవడం, సంగమేశ్వరం ప్రాజెక్టు ఊసెత్తకపోవడం, ఒంగోలు డెయిరీని మూసివేడంపై ప్రజలు మండిపడుతున్నారు. అంతోఇంతో ఉపాధి కల్పించే గ్రానైట్, ఆక్వా రంగాలకు ప్రాధాన్యం ఇవ్వకపోగా, వాటిని మరింత సంక్షోభంలోకి వైసీపీ ప్రభుత్వం నెట్టింది. అలాగే టీడీపీ హయాంలో వ్యవసాయరంగానికి, రైతులకు అనేక పథకాలు అమలు చేయగా వైసీపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడం, పొదుపు సంఘాలకు ప్రోత్సాహం తగినంత లేకపోవడంపై ఆ వర్గాల్లో అసంతృప్తి కనిపిస్తోంది.

ఓటర్ల కోసం తెస్తున్న బియ్యం పట్టివేత


గ్రోత్ సెంటర్‌లో సీజ్ చేసిన రైసు మిల్లు

- గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో రైస్‌మిల్లు సీజ్
- రెండు వేల బస్తాల బియ్యం, ఏడు లారీలు స్వాధీనం
- కేసు విషయంలో అధికారుల మీనమేషాలు

మద్దిపాడు, మే12:


ఈవీఎంలను తరలిస్తున్న కూలీలు


బస్సు ఎక్కి కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది


ఎండ్లూరు డొంక వద్ద ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాల వద్ద ఉద్యోగులు

కట్టుదిట్టంగా ఎన్నికల సామగ్రి తరలింపు

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకున్న పీవో, ఏపీవో, ఇతర సిబ్బంది

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 259 కేంద్రాలు • అన్ని చోట్లా సీసీకెమెరాలు

భారీగా పోలీస్ బందోబస్తు.. సూచనలు చేసిన ఎస్పీ • బస్సులకు జీపీఎస్ సిస్టం ఏర్పాటు

ఒంగోలు(కలెక్టరేట్), మే 12: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్‌కేంద్రాలకు ఎన్నికల మెటీరియల్‌తో సిబ్బంది చేరారు. ఆదివారం ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీ కళాశాల(రావ్‌అండ్‌నాయుడు)లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి పర్యవేక్షణలో పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు పోలింగ్ కేంద్రాల వారీగా ఈవీఎంలు, ఇతర సామగ్రిని అప్పగించారు. సిబ్బంది ఆయా సామగ్రిని పరిశీలించుకున్న అనంతరం అక్కడ భోజనాలు చేసుకొని రూట్ల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్ళారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాన్ని 12సెక్టార్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించారు. ఆయా బస్సులకు జీపీఎస్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఒక పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని దించిన అనంతరం ఆ బస్సు ఎక్కడ ఉంది తెలుసుకునేందుకు వీలుగా ఈ సిస్టంను ఏర్పాటు చేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 259 పోలింగ్ కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు 500మంది పోలీసులతో పాటు స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ గరుడ్ సుమిత్ పలు సూచనలు చేశారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్వో సుబ్బారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పార్లమెంట్ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీలక్ష్మి, ఒంగోలు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ విశ్వేశ్వరరావు, నగర కమిషనర్ జశ్వంతరావుతోపాటు పలువురు అధికారులు పర్యవేక్షించారు.

ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఆదివారం సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని 256 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. వారు ప్రత్యేక బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్ళారు. జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఆర్వో గోపాలకృష్ణ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. పోలింగ్ కోసం 1,750మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. నియోజకవర్గాన్ని 49రూట్లుగా విభజించి 22 ఆర్టీసీ బస్సులతో పాటు మరికొన్ని ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేశారు నియోజకవర్గంలో 2,13,958 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 1,05,119 మంది, స్త్రీలు 1,08,839 మంది ఉన్నారు. సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఒంగోలు రూరల్ సీఐ, నోడల్ ఆఫీసర్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, 9మంది ఎస్ఐలు, 390 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఆర్వోలు ఎస్‌కే.మీరావళి, సురేష్, శ్రీనివాసరావు, అనురాధ, ఎంపీడీవోలు శ్రీహరి, కె.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద నుంచి సామగ్రితో వెళుతున్న ఎన్నికల సిబ్బంది




ఒంగోలులోని ట్రిపుల్‌ఐటీ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రి తీసుకుని వాహనాల కోసం ఎండలోనే ఎదురుచూస్తున్న సిబ్బంది

మాగుంటకు స్వల్ప గాయం


గాయాన్ని చూపుతున్న మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మే 12 : ఎన్నికల ప్రచార ముగింపుసభలో వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. కాలికి స్వల్పగాయం కావడంతో పాటు రెండు కాళ్ళకు వాపులు రా వడంతో నొప్పితో బాధపడుతున్నారు. వెంటనే వైద్యులు మాగుంటకు తగిన వైద్యం అందజేశారు. మాగుంట గాయపడినట్లు తెలిసిన వెంట నే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చి శ్రీనివా సులురెడ్డిని పరామర్శించారు.

వైసీపీ అరాచక పాలన

ముగింపు దశకు వచ్చింది

టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్ • 20 కుటుంబాలు చేరిక


బీఎన్ సమక్షంలో పార్టీలో చేరిన పి.తక్కెళ్లపాడు నాయకులు

సంతనూతలపాడు, మే 12: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ముగింపు దశకు వచ్చిందని టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పి.తక్కెళ్లపాడుకు చెందిన వైసీపీ నాయకుడు బొడ్డపాటి చలపతి, మరో 20 కుటుంబాలు వైసీపీని వీడి బీఎన్.విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ పాలనలో ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని బీఎన్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెలుగుయువత నాయకుడిపై

వైసీపీ కార్యకర్తల దాడి

» గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బు


సుబ్బును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

దర్శి మే 12: తెలుగు యువత దర్శి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కల్లూరు సుబ్బుపై బొట్లపాలెం గ్రామసమీపాన దోర్నపు వాగు బ్రిడ్జి వద్ద వైసీపీ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. బాధితుని కథనం మేరకు.. కల్లూరు సుబ్బు స్వగ్రామం బొట్లపాలెం. ఆయన వివాహం చేసుకున్న తరువాత కొంతకాలంగా దర్శిలో నివాసం ఉంటున్నాడు. సొంత పనిమీద బొట్లపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా వైసీపీ కార్యకర్తలు గంగిరెడ్డి అంజిరెడ్డి, శ్యాగం జిరెడ్డి మరికొంత మంది దోర్నపువాగు బ్రిడ్జి వద్ద దాడి చేశారు. గొంతునులిమి హత్యాయత్నం చేశారు. అటువైపు వెళుతున్న ఎస్సీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అడ్డుకుని రక్షించారు. రక్షించిన ఎస్సీ కాలనీవాసులను కూడా వైసీపీ కార్యకర్తలు దూషించినట్లు కల్లూరు సుబ్బు తెలిపారు. పోలీసులు కేసు దర్యా ప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ మూకల దాడులు

రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందుతుందన్న భయంతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షతగాత్రుడు కల్లూరు సుబ్బును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పాపారావు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో స్వంతగ్రామం వెళ్లి వస్తున్న సుబ్బును దారికాచి దాడి చేయటం దారుణమన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంలో కవ్వింపు చర్యలకు, దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వీరపనేని రంగ, జనసేన నాయకుడు పుప్పాల పాపారావు, తదితరులు ఉన్నారు.

ఓటు వేయండి.. బియ్యం బస్తా తీసుకోండి!

• ఒంగోలులో ఆగని వైసీపీ ప్రలోభాలు

ఒంగోలు(కార్పొరేషన్), మే 12: ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మొన్న పట్టాల పంపిణీ, దాని పేరుతో చీర, ప్యాంటు, షర్టులు..తాజాగా రూ.3వేలు నగదు.. అప్పటికీ ప్రజల్లో అభిమానం లేకపోవడంతో ఓటమి భయం తప్పదని భావించిన వైసీపీ శ్రేణులు బియ్యం బస్తాల పంపిణీకి సిద్ధం అయ్యారు. రూ.50 నోటు ఇవ్వడం, దానిపై సీరియల్ నెంబరు బియ్యం షాపు యజమానికి ముందుగానే ఇవ్వడంతో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి తెర తీశారు. గత రెండు రోజులుగా విచ్చలవిడి బియ్యం బస్తాలు అందించి ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. ఇదిలా ఉంచితే కొన్ని శివారుకాలనీలలో రెండు కేజీల నూనె, ఆదివారం కావడంతో పలు చోట్ల కేజీ మటన్ కూడా అందజేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వైసీపీ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న బియ్యం పంపిణీ ఆ పార్టీ నేతలకు తలనొప్పిగా మారింది. ఓట్లు రాబట్టుకునేందుకు కొందరికి బియ్యం బస్తాలు అందించగా, మరికొందరికీ ఏదీ అందలేదు. దీంతో వైసీపీ తీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేతలు అందించే బియ్యం బస్తా కోసం తెల్లవారుజాము వరకు ఎదురు చూడగా, అందిస్తున్న బియ్యాన్ని పలు ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంచితే ఆదివారం స్థానిక పెళ్ళూరులో, అలాగే 12వ డివిజన్‌లో వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్ నేతృత్వంలో బియ్యం పంపిణీకి సిద్ధమయ్యారు. అయితే మీడియా నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులతో వెనుకడుగు వేసిన వైసీపీ నేతలు టోకెన్ పేరుతో అందించే రూ.50 నోటుపై బియ్యం తీసుకునే తేదీని ప్రకటించి అందజేశారు. సోమవారం జరిగే పోలింగ్‌లో వైసీపీకి ఓటు వేయండి, బియ్యం బస్తా తీసుకెళ్ళండి అని ప్రచారం చేయడం బహిరంగ రహస్యం. అయితే అన్నీ తెలిసిన అధికారులు మాత్రం యథేచ్ఛగా ఓటు కోసం ప్రలోభాలకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులపై అధికారులు వెనుకడుగు వేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



ఓటరుకు అందజేసిన నోటు

ఎన్నికల సిబ్బంది ఆకలి కేకలు

అర్ధరాత్రి వరకూ పట్టించుకున్న నాథుడే కరువు • ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు • ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి



ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోదాము సమీపంలోని పోలింగ్ కేంద్రంలో ఆకలితో అలమటిస్తున్న ఉద్యోగులు


ఆకలితోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు (కార్పొరేషన్), మే 12 : ఎన్నికల విధు లకు హాజరైన ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది ఆకలితో అలమటించారు. పోలింగ్ తేదీకి 24 గంటల ముందే వారికి కేటాయించిన నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోగా, వారి ఆకలి బాధలను అర్ధరాత్రి వరకు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పలువురు ఉద్యోగులు ఆకలితో అలమటించగా, కొందరు డయాబిటీస్‌తో బాధపడే ఉద్యోగులు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఒకవైపు జిల్లా ఎన్నికల అధికారులు సైతం వారి యోగ క్షేమాలు పట్టించుకోక పోగా, గ్రామీణ ప్రాంతాలలో ఎన్నికల విధులకు హాజరైన వారు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇదిలా ఉండగా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌లో ఎక్కువ మందికి ఉద్యోగులు టీడీపీకి అనుకూలంగా ఓటు వేశారనే నెపంతో వారిని మరింత నిర్లక్ష్యం చేశారనే ఆవేదన ఎన్నికల సిబ్బందిలో కనిపించింది. ఒంగోలులోని ఏబీఎం డిగ్రీ కాలేజీ, ఎఫ్‌సీఐ గోదాము, అలాగే నగర శివారు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది ఆకలితో ఇబ్బందిపడ్డారు. కాగా రాత్రి 11.30 గంటలకు అధికారులు భోజనం తెప్పించగా ఈ సమయంలో తామే భోజనం చేయలేమని తిరస్కరించారు. తమను ఎవరూ పట్టించుకోలేని ఆవేదన వ్యక్తం చేశారు.


ఏబీఎం వద్ద ఆకలితోనే నిద్రపోతున్న సిబ్బంది

గైర్హాజరయ్యే ఎన్నికల సిబ్బందిపై క్రిమినల్ కేసులు

• కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

ఎర్రగొండపాలెం, మే 12: పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద రిపోర్టు చేయకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం తనిఖీకి వచ్చిన సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ చెక్‌లిస్టు ప్రకారం సామగ్రి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను కలెక్టరుకు రిటర్నింగ్ అధికారి శ్రీలేఖ వివరించారు. పోలింగ్ స్టేషన్లు అవసరమైన సామగ్రి అత్యవసరంగా తరలించేందుకు ఆర్వో కార్యాలయం సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.


సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గెలుపు కోసం సకలం ఒడ్డి..!

ఇళ్లు తాకట్టు పెట్టిన టీడీపీ మార్కాపురం అభ్యర్థి కందుల

సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా వైరల్

మార్కాపురం, మే 12: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ పర్యాయం అసెంబ్లీ ఎన్నికలు అత్యంత పటిష్టాత్మకంగా సాగుతున్నాయి. ఈ పర్యాయం పోటీ టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు మధ్యే ఉంది. వారిలో ముఖ్యంగా ఆర్థిక, అంగబలాలో సమర్థవంతమైన పేరున్న అన్నా వెంకటరాంబాబు స్థానికేతరుడైనప్పటికీ, గెలుపు కోసం పచ్చనోట్లు పరిచినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటు టీడీపీ వైపు పోటీలో ఉన్న కందుల అన్ని విషయాల్లో పోటీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆయన ఆర్థిక వెసులుబాటు కోసం ఆస్తులు తాకట్టుపెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రెండు ఎన్నికలలో పోటీ చేసి ఆర్థికంగా చితికిపోయారు. ఈ పర్యాయం మూడోసారి పోటీ చేస్తున్నారు. ఇవే తన చివరి ఎన్నికలని చెబుతున్నారు. చివరి ఎన్నికలు భావించి పోటీకి సకలం ఒడ్డి విజయం సాధించేందుకు కృషి చేస్తున్నారు. చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితిలో ఉన్న కందుల ఆర్థికంగా కూడా వెనక్కు తగ్గలేని పరిస్థితి ఉంది. దీంతో సొంత ఇంటిని సైతం తాకట్టు పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు వైసీపీ అభ్యర్థికి ఆర్థిక పరమైన విషయాలలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పూర్తి సహాయ సహకారాలు అందించినట్లు తెలిసింది. దీంతో ఆయన ఓట్లకు నోట్లు పంపిణీ సులభమైంది. కాగా గెలుపు రుచి చూడాలనుకొనే అభ్యర్థులు నోట్ల పంపిణీలో కూడా పోటీపడాల్సిందే. దీంతో ఆర్థిక సమీకరణల కోసం కందుల సొంత ఆస్తులను తాకట్టుపెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ పర్యాయం గెలుపు కోసం శక్తికి మించి కృషి చేస్తున్నారని ప్రతిపక్ష నాయకులే చెప్పుకుంటున్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది.

అవీ..ఇవీ..

మాగుంటను కలిసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు


మాగుంటకు పుస్తకాన్ని అందజేస్తున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 12: విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఒంగోలుకు వచ్చిన ఉద్యోగులు ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మాగుంటను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ మద్దతు తెలిపారు. తమతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో మాగుంట విజయం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఓటుతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మే 12: ప్రజాస్వామ్యంలో ఓటు విలువ చాలా గొప్పదని, అందువల్ల సోమవారం జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు తాము ఓటు వేసే ముందు ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. డబ్బుకు, మద్యం తదితర ప్రలోభాలకు గురికావద్దని, అలా చేస్తే ప్రశ్నించే హక్కును కోల్పోతామన్నారు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ ఓటు ద్వారా మంచి నాయకుడికి మద్దతు పలకాలని ఆయన కోరారు.

నాగులుప్పలపాడు మండలంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

నాగులుప్పలపాడు మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్, అసిస్టెంట్ రిటర్నింట్ అధికారి అద్దేటి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 74 పోలింగ్ కేంద్రాల పరిధిలో పురుష ఓటర్లు 27,437, మహిళా ఓటర్లు 28,701 మంది కాగా థర్డ్ జెండర్ 1 తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ర్యాంప్, మరుగుదొడ్లు విద్యుత్, తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా జరిగే పోలింగ్ విధానాన్ని కలెక్టర్, ఎన్నికల కమిషన్ అధికారులు వీక్షించనున్నట్లు పేర్కొన్నారు. 9 మంది సెక్టార్ అధికారులు పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఏఎస్పీ హర్ష ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 8మంది ఎస్ఐలు, 250 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. తిమ్మసముద్రం, ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు, ముప్పాళ్ల, చదలవాడ గ్రామాల్లో 5 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), మే 12: హిందూ సనాతన ధర్మ సారథి శ్రీఆదిశంకరాచార్య జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ అధ్యక్షతన ఒంగోలు నగరం లాయర్‌పేటలోని హరేరామ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకటశ్రీనివాసరావు మాట్లాడుతూ సనాతన ధర్మసారథిగా భారతదేశం నలుమూలల నాలుగు పీఠాలు ఏర్పాటు చేసి హిందూ ధర్మస్థాపన చేసిన మహనీయులు ఆదిశంకరాచార్య అన్నారు. మైనంపాటి సాయికుమార్ మాట్లాడుతూ శంకరాచార్యుల వారి రచనలు శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారా స్తోత్రం, భజగోవిందం వంటివి అనేకమంది జీవితంలో మార్పులు తెచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో నెమ్మాని సీతారామమూర్తి, చిలకపాటి రంగారావు, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, రాము, శివరాజు పుల్లయ్య, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ పరాంకుశం నరసింహాచార్యులు, మైనంపాటి హరినారాయణ, గడియారం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దళిత కార్పొరేటర్‌పై వైసీపీ నేత దాడి

ఒంగోలు, మే 12 : ఒంగోలులో ఇటీవల వైసీపీకి చెందిన 16వ డివిజన్‌కు చెందిన నాగభూషణం టీడీపీలో చేరారు. దీంతో ఆయనపై 45వ డివిజన్ వైసీపీ అధ్యక్షుడు నాయకుడు పలనాటి రవీందర్‌రెడ్డి దాడి చేశారు. దీనిపై బాధితుడు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. తనపై హత్యాయత్నం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, తనకు, తన కుటుంబసభ్యులకు ఎలాంటి హాని జరిగినా బాధ్యత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పలనాటి రవీందర్‌రెడ్డి, వైసీపీ నాయకుల దేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరారు.

పురాతన శివాలయంలో తవ్వకాలు


ముక్తేశ్వరాలయంలో తవ్విన గొయ్యి

జేస్తవారపేట, మే 12 : మండలంలోని మోక్షగుండం సమీపంలో అతి పురాతనమైన ముక్తేశ్వరాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ముక్తేశ్వరాలయంలో గుప్తనిధులు ఉన్నాయంటూ ఏళ్ల తరబడి ప్రచారంలో ఉంది. దీంతో పలుమార్లు దుండగులు తవ్వకాలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. అయితే శనివారం రాత్రి తర్వాత గుర్తుతెలియని దుండగులు ముక్తేశ్వరాలయంలో ప్రవేశించి ఆలయం ముందు భాగంలోని శివలింగాన్ని పెకిలించి సుమారు ఐదు అడుగుల గోయ్యి తీశారు. అయితే తెల్లవారుతుండడంతో దుండగులు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. జేస్తవారపేట ఏస్సై బి.నరసింహారావు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధురాలి మృతి

కంభం, మే 12 : కంభం రైల్వేస్టేషన్‌లో ఆదివారం ప్లాట్‌ఫాం అరుగుపై నిద్రిస్తూ గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. సుమారు 50 సంవత్సరాల వయస్సున్న ఈ వృద్ధురాలి వివరాలు తెలియ లేదు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వృద్ధురాలి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

31 సమస్యాత్మక గ్రామాలు

పొదిలి, మే 12 : మండలంలో 51550 మంది 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 26013 మంది పురుషులు, 25537 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 66 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ జరగనుంది. పొదిలి సర్కిల్ పరిధిలో మొత్తం 31 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు పొదిలి సీఐ మల్లికార్జునరావు తెలిపారు. పొదిలి మండలంలో 9, కొనకనమిట్ల మండలంలో 16, తర్లుపాడు మండలంలో ఆరు కేంద్రాలను గుర్తించామన్నారు. అయితే ఆ గ్రామాల్లో ముందస్తు చర్యగా ఇప్పటికే పలుమార్లు పోలీస్ కవాత్తు నిర్వహించామన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల జరిగే రోజున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి.. కిలో రూ.100



మార్కాపురం వన్‌టౌన్, మే 12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు పచ్చడి మెతుకులు కూడా కరువయ్యాయి. మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు తోడు కూరగాయలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో పచ్చిమిర్చి కిలో రూ.100 కు చేరుకుంది. పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యం పచ్చడి, పప్పు చేసుకోవాలన్న పచ్చిమిర్చి అవసరం. కానీ ధర ఆకాశానికి అందడంతో కొనుగోలు చేయడానికి కూడా జంకుతు న్నారు. కడప జిల్లా పులివెందుల మండలం నుంచి పచ్చిమిర్చి తెప్పిస్తున్నా మని అక్కడే కిలో రూ.60కి కొనుగోలు చేస్తున్నామని, రవాణా ఖర్చులు అధికంగా ఉన్నాయని కూరగాయాల వ్యాపారులు తెలిపారు. మార్కాపురం ప్రాంత రైతులు మిర్చి పండించినప్పుడు దీంట్లో పావు వంతు కూడా గిట్టుబా టు ధర లభించదు. ప్రభుత్వం స్పందించి కూరగాయాల ధరలు తగ్గించాలని కోరుతున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కొండపి, మే12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు తమ ఓటు వేసుకునేందుకు, పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాలకు 283 మంది పీవోలు, ఏపీవోలు కేటాయించారు. 283 పోలింగ్ కేంద్రాల్లో 1,190 మంది ఓపీవోలు పని చేస్తారు. 41 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఉంటారు. 216 సీసీ కెమెరాలను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. 29 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేశారు. టంగుటూరు మండలంలోని రైస్ కృష్ణసాయి గాంధీ ఇనిస్టిట్యూషన్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పోలింగ్ సిబ్బంది ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ సామగ్రితో సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు.

ఎన్నికలు ముగిసే వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

టంగుటూరు, మే 12 : ఎన్నికలు ముగిసేవరకూ పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కొనసాగుతుందని ఎన్నికల అధికారులు ఆదివారం వెల్లడించారు. ఐదుగురికి మించి ఎక్కడైనా గుమిగూడితే పోలీసులు చర్యలు తీసుకుంటారని వారు హెచ్చరించారు. ఎన్నికలు ముగిసేవరకు రెండు రోజులపాటు మే 11 సాయంత్రం 5గంటల నుంచి మే 13 సాయంత్రం 6గంటల వరకు వైన్ షాపులు, బార్లు మూసి ఉంచుతారు. అంతవరకు లిక్కర్ అమ్మకాలు నిషిద్ధం అన్నారు. పోలింగ్ ముంగిట ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు గుర్తిస్తే అలాంటి వారిని వెంటనే అరెస్ట్ చేస్తారని చెప్పారు. ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిర్వహించడం నిషిద్ధమన్నారు. మొబైల్స్ ద్వారా ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు నిర్వహించడం నిషేధించారన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు లేదా భారీ జరిమానా లేదా రెండు శిక్షలు విధించే అవకాశం ఉంటుందన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

టంగుటూరు, మే 12 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలో రౌడీ రాజ్యం పోవాలంటే ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామిని గెలిపించుకోవాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు కోరారు.

పోలింగ్ సిబ్బంది అవస్థలు

- మండుటెండలో ఇబ్బందులు
- సౌకర్యాల లేమితో వెతలు
- వసతులులేక ఉద్యోగినుల అవస్థలు
- సామగ్రితో కేంద్రాలకు చేరిక



దర్శిలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

కనిగిరి, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కు అధికారులు సర్వం సిద్ధంచేశారు. నియోజక వర్గంలోని 297 పోలింగ్ కేంద్రాలకు 60 రూట్లకు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఆదివారం చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ విస్తృత ఏర్పాటకై ఆదేశాలు జారీ చేయగా స్థానిక ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కనిగిరి పట్టణ సమీపంలోని వ్యవసాయమార్కెట్ యార్డును పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి డిస్ట్రి బ్యూషన్ కేంద్రంగా కేటాయించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి వివిధ విభాగాల్లో విధులు నిర్వహించేందుకు ఆరు గురు చొప్పున కేటాయించారు. దీంతో కనిగిరి నియోజక వర్గంలో 1782 మంది పోలింగ్ సిబ్బందితో పాటు అద నంగా మరో 250 మందిని అత్యవసర విధులకై రిజర్వు డులో ఉంచారు. అలాగే, దాదాపు 500 మందికి పైగా పోలీసు సిబ్బంది, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మరో 150 మందిని కేటాయించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద భోజన ఏర్పాట్లను, విధుల కు హాజరయ్యే సిబ్బంది, ఉద్యోగులు వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు మరో వంద మందిని కేటాయించారు. మున్సిపల్ సిబ్బంది మరో వంద మంది విధులు నిర్వర్తించారు. దాదాపు 2500 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బది 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పో లింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వ ద్దకు ఉదయం పది గంటలలోపు చేరుకు న్నారు. ఆయా రూట్ల వారీగా మెటీరియల్ పంపిణీ చేశా రు. రిటర్నింగ్ అధికారి జాన్‌ఇర్విన్ పోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సోమవారం ఉదయాన్నే 5.30 గంటలకు తప్పనిసరిగా మాక్ పోలింగ్ చేసి 7 గంటలు నుంచి పోలింగ్ ప్రారంభించాలని సూచించారు.

సౌకర్యాల లేమితో సిబ్బంది అవస్థలు

ఎండల తీవ్రత అధికంగా ఉండటం, ఉక్కపోతతో సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎండ వేడిమికి పలువురు ఇబ్బందులు పడ్డారు. డిస్ట్రిబ్యూషన్‌కేంద్రం వద్ద సరిపడిన టెంట్లు వేయకపోవటంతో మండుటెండలో టెం ట్లు అంచున సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. మ ధ్యాహ్నం 12.30 గంటలకే భోజన వసతి ఏర్పాట్లు పూర్తికావాల్సి ఉండగా, 1.30కు కూడా భోజనాలు పూర్తి కాలే దు. మహిళా సిబ్బందికి కేటాయించిన భోజనస్టాల్ వద్ద మహిళలు భోజనం కోసం నిరీకించాల్సి వచ్చింది. అలాగే, టాయిలెట్స్ సరిగాలేక ఇబ్బందులు పడ్డారు.



కనిగిరిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మండుటెండలో భోజనాల కోసం బారులుతీరిన ఉద్యోగినులు

పోలింగ్ కేంద్రాలకు తరలిన పోలీసు బలగాలు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. నియోజక వర్గంలోని 297 పోలింగ్ కేంద్రాల వద్ద సుమా రుగా వివిధ స్థాయిలో గల 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో 50 మొబైల్ పోలీసుపార్టీలు ఎన్నికల శాంతిభద్రతలకు వినియోగిస్తున్న ట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పోలింగ్ సందర్భంగా డీఎస్పీ రామరాజు ఆదివారం బం దోబస్తును పర్యవేక్షించారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలైన కనిగిరి మం డలంలోని యడవల్లి, హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం వద్ద బందోబస్తును పకడ్బందీగా ఏర్పా టుచేశారు. ఏ పోలింగ్ కేంద్రంలోనైనా సమస్య వచ్చినా వెంటనే మొబైల్‌పార్టీలు అక్కడికి చేరుకునేలా అధికారు లు చర్యలు చేపట్టారు. మొబైల్ పార్టీలతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తులో పాల్గొననున్నాయి.



చీరాలలో తటస్థులే కీలకం..!

● వారు ఎటు మొగ్గితే అటే గెలుపు

చీరాల, మే 12 : చీరాల. పోరాటాల పురుటిగడ్డ. చైతన్యం ఈ ప్రాంత ప్రజల సొంతం. విలక్షణ తీర్పు వారి నైజం. చీరాల నియోజకవర్గ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల ఫలితాలు అందుకు దర్పణం పడుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చీరాల నియోజకవర్గంలో త్రిముఖ పోటీ బలంగా కనిపిస్తోంది. వినిపిస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో తటస్థ ఓటర్లు అభ్యర్థుల జయాపజయాలపై గణనీయమైన ప్రభావం చూపనున్నారు. వారు ఎటు మొగ్గితే అటే గెలుపు ఉంటుందని రాజకీయ మేధావులు అంచనా వేస్తున్నారు. 2014 ఎన్నికలలో ఆమంచి కృష్ణమోహన్ నవోదయం (స్వతంత్ర అభ్యర్థిగా) పార్టీ తరపున పోటీలో నిలిచారు. టీడీపీ అభ్యర్థిగా పోతుల సునీత, వైసీపీ అభ్యర్థిగా యడం బాలాజీ బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఆమంచికి 57,544 ఓట్లు రాగా, పోతుల సునీతకు 47,209 ఓట్లు, యడం బాలాజీకి 40,995 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన ఆమంచి తరువాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీలో చేరి ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ క్రమంలో టీడీపీ వ్యూహాత్మకంగా కరణం బలరామకృష్ణమూర్తిని టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఆ ఎన్నికలలో బలరాంకు 83,163 ఓట్లు రాగా, ఆమంచికి 65,251 ఓట్లు వచ్చాయి. తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల క్రమంలో ప్రస్తుత ఎన్నికలలో టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎంఎం కొండయ్య, వైసీపీ అభ్యర్థిగా కరణం బలరాం తనయుడు కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి పోటీలో ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఆ తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో గెలిచిన పార్టీలకు దూరమయ్యారు. ఆ క్రమంలో వారివారి గెలుపులో పాలుపంచుకున్న వేలమంది తటస్థులుగా మారారు. సంప్రదాయ టీడీపీ ఓటర్లలో అత్యధికులు కొండయ్యతోనే ప్రయాణం చేస్తున్నారు. ఇక తటస్థులుగా మారినవారు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా త్రిముఖ పోటీలో ఏ అభ్యర్థికి ఓటు వేస్తే తమకు భవిష్యత్‌లో న్యాయం జరుగుతుందనే కోణంలో వారు ఆలోచిస్తున్నారు. మొత్తం మీద తటస్థ ఓటర్లు ఎటు మొగ్గితే అటు అంతిమంగా విజయం దక్కుతుందని, టీడీపీ కూటమి వైపు వారు ఆలోచిస్తున్నట్లు కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులతో పాటు, ఆయా పార్టీల శ్రేణులు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



వైసీపీని వీడి టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే ఏలూరి

వైసీపీ పాలనలో ఐదేళ్లూ అవరోధాలే..!

- ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- భవిష్యత్ తరాలకు ఇదే కీలకఘట్టం
- ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 12 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవరోధాలే తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని, ప్రజలకు ఈ ఎన్నికలే సరైన అవకాశమని.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని టీడీపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అనేక సమస్యలతో సతమతమై ఇబ్బందులు పడ్డ ప్రజలంతా భావితరాల భవిష్యత్ కోసం ఓటు అనే వజ్రాయుధంతో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. యువ ఓటర్లంతా బంగారు భవిష్యత్ కోసం ముందుకు సాగాలన్నారు. అపార రాజకీయ అనుభం, విజన్ ఉన్న చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి మంచిరోజులు రానున్నాయని, దీనికి ప్రజలు ఓటు హక్కుతో అవకాశం కల్పించాలన్నారు. ప్రజా కూటమి అనూహ్య రీతిలో భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పర్చూరు ప్రజల ఆకాంక్షను తీర్చేలా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఓటు వేయకపోతే పట్టాలు రద్దు

ఓటర్లను భయపెడుతున్న వైసీపీ నాయకులు

గంగవరం (ఇంకొల్లు), మే 12 : ఓటు వేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని వైసీపీ నాయకులు ఓటర్లను భయపెడుతున్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వైసీపీ నాయకులు ఓటర్లను బెదిరిస్తున్నారని టీడీపీ గ్రామ నాయకుడు కెల్లంపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎస్సీ కాలనీలో 30 ఎస్టీ కుటుంబాల వారున్నారు. వీరంతా టీడీపీకి అనుకూలంగా ఓటు వేస్తారనే అనుమానంతో స్థానిక వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి పై విధంగా బెదిరింపులకు పాల్పడ్డారని వెంకటేశ్వర్లు ఆరోపించారు. వైసీపీకి ఓటు వేయకపోతే మీ పట్టాలు రద్దు చేయిస్తామని ఓటర్లను బెదిరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కాలనీకి వెళ్లడంతో వైసీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు

దొనకొండ, మే 12: దొనకొండ మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర జయంతి సందర్భంగా శ్రీఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు ఆదివారం స్థానిక అడ్డురోడ్డులోని విజయాంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త అని అన్నారు. హిందూధర్మాన్ని సుస్థిరం చేయటానికి, వ్యాప్తి చేయడానికి దేశంలో నాలుగుమూలలా నాలుగు మఠాలను స్థాపించారన్నారు. ఈసందర్భంగా మహన్యాసకపూర్వ ఏకాదశి రుద్రాభిషేకాలు, బ్రాహ్మణులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం సెక్రటరీ హరికృష్ణ, కోశాధికారి ఎం.సాయిరామ అనీల్, గోపాలుని సుబ్రమణ్యం, డాక్టర్ ఎంఎం మల్లికార్జునశర్మ, అనుమల మణిబాబు, పి.మణికంఠశర్మ పాల్గొన్నారు.

పోలింగ్ ముందురోజు వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు, మరికొందరు

బల్లికురవ, మే 12 : పోలింగ్ సమయం కొన్ని గంటలలో ఉండగా వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. బల్లికురవ జడ్పీటీసీ సభ్యులు చిం తల అంజలి శ్రీనివాసరావు వైసీపీకి గుడ్‌బై చెప్పి ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెంకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాసరావు, గ్రామ వైసీపీ అధ్యక్షుడు పూరేటి వెంకటనారాయణ వారి అనుచరులతో కలిసి వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మె ల్యే గొట్టిపాటిని కొమ్మినేని వారిపాలెంకు ఆహ్వానించి ఆయన సమక్షంలో వారు టీడీపీకి మద్దతు తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్ర చారం ముగిసి ఓటింగ్‌కు గంటల వ్యవధి ఉన్న సమయంలో జడ్పీటీసీ, గ్రామ వైసీపీ నేతలు మూకుమ్మడిగా వైసీపీని వీడడంతో బిగ్ షాక్ తగిలింది. ఇప్పటికే బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వైసీపీ నేతలు గత పదిరోజుల వ్యవధిలో పెద్ద ఎత్తున వైసీపీని వీడి సైకిల్ ఎక్కారు. కొత్త పాత నేతల కలయికలతో టీడీపీ కేడర్ జోష్‌లో ఉంది. ఎన్నికలలో మండలంలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని వారు అంటున్నారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు అంజలి శ్రీనివాసరావు



టీడీపీలో చేరిన కోటపాడుకు చెందిన వైసీపీ కుటుంబాలు

టీడీపీలో చేరిన కోటపాడు వైసీపీ శ్రేణులు

పంగులూరు : మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆదివారం వీరందరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్పవరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఓటర్లకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు

పామూరు, మే 12: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు మండల ఎన్నికల అధికారి షాకిర్‌పాష తెలిపారు. మండలంలో 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఎండ తగలకుండా టెంట్లు, మంచినీరు. విద్యుత్, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సీఎస్‌పురం మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు మండల ఎన్నికల అధికారి షేక్ నాగూర్‌మీరా తెలిపారు.

దొనకొండలో 47 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

దొనకొండ, మే 12: మండలంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు 47 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేసినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. 670 మందిపై ముందస్తు బైండోవర్ కేసులు నమోదుచేసినట్టు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలైన గంగదేవిపల్లి, దొండపాడు, ఇండ్లచెరు వు, కొచ్చెర్లకోట గ్రామాలలో కేంద్రబలగాలతో బందోబస్తు ఏర్పాటుచేసినట్టు చెప్పారు.

కురిచేడులో అంతా సిద్ధం

కురిచేడు, మే 12: కురిచేడు మండలం సార్వత్రిక ఎన్నికలకు అంతా సిద్ధం అయింది. మండలం మొత్తం మీద 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 32,330 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 16,381 మంది, మహిళలు 15,947 మంది, ట్రాన్స్‌జెండర్‌లు ఇద్దరు ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.



పామూరు హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో పూర్తయిన ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలకు సర్వత్రా ఏర్పాట్లు

తాళ్లూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లుచేశారు. మండలంలో 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. మండలంలో 37722 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగి పోలింగ్‌కు అంతరాయం జరిగితే తక్షణమే స్పందించేందుకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక మొబైల్ వాహనాన్ని ఏర్పాటుచేశారు.

అద్దంకి నియోజకవర్గంలో 2,44,057 మంది ఓటర్లు



అద్దంకి, మే 12 : అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,19,570 మంది పురుషులు కాగా, 1,24,475 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. 298 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో మొత్తం 51,401 మంది ఓటర్లు కాగా, వారి లో25,460 మంది పురుషులు, 25,938 మంది మహిళలు, ముగ్గురు ఇతరులున్నారు. బల్లికురవ మండలంలో మొత్తం ఓటర్లు 43,943 మంది కాగా, 21,871 మంది పురుషులు, 22,071 మంది మహిళ లు, ఇతరులు ఒకరు ఉన్నారు. అద్దంకి రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 39,731మంది కాగా, 19,610 మంది పురుషులు, 20,119 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అద్దంకి పట్టణంలో మొత్తం ఓటర్లు 31,572 మంది కాగా, 15,121 మంది పురుషులు, 16,445 మంది మహిళలు, 6 మంది ఇతరులు ఉన్నారు. జె.పంగులూరు మం డలంలో మొత్తం ఓటర్లు 39,501 మంది ఓటర్లు కాగా, 19,207 మంది పురుషులు, 20,294 మంది మహిళలు ఉన్నారు. కొరిశపాడు మండలంలో మొత్తం ఓటర్లు 37,909 మంది ఓటర్లు కాగా, 18,301 మంది పురుషులు, 19,608 మంది మహిళలు ఉన్నారు.

మార్టూరులో 15389 ఓటర్లు, వలపర్ల గ్రామంలో 8230 ఓటర్లు, ద్రోణాదుల గ్రామంలో 5488 ఓటర్లు ఉన్నారు. దాంతో ఈ మూడు గ్రామాలపైనే టీడీపీ కూటమితోపాటు వైసీపీ వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక మిగిలిన గ్రామాలలోనాగరాజుపల్లి, బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుపాలెం, డేగరమూడి, చిమ్మిరిబండ, కోలలపూడి, కోనంకి ,బొల్లాపల్లి, తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడంతో మార్టూరు మండలంలో కూటమికి మంచి మెజారిటీ వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

యద్దనపూడి మండలంలో 14 గ్రామ పంచాయతీలలో 21525 మంది ఓట ర్లు ఉన్నారు. ఈ గ్రామాలలో 28 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. మండలంలోని పూనూరు గ్రామంలో అధికంగా 5 బూత్‌లుండగా వాటిలో 4265 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తర్వాత యద్దనపూడి గ్రామంలో 4 బూత్‌లుండగా వాటిలో 2868 మంది ఓటర్లు ఉన్నారు. ఇ క మండలంలోని శ్యామల వారిపాలెంలో 90వ బూత్‌లో అత్యల్పంగా 287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

నేడే పోలింగ్

దర్శి, మే 12: దర్శి నియోజకవర్గంలో పోటీచేస్తున్న అభ్యర్థుల భవితవ్యంపై ఓటర్లు సోమవారం పోలింగ్ ద్వారా తమ తీర్పును ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,233 మంది, మహి ళలు 1,12,129 మంది, మూడవ రకం ఓటర్లు 8 మంది ఉన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం.. ప్రయాణం నరకం..!

- అభివృద్ధికి నోచుకోని ఇంకొల్లు - పర్చూరు రోడ్డు
- రూ.22కోట్ల నిధులు మంజూరు
- చేసిన కొంత పనులకు కాంట్రాక్టర్‌కు చెల్లించని బిల్లులు
- నాలుగేళ్లుగా అవస్థలు
- డైవర్షన్ రోడ్డుపైనా గుంతలు

ఇంకొల్లు, మే 12 : ఇంకొల్లు టు పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారి రెండులైన్లగా విస్తరణ చేసేందుకు ప్రభుత్వం రూ.22కోట్లు మంజూరు చేసింది. ఏడాదిగా ప్రారంభించిన పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ఏడాది మార్చిలో రోడ్డ విస్తరణ పనులు ప్రారంభించి ఇంకొల్లులో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు పర్చూరు వరకు సాగర్ కాల్వలపై కల్వర్టర్లను నిర్మించారు. దగ్గుబాడు వద్ద వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. వంకాయలపాడు వద్ద చెరువుకట్టకు సైడు వాల్స్ కొంతమేరకు పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చింతమానులను తొలగించారు. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి కదా ఇంకేముంది ఈ ప్రాంతవాసులు ఇంకొల్లు నుంచి పర్చూరు రహదారిలో ప్రయాణ కష్టాలు తప్పి సుఖంగా సాగుతోందని ఊహించారు.




వంకాయలపాడు చెరువు వద్ద మధ్యలో నిలిచిన పనులు

కానీ అది కలగానే మిగిలింది. ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రెండు లైన్‌లుగా అభివృద్ధి చేసేందుకు రూ.22కోట్ల నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టరు చేసిన పనులకు సుమారు రూ.5కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదే. రోడ్డు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గత నాలుగైదు నెలలుగా కాంట్రాక్టరు పనులు చేసేందుకు నిరాకరించి ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామన్నట్లు సమాచారం. నాలుగేళ్లలుగా ప్రయాణికులు ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతనలు పడుతున్నారు. ముఖ్యంగా ఇంకొల్లు నుంచి వంకాయలపాడు మార్కెట్ యార్డ్ వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ 13 కిలో మీటర్ల మేర 20నిమిషాలు సాగాల్సిన ప్రయాణం 45 నిమిషాలపైనే పడుతోందని ప్రయాణికులు చెప్తున్నారు. పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న నక్కవాగుపై వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ డైవర్షన్‌రోడ్డు వేసారు. అది కూడా గుంతలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బంది జరుగుతోంది. వైసీపీ నిర్లక్ష్యం వల్లే ఇబ్బందిపడుతున్నామని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



డైవర్షన్ రోడ్డుపై గుంతలు.. అడ్డరోడ్డు వద్ద శిథిలమైన వంతెన



ఒక్క చాన్స్‌.. ఇకచాలు

» ఐదేళ్లలో రోడ్డున పడ్డాం » రూపాయి ఇచ్చి పది దోచేశావ్
» మండిపడుతున్న అన్నివర్గాల ప్రజానీకం

ఒంగోలు(కలెక్టరేట్), మే 12 : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను తమ గుప్పెట్లో పెట్టుకొని సామాన్యులు బతకలేని స్థితికి తీసుకువచ్చిన జగన్ పాలన ఇక మాకొద్దంటూ సామాన్య ప్రజానీకం మండిపడుతున్నారు. ప్రభుత్వ విధానాలతో ఇసుక లేక, గృహనిర్మాణాలు కట్టుకోవాలంటేనే భయపడుతున్న పరిస్థితుల్లో కూలీ పనులు లేక రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని భవన నిర్మాణ కార్మికులు మండిపడ్డారు. ప్రస్తుతం ఇసుక అంటే బంగారంతో సమానమైందని, అంత ధర పెట్టి పేద, మధ్యతరగతి ప్రజలు ఇళ్ళ నిర్మాణాలు చేసుకోలేని పరిస్థితికి తీసుకొని వచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు, మూడు పథకాలకు డబ్బులు ఇచ్చి అంతా తానే కుటుంబాలను పోషిస్తున్నట్లు బటన్ నొక్కాను... బటన్ నొక్కాను అంటూ పదే పదే చెప్పుకోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇచ్చింది ఎంత, తమ వద్ద నుంచి ప్రభుత్వం నుంచి ఎంత లాక్కుందో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పితే మంచిదన్నారు. ఏడాదికి రెండు మూడు పథకాల కింద రూ.30వేలు నుంచి రూ.40 వేలు ఇచ్చి తమ వద్ద నుంచి అంతకు రెట్టింపు వివిధ రూపాల్లో లాక్కున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇంటిపన్ను, చెత్తపన్ను, విద్యుత్ బిల్లులు, నిత్యవసర ధరలు పెరుగుదల ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెంచి తమపై ఎంత భారం మోపావో పేదలకు తెలుసునని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు ఎన్నికల సమయంలో బయటకు వచ్చి తనకు మరోసారి ఓట్లు వేయండి అని అడగటం దుర్మార్గంగా ఉందని మండిపడ్డారు. ఇలా అన్ని వర్గాల ప్రజానీకం ప్రభుత్వ విధానంపై మండిపడుతున్నారు. ఇక చేతివృత్తుల వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. చేతివృత్తులు చేసుకొని జీవనం సాగించే వారికి ప్రభుత్వ నుంచి సబ్సిడీ రుణాలు, శిక్షణలు వంటివి లేకపోవడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ప్రస్తుతం చేతివృత్తిదారులకు పనులు లేక వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రెండేళ్ళు కరోనాతో వ్యాపారాలు లేక, ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో భారీ పన్నులు చెల్లింపులు చేయలేక వ్యాపారాలు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక నిరుద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నిరుద్యోగులకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ శాఖల్లో ఖాళీలన్నింటిని భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారు. ఒక వైపు ఉద్యోగం రాక, ఇంకొక వైపు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు ఇతర ప్రాంతాలకు కొంత మంది వలసలు పోగా, మరి కొందరు తల్లిదండ్రులపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులు కల్పించిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఏముఖం పెట్టుకొని ఓట్ల కోసం వచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. కొంత మంది తమ మనోవేదనను చెప్పుకుంటూ బహిర్గతం అవుతున్నారు. మరోసారి వైసీపీ ప్రభుత్వానికి అవకాశం ఇస్తే ఇక తాము ఇక్కడ ఉండి జీవించలేమని, ఇతర ప్రాంతాలకు వలసలు పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఒక్క సారి చాన్స్ ఇవ్వమని అడిగావ్ ఇచ్చాం. ఇకచాలు... నువ్వంటే ఏమిటో మాకు తెలిసి వచ్చింది.... ఇక నిన్ను కొనసాగిస్తే మేము బతికే పరిస్థితిలేదు. ఈ ఐదేళ్ల కాలంలో ఇచ్చింది గోరంత... మా వద్ద నుంచి లాక్కుంది కొండంత. నిన్ను నమ్మి ఓట్లు వేసిన నేరానికి మా చెప్పుతో మేమే కొట్టుకోవాల్సిన పరిస్థితిని కల్పించావు' అని అన్నివర్గాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

పనులు లేక రోడ్డున పడ్డాం

- శ్రీనివాసరావు, బేల్దారి కూలీ, చల్లప్పాలెం



వైసీపీ ప్రభుత్వంలో పనులు లేక రోడ్డునపడ్డాం. ముగ్గురు పిల్లలను చదివించుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ ప్రభుత్వంలో బేల్దారి పనులు కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. ఇసుక అందుబాటులో లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో ఇసుక అందుబాటులో ఉన్నా ధరలు మరింత ఎక్కువగా ఉండటంతో ఇళ్ళ నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో తాము పనుల కోసం గ్రామాల నుంచి పట్టణానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం కొనసాగితే మరింత రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

- వీరభద్ర, హమాలి, ఒంగోలు



తాను 14 ఏళ్ల నుంచి హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఇటువంటి పరిస్థితిని ఎప్పుడు చూడలేదు. ఒకరోజు పని ఉంటే మరుసటి రోజు పని ఉండని పరిస్థితి ఏర్పడింది. ధరలు విపరీతంగా పెరగడంతో మాకు పనులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. తన 14ఏళ్ల కాలంలో ఇప్పుడు ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని తాను ఎప్పుడు ఎదుర్కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా పెంపు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

విధుల్లో మరణించిన ఉద్యోగికి రూ.30 లక్షలు

ఒంగోలు(విద్య), మే 11 : ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఏదైనా ముప్పు జరిగితే వారికి భారీ మొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నారు. ఈ మేరకు పాత ఉత్తర్వులను సవరించి భారీ మొత్తంలో ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు ఉన్న మధ్య కాలంలో అధికారులు, సిబ్బందికి ఏమైనా ముప్పువాటిల్లితే వారి కుటుంబ సభ్యులకు గరిష్ఠంగా రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ.30 లక్షలు, గాయపడిన వారికి రూ.7.5 లక్షల ఎక్స్‌గ్రేషియాచెల్లిస్తారు.



ఎవరికి వర్తింపు

పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అన్ని రకాల విధులకు నియమితులైన వారికి ఎక్స్‌గ్రేషియో వర్తిస్తుంది. రక్షణ సిబ్బంది, సీఏపీఎఫ్ఎస్, స్టేట్ పోలీస్, హోంగార్డులు, ఎన్నికల విధుల ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, ఎన్నికల ఓటింగ్ యంత్రాల సిద్ధం చేయడం, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు రోజు విధులకు హాజరయ్యే బెల్, ఈసీఐఎల్ కంపెనీల ఇంజనీర్లు, పోలింగ్ విధులకు నియమితులైన అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అందరికీ వర్తిస్తుంది. ఎన్నికల విధి నిర్వహణలో కోవిడ్ తరహా లక్షణాల బారినపడి ఎవరైనా మరణిస్తే ఎన్నికల విధులు ముగిసిన 15 రోజుల్లోపు కోవిడ్ పాజిటివ్ మెడికల్ సర్టిఫికెట్‌ను సంబంధిత అధికారికి సమర్పించాలి. హాస్పటల్ నుంచి ఉద్యోగి మరణ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలి. కోవిడ్ వల్లే మరణించినట్లు మరణ ధ్రువీకరణ పత్రంలో పేర్కొనాలి. అదేవిధంగా ఎన్నికల విధుల్లోనే కోవిడ్ బారినపడినట్లు కూడా ఉద్యోగి వైద్య ధ్రువీకరణ పత్రంలో స్పష్టం చేయాలి.

» ఎన్నికల విధుల్లో ప్రమాదవశాత్తు మరణం సంభవించడం, గాయపడటం, అవయవాలు కోల్పోవడం వంటి ఘటనల్లో బాధితులకు భారీ మొత్తంలో ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించనుంది.

» హింసాత్మక సంఘటనలు, తీవ్రవాదులు, సంఘవిద్రోహశక్తులు, మందుపాతరలు, బాంబుపేలుళ్లు, సాయుధ దాడులు, కోవిడ్-19 వల్ల మరణాలు సంభవిస్తే వారి వారసులకు రూ.30 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు.

» ఇతర కారణాల వల్ల అంటే గుండెపోటు, ఇతర సాధారణ మరణాలు, దాడుల్లో శాశ్వత అంగవైకల్యానికి గురైన వారికి రూ.15 లక్షలు ఇస్తారు.

» హింసాత్మక ఘటనల్లో తీవ్ర గాయాలై శాశ్వతంగా వైకల్యం కలగడం, దృష్టి కోల్పోవడం, అవయవాలు కోల్పోతే రూ.7.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తారు.

» బాధితులకు కేంద్ర హోంశాఖ చెల్లించే పరిహారానికి అదనంగా ఈ మొత్తాలను చెల్లిస్తారు. ఈ విషయంలో జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు బాధ్యత తీసుకొని బాధితులకు సత్వరం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో జవహర్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రిసైడింగ్ అధికారుల కదలికలపై నిఘా

పీడీఎంఎస్ యాప్ ద్వారా ట్రాకింగ్

ఒంగోలు(విద్య), మే 12 : ఎన్నికల పోలింగ్ విధులకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారుల కదలికలపై ఎన్నికల కమిషన్ నిఘా పెట్టింది. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరుకొనే మెటీరియల్‌ను వారికి అప్పగించేంత వరకు ఈ నిఘా కొనసాగుతుంది. దీనికోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. పోలింగ్ రోజు ప్రిసైడింగ్ అధికారి కదలికలను గమనించేందుకు పోల్‌డ్ మేనేజ్‌మెంట్ సిస్టం(పీడీఎంఎస్) యాప్‌ను పీవోలు తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. పీడీఎంఎస్‌యాప్ యూజర్ ఐడీని మన సీఏఎంఎస్ ఐడీగాను, పాస్‌వర్డ్‌గాను వినియోగించుకోవాలి. ఈ యాప్ లాగిన్ అయినప్పటి నుంచి సంబంధిత పీవో ఎన్నికల కమిషన్ అధీనంలోకి వెళ్తారు. ఎన్నికల సామగ్రి కేంద్రం నుంచి పీవోలు బయలు దేరినప్పటి నుంచి వారు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం, పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలకు సీల్ వేసి రిసెప్షన్ సెంటర్‌లో వాటిని అప్పగించేంత వరకు పీవో ప్రతి కదలిక యాప్‌లో నమోదవుతోంది. ఎన్నికల కమిషన్ నిఘా నేపథ్యంలో పీఓలు అత్యంత జాగ్రత్తతో, ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటిస్తూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మధ్యలో ఏమైనా అవంతరాలు వస్తే పీడీఎంఎస్ యాప్ ద్వారా మానిటరింగ్ చేసి సమస్యను పరిష్కరిస్తారు.


ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది





ఎన్నికల ప్రభావంతో బస్సులన్నీ
కిటకిట..!

ఎన్నికల సిబ్బందికి ఆర్టీసీ ఆధ్వర్యంలో అదనపు బస్సులు

రవాణా వ్యవస్థకు పెరిగిన డిమాండ్

ఒంగోలు(కార్పొరేషన్), మే 12 : సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఒకరోజు ముందే వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు వెళ్లాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో విధులకు హాజరయ్యే సిబ్బంది ఆదివారం తెల్లవారుజాము నుంచే బయలుదేరారు. దీంతో రవాణా వ్యవస్థకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ప్రత్యేకించి ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, పొదిలి, గిద్దలూరు బస్ స్టేషన్‌ల నుంచి బస్సులు ఏర్పాటు చేయగా, మరి కొందరు సొంత వాహనాలు కలిగిన ఉద్యోగులు ప్రైవేటు డ్రైవర్లను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదిలా ఉంచితే... మరి కొందరు అద్దె కార్లలో వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు ఇతర ఒంగోలు, హైదరాబాద్, విజయవాడ, ఇతర జిల్లాలో వివిధ ఉద్యోగ, ఉపాధి, వ్యాపారాలలో స్థిరపడిన వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కుటుంబ సమేతంగా సొంతూర్లకు బయలుదేరడంతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి. తాము వెళ్ళాల్సిన బస్సుల కోసం గంటలతరబడి ఎదురు చూశారు. పోలింగ్ సోమవారం కావడం, ముందు రోజు ఆదివారం కావడంతో ఒకరోజు ముందే ఓటర్లు వారి వారి గ్రామాలు, పట్టణాలకు తరలి వచ్చారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ చార్జీలు భారీగా పెంచారు.

ఎన్నికల సిబ్బందికి ఆర్టీసీ ఆధ్వర్యంలో అదనపు బస్సులు

ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కేటాయించినట్లు జిల్లా రీజినల్ మేనేజర్ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ బస్సులన్నీ కేటాయించిన బస్‌స్టేషన్‌ల నుంచి 12వ తేదీ తెల్లవారుజామున 5 గంటల నుంచి 6 గంటల మధ్య బయలుదేరాయని తెలిపారు. ఒంగోలు డిపో నుంచి ఎస్ఎన్‌పాడుకు 21, మార్కాపురం- 3, కొండపి -5, గిద్దలూరు 3, కనిగిరి 4 బస్సులు నడుపుతుండగా, పొదిలి బస్ స్టేషన్ నుంచి ఒంగోలుకు - 3, దర్శికి-4, కనిగిరి-4, మార్కాపురం- 3, కొండపి 21 బస్సులు, అలాగే కనిగిరి బస్ స్టేషన్ నుంచి ఒంగోలుకు- 3, మార్కాపురం- 2, గిద్దలూరు -2, కంభం- 3 బస్సులు, అలాగే మార్కాపురం బస్ స్టేషన్ నుంచి వై.పాలెం- 19, దర్శి- 13, గిద్దలూరు-4, ఒంగోలు-4, కంభం-4, దోర్నాల- 2 బస్సులు, గిద్దలూరు బస్ స్టేషన్ నుంచి మార్కాపురానికి 10, ఒంగోలు, పొదిలికి -4, కంభానికి 3 బస్సులు కేటాయించినట్లు ఆర్ఎం తెలిపారు. ఈ సర్వీసులన్నీ ఆదివారం ఆయా నియోజకవర్గాలకు బయలుదేరి, తిరిగి 13వ తేదీ సాయంత్రం ప్రధాన బస్‌స్టేషన్‌లకు చేరతాయని తెలిపారు. వీటిల్లో సాధారణ ఛార్జీలు వసూలు చేస్తామని ఆర్ఎం తెలిపారు.


ఒంగోలు బస్టాండ్‌లో బస్‌ల కోసం ప్రయాణికుల అగచాట్లు

వలస రవాణా ఓటు.. పోటు..!

• కనిగిరిలో ఒక్కొక్కరి ఖర్చు రూ.6000 • నియోజకవర్గంలో దాదాపు 50వేలకు పైగా ఉన్నట్లు అంచనా

భారీ మొత్తంలో ఖర్చు పెట్టిన రాజకీయ పార్టీలు

తెలంగాణ, చెన్నై, పూనే, కర్ణాటక, ఏపీలోని పలుచోట్ల నుంచి రాక

వారు తిరుగుముఖం పట్టే వరకూ ఖర్చు బరాయించనున్న నేతలు

ప్రైవేట్ ట్రావెల్స్ దందా

జనాల రాకతో రద్దీగా మారిన కనిగిరి సెంటర్లు

కనిగిరి, మే 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీ నేతలకు వలస ఓటర్ల రవాణా ఖర్చు దెబ్బ కూడా బాగానే తగిలింది. ఓట్ల కొనుగోలుతోపాటు ప్రయాణ ఖర్చులు తడిసిమోపెడైంది. కనిగిరి నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన ఎంతో మంది ఇతర రాష్ట్రాల్లో, ఏపీలోని పలు ప్రాంతాల్లో వివిధ పనులు నిమిత్తం వలస జీవనం గడుపుతున్నారు. అలా దాదాపు 50వేల మందికి పైగానే ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారందరూ ఓటు వేసేందుకు రావాలంటే ఒక్కొక్కరికి రూ.6వేల వరకు ఖర్చు అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి కనిగిరికి ఏసీ బస్సుకు రూ.4200, నాన్ ఏసీ బస్సుకు రూ.2600 వసూలు చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో కనిగిరి ప్రాంతానికి చెందిన వారు హైదరాబాద్‌లో వేల సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు శని, ఆదివారాల్లో కొందరు చేరుకోగా, సోమవారం చాలామంది రానున్నారు. ఎక్కువ మంది ముందుగానే రిజర్వేషన్ చేసుకున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బాదుడు

ఆర్టీసీ సంస్థ ఎన్నికల నిర్వహణకు బస్సులను పూర్తిస్థాయిలో వినియోగించలేదు. దూర ప్రాంతాల నుంచి రాకపోకలకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులే దిక్కయ్యాయి. ఇదే అదునుగా వారు డిమాండ్‌ను బట్టి ఇష్టానుసారంగా టికెట్ రేట్లు పెంచేశారు. తమ స్వగ్రామాల్లో ఎన్నికల పండుగకు వచ్చేందుకు వలస ఓటర్లు ఉత్సాహం చూపుతున్నారు. నియోజకవర్గానికి చెందిన అనేక మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ జిల్లాల్లో సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల్లో ఉండటంతో పాటు వివిధ పనులు, వ్యాపారాల్లోనూ ఉన్నారు. వలస ఓటర్లకు పోటీలో ఉన్న ఆయా పార్టీల అభ్యర్థులు వచ్చి ఓటు వేసేందుకు నగదును ముందుగానే ఆన్‌లైన్ ద్వారా వారి ఖాతాల్లో జమచేశారు. దీంతో చాలామంది కనిగిరి ప్రాంతానికి కార్లు, ప్రైవేటు వాహనాలు, ట్రావెల్ బస్సులలో చేరుకోవటంతో నగర పంచాయతీలోని ప్రధాన సెంటర్లన్నీ కిటకిటలాడాయి. వీరుగాక చాలామంది టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిపై అభిమానంతో ఉద్యోగాల్లో స్థిరపడిన వారు స్వచ్ఛందంగా రిజర్వేషన్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కనిగిరికి చెందిన సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగి కనిగిరిలో ఓటు వేసేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌లో రూ.4200 సీటు రిజర్వు చేయించుకున్నట్టు ఆంధ్రజ్యోతికి తెలిపారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ ట్రావెల్స్ బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నుంచి శుక్ర, శని, ఆది, సోమవారాల్లో సర్వీసులను పెంచారు. ఉన్న ఆర్టీసీ బస్సులలో ఎక్కువ భాగం ఎన్నికల విధులకు ఉపయోగించటంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కొరతతో వలస ఓటర్లు సతమతమవుతున్నారు. కనిగిరికి వచ్చిన వారు నియోజకవర్గంలోని సీఎస్‌పురం, పామూరు, పీసీపల్లి, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు వెళ్లేందుకు వారు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటో వాళ్ళు కూడా విపరీతంగా రేట్లు పెంచేశారు. తప్పనిసరి పరిస్థితిలో ఖర్చుపెట్టాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ట్రావెల్ బస్సులు, కార్లతో రద్దీగా మారిన ప్రధాన సెంటర్లు


బస్సులు, కార్లతో కనిగిరిలో స్తంభించిన ట్రాఫిక్

ఆధ్యాత్మిక సేవలో మాగుంట

ఒంగోలులో మూడు సార్లు శ్రీనివాస కల్యాణం

జిల్లాలోని పలు దేవాలయాలకు చేయూత

ఒంగోలు(కలెక్టరేట్), మే 11 : జిల్లా ప్రజలకు ఆధ్యాత్మికతను పెంపొందించడంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చేసిన కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే మరో వైపు ప్రజల అధ్యాత్మికతను పెంపొందించేందుకు తన వంతు కృషి చేశారు. తిరుమల శ్రీవేంకటేశ్వస్వామి దర్శనానికి అంతదూరం పోలేని వారికి స్వామి దర్శన భాగ్యం కలిగించిన గొప్ప వ్యక్తి మాగుంట. కోట్లాది రూపాయల వ్యయంతో తిరుమలలో శ్రీనివాసునికి ఏ విధంగా కల్యాణం నిర్వహిస్తారో అదే మాదిరిగా ఒంగోలులో మూడుసార్లు శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు నిర్వహించారంటే జిల్లా ప్రజల పట్ల ఆయనకు ఉన్నా ప్రేమాభిమానులు ఏ విధంగా ఉన్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. తిరుమల దేవస్థానం వేదపండితులను, కల్యాణ సామగ్రిని, ప్రసాదాలను ముందు రోజే ఒంగోలు తీసుకొచ్చి పట్టణంలో స్వామి ఊరేగింపుతో పాటు కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. లక్షలాది మంది భక్తులకు స్వామి కల్యాణాలను తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించే విధంగా ఏర్పాటు చేశారు. మరోవైపు జిల్లాలోని పలు దేవాలయాల అభివృద్ధికి మాగుంట చేసిన సేవలు అనేకం ఉన్నాయి. త్రిపురాంతకంలోని శ్రీబాల త్రిపుర సుందరేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో నీటి కొరను తీర్చేందుకు రూ.10 లక్షల వ్యయంతో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాత సింగరాయకొండలోని శ్రీవరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మెట్ల మార్గం పొడవుగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పెడుతుండటంతో రూ.15 లక్షల వ్యయంతో షెడ్లు నిర్మించారు. ఒంగోలులోని పోలీస్ క్వార్టర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలతో పాటు కల్యాణ మండపం నిర్మాణానికి మరో రూ.10 లక్షలు సహాయం అందజేశారు. ఒంగోలు, పామూరు పట్టణాల్లో ముస్లింల నమాజుకు మసీదులు లేక ఇబ్బందులు పడుతుంటంతో వాటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. ఒంగోలులోని ఈద్గా మసీదుకు రూ.5 లక్షలు, పామూరులో మసీదుకు మరో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు.

మసీదులు, చర్చిలకూ సాయం

చర్చిలు లేక ప్రార్థనల కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతుండటంతో క్రైస్తవ సంఘాల కోరిక మేరకు అనేక చర్చీల నిర్మాణానికి హితోధికంగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒంగోలులోని శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామికి రథం లేకపోవడంతో రథోత్సవ సేవలు గత 70 ఏళ్ళ నుంచి నిలిచిపోయింది. దీంతో మాగుంట రూ.20 లక్షల వ్యయంతో రథాన్ని తయారు చేసి దేవాలయానికి అందజేశారు. ఇలా జిల్లాలోని అనేక దేవాలయాలు, చర్చీలు, మసీదులకు మాగుంట అందించిన ఆర్థిక సహకారాన్ని జిల్లా ప్రజానీకం ఎప్పుడు మరిచిపోలేని విధంగా ఉన్నాయి.




ఒంగోలులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు(ఫైల్)

నేడే పోలింగ్

- దిశానిర్దేశం చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్
- కార్యక్షేత్రాలకు కదిలిన సిబ్బంది



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

గిద్దలూరు, మే 12 : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేడు ప్రారంభం కానుంది. ఆ మేరకు పోలింగ్ సామగ్రితో సిబ్బంది సిద్ధమయ్యారు. పట్టణంలోని సెయింట్ పాల్స్ బీఈడీ కళాశాల ఆవరణలో ఈవీఎంలను, ఇతర పోలింగ్ సామగ్రిని సిబ్బందికి అధికారులు అందజేశారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ చెక్‌లిస్టు ప్రకారం ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఏ అవసరం వచ్చినా బీఎల్‌వోలు సెక్టార్ ఆఫీసర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో 56 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకం కావడంతో వాటి వద్ద అదనపు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 168 పోలింగ్ కేంద్రాలు, వెబ్‌క్యాస్టింగ్ పరిధిలోకి తెచ్చినట్లు తెలిపారు.

2,39,710 మంది ఓట్లు

గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 13వ తేదీ సోమవారం 2,39,710 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పురుషుల కంటే మహిళ ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 1,19,502 మంది కాగా మహిళ ఓటర్లు 1,20,188 మంది ఉండగా థర్డ్ జెండర్ 20 ఓట్లు నమోదై ఉన్నాయి. నియోజకవర్గంలో 1913 మంది పోలింగ్ సిబ్బందిని నియమించగా ఇందులో 321 మంది పోలింగ్ ఆఫీసర్లను, 321 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను, 1271 మంది ఇతర సిబ్బందిని నియమించారు.

అభ్యర్థులు వీరే

గిద్దలూరు అసెంబ్లీ బరిలో 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యనే పోటీ ఉంది. టీడీపీ అభ్యర్థిగా ముత్తుముల అశోక్‌రెడ్డి, బహుజన్ సమాజ్‌వాజ్ పార్టీ అభ్యర్థిగా ఇసుకల జయరాజ్, వైసీపీ అభ్యర్థిగా కుందురు నాగార్జునరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పగడాల పెద్దరంగస్వామి పోటీలో ఉన్నారు. వీరితో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

పోలింగ్ విజయవంతానికి కసరత్తు

మార్కాపురం, మే 12: పోలింగ్‌లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లే ఎన్నికల సామగ్రిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ సామగ్రిని తిరిగి అప్పగించే వరకూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి అన్ని వసతులు కల్పించామన్నారు. బీఎల్‌వోలు, సెక్టార్ ఆఫీసర్లు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఎన్నికల నిర్వహణకు, శాంతిభద్రతలకు ఎటువంటి అవాంతరాలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బంది సహేతుకమైన కారణాలు చూపకపోతే సస్పెన్షన్ వేటు పడుతుందన్నారు కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా, డీఎస్పీ బాలసుందరరావు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా పర్యవేక్షణ

మార్కాపురం : మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సబ్‌కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆదివారం ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేశారు. విధి నిర్వహణకు ఉదయం నుంచే ఉద్యోగులు అధికంగా తరలివచ్చారు. ఉద్యోగులకు అవసరమైన అన్నీ ఏర్పాట్లు చేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ దినేష్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 2,14,608 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు 257 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని 27 సెక్టార్లు, 56 రూట్లుగా ఏర్పాటు చేశారు. 257 కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ఎస్వీకేపీ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, సామగ్రి చేరడానికి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన భద్రతా ఏర్పాట్లను కూడా చేశారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

పొదిలి : నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మొత్తం 66 పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతే కాకుండా ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు సామగ్రి చేరినట్లు అధికారులు వివరించారు.

అవీ..ఇవీ..

'పోల్'మంటూ పల్లెకు ప్రజలు

- బస్సులు లేక ప్రజల ఇక్కట్లు



ఓటు వేసేందుకు రైలులో గిద్దలూరుకు చేరుకున్న స్థానికులు

గిద్దలూరు, మే 12 : ఉద్యోగ, ఉపాధి కోసం పట్టణాలకు తరలివెళ్లిన స్థానికులు తమ ఓటు హక్కును వినియోగించు కొనేందుకు స్వగ్రామాలకు తరలి వస్తున్నారు. రైళ్లు, బస్సుల ద్వారా, ప్రైవేటు వాహనాల ద్వారా స్వగ్రామాలకు వస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర పట్టణాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతోపాటు ఇతర ఉద్యోగాలు, కంపెనీలలో పని చేసే అన్ని విభాగాల కూలీలు గత రెండు రోజులుగా స్వగ్రామాల బాట పట్టారు. కాచీగూడ నుండి గిద్దలూరుకు వచ్చిన రైలులో 70శాతం మంది గిద్దలూరు ప్రాంతవాసులే కావడం గమనార్హం. దీంతో రైల్వేస్టేషన్ నుంచి గుంపులు గుంపులుగా తమ గ్రామాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. అయితే ఆర్టీసీ బస్సులను ఎన్నికల సామగ్రి తరలించేందుకు, సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేయడంతో ఉన్న అరకొర బస్సులతో ఇక్కట్లకు గురయ్యారు. గ్రామాల నుంచి మోటార్ సైకిళ్లను తెప్పించుకొని కొందరు వెళ్లగా అధిక అద్దెలు చెల్లించి ఆటోలలో తరలివెళ్లారు. రెండు రోజులుగా గిద్దలూరు నియోజకవర్గానికి సుమారు 8 వేల మంది దాకా ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కూలీలు స్వగ్రామాలకు వచ్చినట్లు తెలిసింది. సోమవారం తెల్లవారేవరకు మరో 2వేల మందికి పైగా వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికితోడు ఇరుపార్టీలు ఓటుకు నోటు అందజేయడంతో వాటిని ఖర్చు చేసేందుకు ఓటర్లు దుకాణాలకు తరలిరావడంతో పట్టణమంతా బిజీబిజీగా దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి.



బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

పురాతన శివాలయంలో తవ్వకాలు



ముక్తేశ్వరాలయంలో తవ్విన గొయ్యి

బేస్తవారపేట, మే 12 : మండలంలోని మోక్షగుండం సమీపంలో అతి పురాతనమైన ముక్తేశ్వరాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ముక్తేశ్వరాలయంలో గుప్తనిధులు ఉన్నాయం టూ ఏళ్ల తరబడి ప్రచారంలో ఉంది. దీంతో పలుమార్లు దుండగులు తవ్వకాలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. అయితే శనివారం రాత్రి తర్వాత గుర్తుతెలియని దుండగులు ముక్తేశ్వరాలయంలో ప్రవేశించి ఆలయం ముందు భాగంలోని శివలింగాన్ని పెకిలించి సుమారు ఐదు అడుగుల గొయ్యి తీశారు. అయితే తెల్లవారుతుండడంతో దుండగులు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. బేస్తవారపేట ఎస్సై బి.నరసింహారావు ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో వృద్ధురాలి మృతి

కంభం, మే 12 : కంభం రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఫ్లాట్‌ఫాం అరుగుపై నిద్రిస్తూ గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. సుమారు 50 సంవత్సరాల వయస్సున్న ఈ వృద్ధురాలి వివరాలు తెలియ లేదు. సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు వృద్ధురాలి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

31 సమస్యాత్మక గ్రామాలు

పొదిలి, మే 12 : మండలంలో 51550 మంది 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 26013 మంది పురుషులు, 25537 మంది మహిళలు ఉన్నారు. మొత్తం 66 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ జరగనుంది. పొదిలి సర్కిల్ పరిధిలో మొత్తం 31 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు పొదిలి సీఐ మల్లికార్జునరావు తెలిపారు. పొదిలి మండలంలో 9, కొనకనమిట్ల మండలంలో 16, తర్లుపాడు మండలంలో ఆరు కేంద్రాలను గుర్తించామన్నారు. అయితే ఆ గ్రామాల్లో ముందస్తు చర్యగా ఇప్పటికే పలుమార్లు పోలీస్ కవాత్తు నిర్వహించామన్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాల పరిధిలో ఓటర్లకు, రౌడీషీటర్లకు పలు సూచనలు చేశారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికల జరిగే రోజున నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.

ఘాటెక్కిన పచ్చి మిర్చి.. కిలో రూ.100



మార్కాపురం వన్‌టౌన్, మే 12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు పచ్చడి మెతుకులు కూడా కరువయ్యాయి. మండుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు తోడు కూరగాయలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. మార్కాపురం కూరగాయల మార్కెట్‌లో పచ్చిమిర్చి కిలో రూ.100 కు చేరుకుంది. పేద, మధ్య తరగతి ప్రజలు నిత్యం పచ్చడి, పప్పు చేసుకోవాలన్న పచ్చిమిర్చి అవసరం. కానీ ధర ఆకాశానికి అందడంతో కొనుగోలు చేయడానికి కూడా జంకుతు న్నారు. కడప జిల్లా పులివెందుల మండలం నుంచి పచ్చిమిర్చి తెప్పిస్తున్నా మని అక్కడే కిలో రూ.60కి కొనుగోలు చేస్తున్నామని, రవాణా ఖర్చులు అధికంగా ఉన్నాయని కూరగాయాల వ్యాపారులు తెలిపారు. మార్కాపురం ప్రాంత రైతులు మిర్చి పండించినప్పుడు దీంట్లో పావు వంతు కూడా గిట్టుబా టు ధర లభించదు. ప్రభుత్వం స్పందించి కూరగాయాల ధరలు తగ్గించాలని కోరుతున్నారు.

ఓటు వేయండి..బియ్యం బస్తా తీసుకోండి!

- ఒంగోలులో వైసీపీ ప్రలోభాలు

ఒంగోలు(కార్పొరేషన్), మే 12: ఒంగోలు నియో జకవర్గంలో వైసీపి నేతలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. మొన్న పట్టాల పంపిణీ, దాని పే రుతో చీర, ప్యాంటు, షర్టులు..తాజాగా రూ.3వేలు నగదు.. అప్పటికీ ప్రజల్లో అభిమానం లేకపోవడం తో ఓటమి భయం తప్పదని భావించిన వైసీపీ శ్రే ణులు బియ్యం బస్తాల పంపిణీకి సిద్ధం అయ్యారు. రూ.50 నోటు ఇవ్వడం, దానిపై సీరియల్ నెంబరు బియ్యం షాపు యజమానికి ముందుగానే ఇవ్వడం తో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి తెర తీ శారు. గత రెండు రోజులుగా విచ్చలవిడి బియ్యం బస్తాలు అందించి ఓటర్లను ప్రలోభాలకు గురి చే శారు. ఇదిలా ఉంచితే కొన్ని శివారుకాలనీలలో రెండు కేజీల నూనె, ఆదివారం కావడంతో పలు చో ట్ల కేజీ మటన్ కూడా అందజేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వైసీపీ ఆధ్వర్యంలో ఉచితంగా అం దిస్తున్న బియ్యం పంపిణీ ఆ పార్టీ నేతలకు తల నొప్పిగా మారింది. ఓట్లు రాబట్టుకునేందుకు కొంద రికి బియ్యం బస్తాలు అందించగా, మరికొందరికీ ఏదీ అందలేదు. దీంతో వైసీపీ తీరుపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నేతలు అందించే బియ్యం బస్తా కోసం తెల్లవారుజాము వరకు ఎదురు చూగడగా, అందిస్తున్న బియ్యాన్ని పలు ప్రాంతాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంచితే ఆదివారం స్థానిక పెళ్ళూరులో, అలాగే 12వ డివిజన్‌లో వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కుప్పం ప్రసాద్ నేతృత్వంలో బియ్యం పంపిణీకి సిద్ధమయ్యారు. అయితే మీడి యా నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్ దాడులతో వెనుక డుగు వేసిన వైసీపీ నేతలు టోకెన్ పేరుతో అందిం చే రూ.50 నోటుపై బియ్యం తీసుకునే తేదీని ప్రక టించి అందజేశారు. సోమవారం జరిగే పోలింగ్‌లో వైసీపీకి ఓటు వేయండి, బియ్యం బస్తా తీసుకెళ్ళం డి అని ప్రచారం చేయడం బహిరంగ రహస్యం. అ యితే అన్నీ తెలిసిన అధికారులు మాత్రం యథేచ్ఛ గా ఓటు కోసం ప్రలోభాలకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులపై అధికారులు వెనుకడుగు వేయడంపై వి మర్శలు వినిపిస్తున్నాయి.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి అవసరం

మార్కాపురం, మే 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా గతంలో జరిగిన పోలింగ్‌లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న కేంద్రాలలో అదనపు బలగాలను వినియోగించాల్సి ఉంది. గెలుపోటములను నిర్ణయించే కొన్ని కేంద్రాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పశ్చిమ ప్రకాశంలో అత్యంత కీలకమైన మార్కాపురం నియోజకవర్గంలో పోటీ నువ్వా-నేనా అన్నట్లు ఉంది. సామాజిక సమీకరణాలు, ఆర్థిక, అంగ బలాల్లో ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని కేంద్రాల్లో గత ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

41 కేంద్రాలు అత్యంత సమస్యాత్మకం

నియోజకవర్గంలో మొత్తం 258 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 41 కేంద్రాలు అత్యంత సమస్యాత్మకమైనవి. గతంలో జరిగిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సారి పోలీసు శాఖ ఆయా కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టింది. ప్రధానంగా మార్కాపురం పట్టణంలో 58 కేంద్రాలకు గాను 12, మండల పరిధిలో 51కి 6, పొదిలిలో 66 కు 10, కొనకనమిట్లలో 48కి 7, తర్లుపాడులో 35కు 6 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా పోలీసులు అధికారులు గుర్తించారు. ఇవి కాక ఇంకా 20కి పైగా కేంద్రాలలో పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండే అవకాశం ఉంది.

మార్కాపురం నియోజకవర్గంలో పోలీసులు కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక పారా మిలటరీ బలగాలను మొహరించారు. అయినా కొన్నిచోట్ల ప్రస్తుతం పోలింగ్ సక్రమంగా జరిగే అవకాశాలు తక్కువే కనిపిస్తున్నాయి. మార్కాపురం మండలంలోని గొట్టిపడియలో రెండు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అక్కడ ప్రతి ఎన్నికల్లోనూ గొడవలు జరగడం సర్వసాధారణం, ఈసారి కూడా అక్కడ అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. అక్కడ వైసీసీ రెండు వర్గాలుగా ఉన్నా టీడీపీ శ్రేణులను ఓటింగ్‌కు వెళ్లనివ్వకుండా అడ్డుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా అక్కడ ఏమి జరిగినా వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామం కావడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా అందవు. ఈ నేపథ్యంలో అదనపు బలగాలు అక్కడ అవసరం అనేది స్పష్టమౌతోంది. అదే విధంగా మండలంలోని రాయవరం గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాల్లో కూడా పరిస్థితులు ఇబ్బందికరంగానే ఉన్నాయి. గజ్జలకొండలో కూడా అదే పరిస్థితి. పొదిలి మండలంలోని అక్కచెరువు, పోతవరం, కుంచేపల్లి, కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల, చినమనగుండం, నాగరాజుకుంట, తర్లుపాడు మండలంలోని మీర్జాపేట, పోతలపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కూడా ఇబ్బందికర పరిస్థితులు ఉండే అవకాశం ఉంది. ఆయా పోలింగ్ కేంద్రాలపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

గైర్హాజరయ్యే ఎన్నికల సిబ్బందిపై క్రిమినల్ కేసులు

కలెక్టర్ దినేష్‌కుమార్ హెచ్చరిక

ఎర్రగొండపాలెం, మే 12 : పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది ఆదివారం సాయంత్రం 5 గంటలలోపు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద రిపోర్టు చేయకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టరు ఏ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. ఎర్రగొండపాలెం అసెంబ్లీ పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం తనిఖీకి వచ్చిన సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ చెక్‌లిస్టు ప్రకారం సామగ్రి పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను కలెక్టరుకు రిటర్నింగ్ అధికారి శ్రీలేఖ వివరించారు. పోలింగ్ స్టేషన్లు అవసరమై సామగ్రి అత్యవసరంగా తరలించేందుకు ఆర్వో కార్యాలయం సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీలేఖ, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎర్రగొండపాలెం : నియోజకవర్గంలో అసెంబ్లి, పార్లమెంటు ఎన్నికల విధులు నిర్వహించేందుకు 1800 మందికి పైగా పీవో, ఏపీవోలు, ఓపీవోలు ఎన్నికల సామగ్రితో ఆది వారం మధ్యాహ్నం నుంచి పోలింగ్ స్టేషన్లుకు బయలుదేరి వెళ్లారని ఆర్వో శ్రీలేఖ తెలిపారు. నియోజకవర్గంలో 265 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ఒక పోలింగ్ స్టేషన్‌లో పీవో 1, ఏపీవో 1, నలుగురు ఓపీవోలు పోలింగ్ నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలో 29 రూట్లు ఏర్పాటు చేసి 29 మంది రూటు ఆఫీసర్లు, 29 మంది సెక్టారు ఆఫీసర్లు విధులకు హాజర య్యారన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ అధికారులను, పోలింగ్ సామగ్రిని తరలించేందుకు 29 రూట్లలో 49 బస్సులు, 6 తుఫాన్ వాహనాలు, రెండు కమాండరు జీబులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు నియోజకవర్గంలోని 265 పోలింగ్‌స్టేషన్లుకు సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ అధికారులు సామగ్రితో చేరుకున్నారన్నారు. నియోజకవర్గం అన్ని పోలింగ్ స్టేషన్లు వద్ద ఎన్నికల కోడ్ నిబంధనలను పోటీలో ఉన్న అభ్యర్థులు, ఓటర్లు పాటించి పోలింగ్ నిర్వాహణ సక్రమంగా జరిగేందుకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



కార్యక్షేత్రానికి తరలివెళుతున్న సిబ్బంది

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు(కల్చరల్), మే 12: హిందూ సనాతన ధర్మ సారథి శ్రీఆదిశంకరాచార్య జయంతి ఆదివారం ఘనం గా జరిగింది. ఎర్రన సాహి త్య పరిషత్ అధ్యక్షుడు మై నంపాటి సాయికుమార్ అధ్యక్షతన ఒంగోలు నగరం లాయర్‌పేటలోని హరేరా మ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా శంకరాచార్యలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రరసం అధ్యక్షులు పొన్నూరి వేంకటశ్రీనివాసరావు మాట్లాడుతూ సనాతన ధర్మసారథిగా భారతదేశం నలుమూలల నాలుగు పీఠా లు ఏర్పాటు చేసి హిందూ ధర్మస్థాపన చేసిన మహనీయులు ఆది శంకరాచార్య అన్నారు. మైనంపాటి సాయి కుమార్ మాట్లాడుతూ శంకరాచార్యుల వారి రచనలు శివానందలహరి, సౌందర్యలహరి, కనకధారా స్తోత్రం, భజగోవిందం వం టివి అనేకమంది జీవితంలో మార్పులు తెచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో నె మ్మాని సీతారామమూర్తి, చిలకపాటి రంగారావు, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, రాము, శివరాజు పుల్లయ్య, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ పరాంకుశం నరసింహాచార్యులు, మైనంపాటి హరినారాయణ, గడియారం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం సకలం ఒడ్డి..!

ఇళ్లు తాకట్టు పెట్టిన టీడీపీ అభ్యర్థి కందుల

సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా వైరల్

మార్కాపురం, మే 12: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ పర్యాయం అసెంబ్లీ ఎన్నికలు అత్యంత పటిష్టాత్మకంగా సాగుతున్నాయి. ఓటర్లు తమ నేతల తలరాతను నేడు రాయనున్నారు. ఈ పర్యాయం పోటీ టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు మధ్యే ఉంది. వారిలో ముఖ్యంగా ఆర్థిక, అంగబలాలో సమర్థవంతమైన పేరున్న వైసీపీ అభ్యర్థి అన్నా వెంకటరాంబాబు స్థానికేతరుడైనప్పటికీ, గెలుపు కోసం పచ్చనోట్లు పరిచినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇటు టీడీపీ వైపు పోటీలో ఉన్న కందుల నారాయణరెడ్డి అన్ని విషయాల్లో పోటీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఆయన ఆర్థిక వెసులుబాటు కోసం ఆస్తులు తాకట్టుపెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రెండు ఎన్నికలలో పోటీ చేసి ఆర్థికంగా చితికిపోయాడు. ఈ పర్యాయం మూడోసారి పోటీ చేస్తున్నాడు. ఇవే తన చివరి ఎన్నికలని చెబుతున్నాడు. చివరి ఎన్నికలు భావించి పోటీకి సకలం ఒడ్డి విజయం సాధించేందుకు కృషి చేస్తున్నాడు. చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితిలో ఉన్న కందుల ఆర్థికంగా కూడా వెనక్కు తగ్గలేని పరిస్థితి ఉంది. దీంతో సొంత ఇంటిని సైతం తాకట్టు పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు వైసీపీ అభ్యర్థికి ఆర్థిక పరమైన విషయాలలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పూర్తి సహాయ సహకారాలు అందించినట్లు తెలిసింది. దీంతో ఆయన ఓట్లకు నోట్లు పంపిణీ సులభమైంది.

ఎన్నికలకు మందు హామీలు, వ్యక్తిగత పరిచాయాలు, కులసమీకరణాలు అభ్యర్థులకు బలాన్ని చేకూరుస్తాయి. ఎన్నిక తేదీకి రెండు మూడు రోజుల ముందు మాత్రం ఆర్థిక పరమైన అంశాలే అభ్యర్థుల భవితను నిర్ధారిస్తాయనేది జగమెరిగిన సత్యం. ఈ క్రమంలో గెలుపు రుచి చూడాలనుకొనే అభ్యర్థులు నోట్ల పంపిణీలో కూడా పోటీపడాల్సిందే..! దీంతో ఆర్థిక సమీకరణల కోసం కందుల నారాయణరెడ్డి సొంత ఆస్తులను తాకట్టుపెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ పర్యాయం గెలుపు కోసం శక్తికి మించి కృషి చేస్తున్నాడని ప్రతిపక్ష వైసీపీ నాయకులే చెప్పుకుంటున్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఇక ప్రజల తీర్పు ఎలా ఉంటుందో నేడు చూడాల్సి ఉంది.

చెన్నయ్యకు లక్ష మల్లెల అర్చన



లక్ష మల్లెల అర్చనలో చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, మే 12: శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో జగద్గురు రామానుజాచారుల తిరునక్షత్ర మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళా భక్తబృందాలు లక్ష మల్లెల అర్చన కార్యక్రమం నిర్వహించారు. రామానుజాచార్యుల ఉత్సవ మూర్తికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈఓ గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మ వారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.



1



3



2

ఎన్నికలకు సర్వం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాలలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ సదర్శించి సిబ్బందికి కర్తవ్యబోద చేశారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా ఎన్నికల కిట్‌లు అందజేశారు. మార్కాపురం



4

1. సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, 2.హాజరైన ఎన్నికల సిబ్బంది, 3.కిట్‌ల కోసం క్యూలో ఉన్న ఉద్యోగుల, కిట్‌లు అందజేస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

అభ్యర్థుల భవితవ్యంపై ప్రజల తీర్పు నేడే!

దర్శి, మే 12: దర్శి నియోజకవర్గంలో పోటీచేస్తున్న అభ్యర్థుల భవితవ్యంపై ఓటర్లు సోమవారం పోలింగ్ ద్వారా తమ తీర్పును ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో మొ త్తం 2,26,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,233 మంది, మహి ళలు 1,12,129 మంది, మూడవ రకం ఓటర్లు 8 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 282 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతుంది. దర్శి అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థులకు, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థులకు ప్రజలు ఓట్లు వేయనున్నారు. దర్శి అసెంబ్లీకి మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ప్రధానంగా టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ బూచేపల్లి శివప్ర సాద్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పి.కొండారెడ్డితో పాటు బీఎస్‌పీ, తదితర పార్టీలతోపాటు మరికొందరు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

తెలుగుయువత నాయకుడిపై వైసీపీ కార్యకర్తల దాడి

» గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్లూరు సుబ్బు



గాయపడిన కల్లూరు సుబ్బును ఆసుపత్రిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్.పాపారావు, తదితరులు

దర్శి, మే 12: తెలుగు యువత దర్శి నియోజకవర్గ ప్రధానకార్యదర్శి కల్లూరు సుబ్బుపై బొట్లపాలెం గ్రామసమీపాన దోర్నపువాగు బ్రిడ్జి వద్ద వైసీపీ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం దాడిచేశారు. బాధితుని కథనం మేరకు.. కల్లూరు సుబ్బు స్వగ్రామం బొట్లపాలెం. ఆయన వివాహం చేసుకున్న తరువాత కొంతకాలంగా దర్శిలో నివాసం ఉంటున్నాడు. సొంత పనిమీద బొట్లపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా వైసీపీ కార్యకర్తలు గంగిరెడ్డి అంజిరెడ్డి, శ్యాగం అంజిరెడ్డి మరికొంత మంది దోర్నపువాగు బ్రిడ్జి వద్ద దాడి చేశారు. గొంతునులిమి హత్యాయత్నం చేశారు. అటువైపు వెళుతున్న ఎస్సీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు అడ్డుకుని రక్షించారు. రక్షించిన ఎస్సీ కాలనీ వాసులను కూడా వైసీపీ కార్యకర్తలు దూషించినట్లు కల్లూరు సుబ్బు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ మూకల దాడులు

రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందుతుందన్న భయంతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షతగాత్రుడు కల్లూరు సుబ్బును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పాపారావు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో స్వంతగ్రామం వెళ్లి వస్తున్న సుబ్బును దారికాచి దాడి చేయటం దారుణమన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంలో కవ్వింపు చర్యలకు, దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు వీరపనేని రంగ, జనసేన నాయకుడు పుప్పాల పాపారావు, తదితరులు ఉన్నారు.

వైసీపీని వీడిన 17 కుటుంబాలు



పువ్వాడి సమక్షంలో టీడీపీలో చేరుతున్న భూమిరెడ్డిపల్లె వాసులు

పామూరు, మే 12: పామూరు మండలంలో అధికార వైసీపీని వీడి ఉగ్రపై ఉన్న నమ్మకంతో టీడీపీలో చేరుతున్న వారిసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలోని వగ్గంపల్లి పంచాయతి బవిసిరెడ్డిపాలెంకు చెందిన 15 మంది వైసీపీ నాయకుల పోకడలు నచ్చక టీడీపీలో చేరారు. వారందరికి టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌రావులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా మండలంలోని మోపాడుకు చెందిన మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావుయాదవ్, సోదరుడు చినహుసేన్‌రావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమాల్లో సర్పంచ్ డి.సుబ్బయ్య, బి.జయరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎం.హుసేన్‌రావు యాదవ్, ఎం.గంగరాజుయాదవ్, ఇరిగినేని రవీంద్ర, గుర్రం వెంకటేశ్వర్లు, ఎం.గిద్దయ్య యాదవ్, దేవరపు మాల్యాద్రి, దారపనేని సుబ్బారావు, రియల్టర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, రాహుల్‌యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ వసతిని పరిశీలించిన ఈఈ



నాగంబొట్లపాలెం పోలింగ్ కేంద్రంలో విద్యుత్ వసతిని పరిశీలిస్తున్న ఈఈ అబ్దుల్ కరీమ్

తాళ్లూరు, మే 12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలో పోలింగ్ బూత్‌లకు ఏర్పాటు చేసిన విద్యుత్ వసతిని దర్శి విద్యుత్ ఈఈ అబ్దుల్ కరీమ్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని నాగంబొట్లపాలెం, తూర్పుగంగవరం, రామభద్రాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటుచేసిన విద్యుత్ వసతిని పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ వసతి ఏర్పాటుచేశారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఏఈకి సూచించారు. ఆయన వెంట ఏఈ వీరబ్రహ్మం, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

» యథేచ్ఛగా వైసీపీ చీరల పంపిణీ

ముండ్లమూరు, మే 12: ముండ్లమూరు మండలంలో వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి తరుపున ఆయన వర్గీయులు ఆదివారం రాత్రి ఓటర్లను మభ్యపెడుతూ చీరలు పంపిణీ చేశారు. మండలంలోని పెదరావిపాడు. బసవాపురం, ముండ్లమూరుతో పాటు పలు గ్రామాల్లో వీటిని పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా చీరలు పంపిణీ చేయటం పలు విమర్శలకు దారి తీసింది. పట్టించు కోవాల్సిన అధికారులు ఆవైపు కన్నెత్తి చూడలేదు.

స్వల్పంగా గాయపడ్డ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మే 12 : ఎన్నికల ప్రచార ముగింపుసభలో వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. కాలికి స్వల్పగాయం కావడంతో పాటు రెండు కాళ్లకు వాపులు రావడంతో నొప్పితో బాధపడుతున్నారు. వెంటనే వైద్యులు మాగుంటకు తగిన వైద్యం అందజేశారు. మాగుంట గాయపడినట్లు తెలిసిన వెంటనే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున కార్యాలయానికి తరలివచ్చి శ్రీనివాసులురెడ్డిని పరామర్శించారు.

కాగా, విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఒంగోలుకు వచ్చిన ఉద్యోగులు ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మాగుంటను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ మద్దతు తెలిపారు. తమతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో మాగుంట విజయం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం!



కనిగిరిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బంది

» మండుటెండలో ఇబ్బందిపడిన పోలింగ్ సిబ్బంది
» సౌకర్యాల లేమితో ఉద్యోగుల ఇబ్బందులు
» వసతులులేక ఉద్యోగినుల అవస్థలు
» సామగ్రితో కేంద్రాలకు చేరిక

కనిగిరి, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధంచేశారు. నియోజకవర్గంలోని 297 పోలింగ్ కేంద్రాలకు 60 రూట్లకు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఆదివారం చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ విస్తృత ఏర్పాటకై ఆదేశాలు జారీ చేయగా స్థానిక ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కనిగిరి పట్టణ సమీపంలోని వ్యవసాయమార్కెట్ యార్డును పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా కేటాయించారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి వివిధ విభాగాల్లో విధులు నిర్వహించేందుకు ఆరుగురు చొప్పున కేటాయించారు. దీంతో కనిగిరి నియోజకవర్గంలో 1782 మంది పోలింగ్ సిబ్బందితో పాటు అదనంగా మరో 250 మందిని అత్యవసర విధులకై రిజర్వుడులో ఉంచారు. అలాగే, దాదాపు 500 మందికి పైగా పోలీసు సిబ్బంది, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మరో 150 మందిని కేటాయించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద భోజన ఏర్పాట్లను, విధులకు హాజరయ్యే సిబ్బంది, ఉద్యోగులు వసతుల కల్పనను పర్యవేక్షించేందుకు మరో వంద మందిని కేటాయించారు. మున్సిపల్ సిబ్బంది మరో వంద మంది విధులు నిర్వర్తించారు. దాదాపు 2500 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బది 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు.



దర్శిలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్దకు ఉదయం పది గంటలలోపు చేరుకున్నారు. అయా రూట్ల వారీగా మెటీరియల్ పంపిణీ చేశారు. రిటర్నింగ్ అధికారి జాన్‌ఇర్విన్ పోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సోమవారం ఉదయాన్నే 5.30 గంటలకు తప్పనిసరిగా మాక్ పోలింగ్ చేసి 7 గంటలు నుంచి పోలింగ్ ప్రారంభించాలని సూచించారు.



కనిగిరి: సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలివెళుతున్న సిబ్బంది

సౌకర్యాల లేమితో సిబ్బంది అవస్థలు

ఎండల తీవ్రత అధికంగా ఉండటం, ఉక్కపోతతో సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎండ వేడిమికి పలువురు ఇబ్బందులు పడ్డారు. డిస్ట్రిబ్యూషన్‌కేంద్రం వద్ద సరిపడిన టెంట్లు వేయకపోవటంతో మండుటెండలో టెంట్లు అంచున సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12.30 గంటలకే భోజన వసతి ఏర్పాట్లు పూర్తికావాల్సి ఉండగా, 1.30కు కూడా భోజనాలు పూర్తి కాలేదు. మహిళా సిబ్బందికి కేటాయించిన భోజనస్టాల్ వద్ద మహిళలు భోజనం కోసం నిరీక్షించాల్సి వచ్చింది. అలాగే, టాయిలెట్స్ సరిగాలేక ఇబ్బందులు పడ్డారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన పోలీసు బలగాలు

పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలోని 297 పోలింగ్ కేంద్రాల వద్ద సుమారుగా వివిధ స్థాయిలో గల 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. సీఐ, ఎస్‌ఐల ఆధ్వర్యంలో 50 మొబైల్ పోలీసుపార్టీలు ఎన్నికల శాంతిభద్రతలకు వినియోగిస్తున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పోలింగ్ సందర్భంగా డీఎస్పీ రామరాజు ఆదివారం బందోబస్తును పర్యవేక్షించారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలైన కనిగిరి మండలంలోని యడవల్లి, హనుమంతునిపాడు మండలంలోని హాజీపురం వద్ద బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటుచేశారు. ఏ పోలింగ్ కేంద్రంలోనైనా సమస్య వచ్చినా వెంటనే మొబైల్‌పార్టీలు అక్కడికి చేరుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. మొబైల్ పార్టీలతో పాటు సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తులో పాల్గొననున్నాయి.



కనిగిరిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మండుటెండలో భోజనాల కోసం బారులుతీరిన ఉద్యోగినులు



దర్శిలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

దర్శిలోనూ అన్నిఏర్పాట్లు

దర్శి, మే 12: దర్శి నియోజకవర్గంలో సోమవారం జరిగే పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక మోడల్ స్కూల్ నుంచి పోలింగ్ మెటీరియల్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీవీఎస్ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులకు పంపిణీ చేశారు. దర్శి నియోజకవర్గంలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. నియోజకవర్గంలో 27 సమస్యాత్మక గ్రామాల్లో వెబ్ క్యాస్టింగ్ సీసీ కెమెరాలు అమర్చారు. మొత్తం రెండు వేలకు పైగా సిబ్బంది ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నారు. 312 మంది ప్రిసైడింగ్ అధికారులు, 312 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 43 మంది సెక్టార్ అధికారులు, 58 మంది రూట్ అధికారులతో పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది.



కనిగిరి: పోలింగ్ విధుల్లో పాల్గొనే బెటాలియన్ సిబ్బందికి సూచనలిస్తున్న పోలీసులు

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు తెలిపారు. 12మంది సీఆర్‌పీఎఫ్ అధికారులు, తమిళనాడు నుంచి వంద మంది స్పెషల్ పోలీస్ బెటాలియన్, 76 మంది బార్డర్ సెక్యూరిటీ దళాలు, మరో వంద మంది ఇతర సిబ్బంది అదనంగా దర్శి నియోజకవర్గానికి నియమించినట్లు చెప్పారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. స్వేచ్ఛగా నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు. ఎవరైనా ఆటంకాలు కల్పించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటర్లకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు

పామూరు, మే 12: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు మండల ఎన్నికల అధికారి షాకిర్‌పాష తెలిపారు. మండలంలో 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఎండ తగలకుండా టెంట్లు, మంచినీరు. విద్యుత్, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సీఎస్‌పురం మండలంలో 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు మండల ఎన్నికల అధికారి షేక్ నాగూర్‌మీరా తెలిపారు.

దొనకొండలో 47 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు

దొనకొండ, మే 12: మండలంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు 47 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేసినట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. 670 మందిపై ముందస్తు బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. సమస్యాత్మక గ్రామాలైన గంగదేవిపల్లి, దొండపాడు, ఇండ్లచెరు వు, కొచ్చెర్లకోట గ్రామాలలో కేంద్రబలగాలతో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు చెప్పారు.

కురిచేడులో అంతా సిద్ధం

కురిచేడు, మే 12: కురిచేడు మండలం సాక్వత్రిక ఎన్నికలకు అంతా సిద్ధం అయింది. మండలం మొత్తం మీద 40 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం 32,330 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 16,381 మంది, మహిళలు 15,947 మంది, ట్రాన్స్‌జెండర్‌లు ఇద్దరు ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. గతంలో ఎన్నికల సమయం లో గొడవలు జరిగిన సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.



పామూరు హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో పూర్తయిన ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికలకు సర్వత్రాఏర్పాట్లు

తాళ్లూరు, మే 12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లుచేశారు. మండలంలో 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. మండలంలో 37722 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగి పోలింగ్‌కు అంతరాయం జరిగితే తక్షణమే స్పందించేందుకు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక మొబైల్ వాహనాన్ని ఏర్పాటుచేశారు.



ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఘనంగా ఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు

దొనకొండ, మే 12: దొనకొండ మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర జయంతి సందర్భంగా శ్రీఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు ఆదివారం స్థానిక అడ్డురోడ్డులోని విజయాంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త అని అన్నారు. హిందూధర్మాన్ని సుస్థిరం చేయటానికి, వ్యాప్తి చేయడానికి దేశంలో నాలుగుమూలలా నాలుగు మఠాలను స్థాపించారన్నారు. ఈసందర్భంగా మహన్యాసకపూర్వ ఏకాదశి రుద్రాభిషేకాలు, బ్రాహ్మణులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం సెక్రటరీ హరికృష్ణ, కోశాధికారి ఎం.సాయిరామ అనీల్, గోపాలుని సుబ్రమణ్యం, డాక్టర్ ఎంఎం మల్లికార్జునశర్మ, అనుమల మణిబాబు, పి.మణికంఠశర్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యం

» ప్రారంభానికి నోచుకోని బాలికల హాస్టల్
» రూ.కోటిన్నర వెచ్చించి నిర్మాణం
» మూడేళ్లుగా నిరుపయోగం
» ఉన్నత విద్యకు దూరమవుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినులు
» పట్టించుకోని పాలకులు, అధికారులు

దొనకొండ, ఏప్రిల్ 12: వైసీపీ ప్రభుత్వ పెద్దలదంతా ఆర్భాటపు మాటలే తప్ప చేతల్లో ఏమీ ఉండటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని బడి మానేసిన బాలికలకు నాణ్యమైన విద్యా బోధన అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని పాలకులు చెప్తున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. దానికి దొనకొండ జడ్పీ పాఠశాల ఆవరణలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహ భవనమే నిదర్శనం. పాలకుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా అది మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా దర్శనమిస్తోంది.

టీడీపీ హయాంలో రూ.1.50 కోట్లతో పనులు

గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికలకు పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యను అందించాలనే ధ్యేయంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 150 మంది బాలికలు ఉండేందుకు దొనకొండకు బాలికల వసతి గృహాన్ని మంజూరు చేసింది. స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో భవనం ఏర్పాటు చేస్తే హాస్టల్‌లో ఉంటూ స్కూల్‌లో చదువుకునేందుకు బాలికలకు రక్షణగా ఉంటుందని అప్పట్లో అధికారులు భావించారు. అక్కడే భవన నిర్మాణం చేపట్టారు. దాదాపు కోటిన్నర రూపాయల వ్యయంతో మంజూరైన వసతి గృహ భవనాలకు టీడీపీ హయాంలోనే శంకుస్థాపన చేశారు. 2021 ఆగస్టు నాటికి పనులు పూర్తయ్యాయి. అన్ని సౌకర్యాలతో నిర్మించిన హాస్టల్‌ను మూడేళ్లుగా వినియోగంలోకి తేకుండా పాలకులు నిర్లక్ష్యం చేశారు.



జడ్పీ పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న బాలికల వసతిగృహం

చదువుకు బాలికల ఇబ్బందులు

దొనకొండలో బాలికల విద్యాభివృద్ధి నిమిత్తం బీసీ బాలికల హాస్టల్, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. గురుకుల పాఠశాలలో సీట్లు రాక, బీసీ బాలికల హాస్టల్‌లో అడ్మిషన్లు లేక పలు గ్రామాలకు చెందిన బాలికలు కొందరు చదువును మధ్యలో నిలిపివేయడం, మరికొందరు ఇళ్ల నుంచి ఆటోల్లో రాకపోకలు జరుపుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని గత టీడీపీ ప్రభుత్వం హాస్టల్ నిర్మాణాన్ని ప్రారంభించింది. వైసీపీ దాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేస్తోంది. దీంతో బాలికలు చదువుకు ఇబ్బందులు పడుతున్నారు. భవనాన్ని మాత్రం మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంట వండేందుకు ఉపయోగించుకుంటున్నారు.

కలెక్టర్ స్వయంగా సందర్శించినా స్పందన కరువు

గతేడాది మార్చిలో మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ దినేష్‌కుమార్ దొనకొండ జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. ఆ సందర్భంగా నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్‌ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధులు ఆయనకు విజ్ఞప్తి చేశారు.

స్పందించిన కలెక్టర్ భవనాన్ని సందర్శించి వివరాలు తెలుసుకొని వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఏడాది పూర్తవుతున్నా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా స్పందించి బాలికల హాస్టల్ భవనాన్ని వచ్చే ఏడాది నుంచైనా వినియోగంలోకి తెచ్చి గ్రామాల్లోని పేద కుటుంబాలకు చెందిన బాలికల విద్యాభివృద్ధికి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు షెల్టర్‌కు పూర్వవైభవం

కనిగిరి, మే 12: దశాబ్దాలుగా ఆక్రమణలతో మూసుకుపోయి అసాంఘిక కార్యక్రమాలకు ఆనవాలంగా తయారైన బస్ షెల్టర్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకున్నారు. మున్సిపాల్టీ పరిధిలో పామూరు బస్టాండు సెంటర్, ఒంగోలు బస్టాండు సెంటర్‌లు ప్రధానంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితం ఒంగోలు, పొదిలి వైపు వెళ్ళే ప్రయాణికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న బస్ షెల్టర్ వద్దకు వచ్చి బస్సులు ఎక్కేవారు. అయితే, ఆక్రమణలతో బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. దీంతో బస్‌షెల్టర్ వద్ద ఉండాలంటేనే దుర్వాసన వెదజల్లుతుంది. ఆప్రక్కనే ఉన్న షాపింగ్ కాంప్లెక్సు కూడా నిరుపయోగంగా మారిపోయింది. మరోపక్క బస్ షెల్టర్‌ను ఆనుకుని ఉన్న షాపుల ఆక్రమణలు రోడ్డుపైకి వచ్చేశాయి. బస్‌షెల్టర్ మరింత మూసుకుపోయింది.



ఒంగోలు బస్టాండ్ వద్ద ప్రయాణికుల ప్రాంగణం

ఈక్రమంలో ప్రయాణికులు ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద నిల్చొని ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా కనిగిరి మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన శ్రీనివాసరావు బస్‌షెల్టర్‌ను గుర్తించి దానిని శుభ్రం చేయించి రంగులు వేయించారు. బస్‌షెల్టర్‌కు ప్రయాణికుల ప్రాంగణం అని బోర్డు రాయించారు. ఆర్టీసీ అధికారులు కూడా బస్‌షెల్టర్ వద్దనే బస్సులను ఆపితే ఉపయోగకరంగా మారుతుందని ప్రయాణికులు భావిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి



ఈవీఎంలు తీసుకువెళుతున్న పోలింగ్ సిబ్బంది



సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఓటేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌లో ఓటేశారు. మిగిలిన సాధారణ ఓటర్లు సోమవారం ఈవీఎం యంత్రాలలో మీట నొక్కి వారి తీర్పుని ఇవ్వనున్నారు. షెడ్యూల్, నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచారం ఇలా ఒక్కో అంకం దాటుకుంటూ వచ్చిన ఎన్నికల సమరం తుది ఘట్టమైన సోమవారం పోలింగ్ డేకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ఓటేద్దాం..

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రశాంత ఓటింగ్‌కు పటిష్ఠమైన ఏర్పాట్లు
- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్.. సీసీ కెమెరాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- సెక్టార్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలిన సిబ్బంది





రేపల్లె: ఆయోవా బాలికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు



రేపల్లె : ఈవీఎంలను తీసుకుని వెళుతున్న ఎన్నికల సిబ్బంది



బాపట్ల : ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ల వద్ద పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది.



నరసరావుపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులకు కేటాయించిన సిబ్బంది అంతా పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచి తమతమ పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ప్రతి కేంద్రంలో 120 శాతం సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడ ఎటువంటి అవసరం వచ్చిన అందుబాటులో ఉండేలా రిజర్వ్ సిబ్బందిని కూడా నియమించారు. ఎక్కడైనా ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో ఏర్పాటు కు 20 శాతం అదనంగా సిద్ధం చేశారు. ఓటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శకంగా జరగాలని ఎన్నికల అధికారులు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వెలుపల జనం గూమికూడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్‌ని అమలు చేయనున్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల వెలుపలే ఉండి పరిశీలించుకోవాలి. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంది. అభ్యర్థులు తిరగడానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఒక వాహనంలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురికి మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతిచ్చింది. జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏదైనా సంఘటన జరిగితే దగ్గరలో ఉన్న అధికారులకు తెలిపి వెంటనే తగు చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కబరచడానికి క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు.

స్లిప్పులు లేకపోయినా ఓటు..

ఓటరు తన పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు తెలుసుకుని ఏదైనా గుర్తింపు కార్డుతో కేంద్రానికి వెళితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. స్లిప్పులు పొందలేకపోయిన వారు ఓటరు ఐడీ కార్డు తీసుకుని బూత్ వద్దకు వెళితే అక్కడి సిబ్బంది చూసి ఓటర్ స్లిప్పుని అప్పటికప్పుడు ప్రింట్ తీసి ఇస్తారు. ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపుకార్డులు తీసుకువెళ్లడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. వీటిలో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్ తదితర కార్డులను ఓటు హక్కు వినియోగం కోసం గుర్తింపు కార్డుగా అనుమతిస్తామన్నారు సాయంత్రం ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి ఎవరైతే ప్రవేశిస్తారో వారికి మాత్రమే టోకెన్ నెంబర్లు ఇచ్చి ఎంత సమయమైనా ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. సెల్‌ఫోన్లను పోలింగ్ కేంద్రాల ఆవరణలో నిషేధించారు. పోలింగ్ బూత్‌లు లొకేషన్‌కు ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, బారికేడింగ్, క్యూలైన్‌లు, వీటిపై షామియానాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేశారు.



ఈవీయంలను సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



ఎన్నికల విధులు రద్దు చేయడంతో వెనుదిరిగిన దివ్యాంగ ఉపాధ్యాయురాలు

పటిష్ఠ నిఘా.. పలువురు బైండోవర్

మున్సిపాల్టీలు, గ్రామాల్లో ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా వేలాది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో బందోబస్తుకు నియమించారు. శాంతియుత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ సాగడానికి పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను మొహరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రతి చోట పటిష్ఠ నిఘా పెట్టి పోలింగ్ ప్రక్రియను పోలీసులు పర్యవేక్షించనున్నారు. లోపల వెబ్‌కాస్టింగ్ ఉంటే బయట సీసీ కెమెరాలతో కదలికలను పోలీసులు గమనించ నున్నారు. నేరచరిత్ర ఉన్నవారిని ఇప్పటికే బైండోవర్ చేసిన పోలీసు శాఖ హద్దుదాటితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరికలు జారీ చేసింది. రాజకీయ పార్టీల అనుచరులు సైతం రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చూడడమే తమ ధ్యేయమని పోలీసు శాఖ చెబుతోంది.

మొత్తం ఓటర్లు 12,91,716

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓటర్ల సంఖ్య 12,91,716 మంది. వీరిలో పురుషులు 6,29,794 మంది ఉండగా, ఇతరులు 81, మహిళలు 6,61,841 మంది ఉన్నారు. ఓటర్లలో అత్యధికంగా అద్దంకిలో 2,44,057 మంది ఉండగా, అత్యల్పంగా బాపట్లలో 1,90,925 మంది ఉన్నారు. గత ఎన్నికల్లో జిల్లాలో 86 శాతం ఓటింగ్ జరగ్గా ఈ సారి ఆ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల జరిగిన పోస్టల్‌బ్యాలెట్ ఓటు శాతం కూడా దాదాపు 85 శాతం ఉండడంతో సోమవారం జరిగే ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉండొచ్చనేది పలువురి అభిప్రాయం.

జిల్లా వ్యాప్తంగా 1510 పోలింగ్ కేంద్రాలు

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 1510 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో 1030 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అద్దంకిలో అత్యధికంగా 69 ఉండగా, తర్వాత స్థానాల్లో బాపట్ల 68, పర్చూరు 62, రేపల్లె 51, వేమూరు 47, చీరాలలో 60 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,219 మంది సిబ్బంది ఎన్నికల ప్రక్రియ విధుల్లో భాగస్వాములు కానున్నారు. వీరిలో పీవోలు 1811 మంది ఉండగా, ఏపీవోలు 1808 మంది ఉన్నారు. ఓపీవోలు 7,252 మంది కాగా మైక్రో అబ్జర్వర్లుగా 348 మంది విధుల్లో ఉండనున్నారు. పోలింగ్ ప్రక్రియ కోసం జిల్లా పోలీస్ శాఖ నుంచి 1500 మంది విధుల్లో ఉండనుండగా, బీఎస్ఎఫ్, టీఎస్ఎస్‌పీ, ఐటీబీపీ కంపెనీల నుంచి 700 మంది వరకు బందోబస్తు విధుల్లో ఉండనున్నారు. తమిళనాడు నుంచి 250 మంది రాగా, ఎక్స్ ఆర్మీతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను కూడా వినియోగించుకోనున్నారు.

పోలింగ్‌కు నాలుగంచెల భద్రత

పల్నాడు జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 6,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలను రప్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్టాటిక్ ఫోర్స్, ఎస్ఐ స్థాయి అధికారితో రూట్ మొబైల్ పార్టీ, సీఐ స్థాయి అధికారితో మండల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీఎస్పీ స్థాయి అధికారితో నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌గా నాలుగంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరి పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి అదనపు ఎస్పీ స్థాయి అధికారి అదనపు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంచారు. 558 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఆయా కేంద్రాలకు ప్రత్యేకంగా కేంద్ర పారా మిలిటరీ బలగాలను బందోబస్తుకు నియమించారు.

బాపట్ల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం..

ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఓటింగ్ విషయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా టోల్ ఫ్రీ నంబరు 1950 తోపాటు 08643-297802 నంబరుకు ఫోన్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తెలిపారు. ఫిర్యాదు వచ్చిన నిమిషాల వ్యవధిలోనే సమస్యను పరిష్కరించేలా చూస్తామన్నారు. ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపిచ్చారు.



వినుకొండ: పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కుప్పకూలిన బండి నిర్మల





బాపట : కర్లపాలెం పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన భారీకేడ్‌లు

టెన్షన్ టెన్షన్

- ఓటరు నాడిపై అభ్యర్థుల్లో ఆందోళన
- చివరి ప్రయత్నంగా బుజ్జగింపులు, ప్రలోభాలు
- పోలింగ్ ముందు రోజూ విచ్చలవిడిగా వైసీపీ నగదు పంపిణీ
- డబ్బులు అందలేదని పార్టీ కార్యాలయాల వద్ద ఓటర్ల పడిగాపులు

బాపట్ల, గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచారం ముగిసింది.. ఓటనే ఆయుధంతో ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఈవీఎంలలో ఏ గుర్తుపై ఓటర్లు బటన్ నొక్కుతారనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. ఇక పెద్దఎత్తున నగదు పంపిణీపై ప్రచారాల నేపథ్యంలో తమకు ఆ మొత్తాలు అందలేదనే ఆందోళనలో ఓటర్లు ఉన్నారు. సుమారు రెండు నెలల నుంచి విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం నిర్వహించాలనే టెన్షన్‌లో అధికారులు ఉన్నారు. మొత్తం మీద అటు అభ్యర్థులు ఇటు అధికారులు మధ్యలో ఓటర్లు అందరూ కూడా వారివారి రీతుల్లో టెన్షన్‌లో ఉన్నారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ బూత్‌లు తెరుచుకోనుండగా ఓటర్లు ఈవీఎంలలో మీట నొక్కేందుకు సిద్ధమయ్యారు. ప్రచారం గట్టిగానే చేశాం.. ప్రత్యర్థి పార్టీలోని అసమ్మతి నాయకులను గుర్తించి మద్దతు పొందగలిగాం.. ప్రజల్లో ఆదరణ బాగానే ఉంది.. తెరవెనక పంపకాలను బాగానే చేశాం.. ఓటరు నాడీ ఏ తీరున ఉందోననే సందేహంతో అభ్యర్థుల్లో ఆందోళన. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను ఎన్నికల గండం గట్టెక్కిస్తాయన్న భరోసా పాలకపార్టీ నేతలది. వీటి నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరగనుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో ఓటర్ల నాడిపై విస్తృతంగా చర్చ నడిచింది. ప్రచారానికి శనివారం సాయంత్రమే తెరపడడంతో ఆదివారం మొత్తం కీలక నేతలతో మంతనాలు, పోలింగ్ బూత్‌లకు తమ ఓటర్లను తరలించడానికి చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై కసరత్తు చేశారు. కొన్ని దగ్గర్ల ప్రలోభాల పర్వాలు కూడా కొనసాగాయి. ద్వితీయశ్రేణి నేతల్లో ముఖ్యమైన వారితో అంతర్గత సమావేశాలను ఆదివారం అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. పంపకాల పర్వం అంతా సజావుగా జరిగిందా లేదా అని ఆరా తీయడంతో పాటు పోలింగ్ రోజు ప్రత్యర్థి పార్టీల ఎత్తుగడలు ఎలా ఉండనున్నాయి అనే కోణం లో కూడా నేతలతో సమీక్ష జరిపి తాము అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి చెప్పారు. సోమవారం పోలింగ్ డే కావడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళిపైనే దృష్టి పెట్టను న్నారు. ప్రత్యర్థిపార్టీలకు పట్టు ఉన్న బూత్‌లపై ఇరుపార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

కొనసాగిన పంపకాలు

ఓటర్లకు ప్రలోభాలు ఆదివారం కూడా కొనసాగాయి. నగదుతో ఎలాగైనా ఓటుని కొనుగోలు చేసేందుకు అధికార వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఇంకా ఎవరికైనా నగదు ఇవ్వకపోయి ఉంటే వారికి సోమవారం అయినా ఇస్తామని చెబుతూ ప్రలోభ పెడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మఫ్టీ పోలీసులు తిరిగారు తప్ప పెద్దగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టలేకపోయారు. కొందరైతే చూసీచూడనట్లుగా వదిలేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు యథేచ్ఛగా డబ్బు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నించారు. వైసీపీ ఈ దఫా పూర్తిగా ఓటర్లకు డబ్బు పంపిణీ పైనే ఎన్నికల్లో ఆధార పడింది. ఇందుకు కారణం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ముందు ఆ పార్టీ హామీలు తేలిపోయాయి. కాగా వైసీపీ ఇచ్చిన మేనిఫెస్టో గురించి ఎక్కడా చర్చ కూడా జరగలేదు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులంతా ఓటర్లకు నగదు పంపిణీ చేసి ఎలాగైనా గెలువాలని కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.3,500 వరకు నియోజక వర్గాన్ని బట్టి పంపిణీ చేశారు. కొన్ని చోట్ల తమకే ఓటు వేయాలని ప్రమాణం చేయించుకున్నారు. కాగా కొంతమంది అభ్యర్థుల అనుచరులు ఓటర్లకు డబ్బు పంచుతామని నేతల వద్ద తీసుకుని వాటిని నొక్కేశారు. దాంతో ఆదివారం పలువురు అభ్యర్థుల ఆఫీసుల, వార్డుల్లోని పార్టీ కార్యాలయాల ఎదుట ఓటర్లు పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు వేచి చూసి ఓపిక నశించి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.

ఓటు వేసిన వెంటనే వెళ్లేందుకు ప్రణాళిక

ఇతర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు జిల్లాకు వచ్చిన వారు ఓటు వేసిన వెంటనే వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం వరకే సెలవు కారణంగా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఓటు వేసి వెళ్లాలనే ఆలోచనలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఉన్నారు. ఆదివారం రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద తత్కాల్ సమయంలో విపరీతమైన డిమాండ్ తలెత్తింది. వేజండ్ల లాంటి చిన్న రైల్వేస్టేషన్‌లోనే 40 వరకు తత్కాల్ ఫారంలను ప్రయాణికులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే వారిలో కేవలం 10 మందికి మాత్రమే బుకింగ్ అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచే తిరుగు ప్రయాణాలు ప్రారంభం కానున్నాయి. రైల్వే శాఖ రెగ్యులర్ రైళ్లతో పాటు గుంటూరు మీదగా సికింద్రాబాద్‌కు సోమవారం ఏడు ప్రత్యేక రైళ్లను నడపబోతోన్నది. అలానే ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ కూడా వందల సంఖ్యలో స్పెషల్స్‌ని ఏర్పాటు చేశాయి.

పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా అపహరణ

కారంపూడి: మండలంలోని పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రంలోని సీసీ కెమెరా, కేబుల్ వైరును అపహరించారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్ల పరిధిలో 299 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది సీసీ కెమెరా, కేబుల్ వైరు అపహరణకు గురై ఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామాంజినేయులు కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్రంలో మరో సీసీ కెమెరా, కేబుల్ వైరు ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కేంద్రాలకు సామగ్రితో చేరిన సిబ్బంది
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు బస్సులు వచ్చే అవకాశం లేక అవస్థలు
- పోలీసుల బందోబస్తు

అద్దంకి, మే 12 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో అద్దంకి పట్టణంతో పాటు 5 మండలాలలో 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి పోలింగ్ అధికారులతో పాటు మొత్తం 6గురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఇక ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కనీసం ఒకరు కు తగ్గకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. సుమారు 500 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సెక్టార్ ఆఫీసర్‌లు, మొబైల్ టీమ్‌లు కూడా విధులు నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల నుంచి ఎన్నికల సిబ్బందిని కేటాయించడంతో మధ్యాహ్నం వరకు వస్తునే ఉన్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద సరైన వసతులు లేకపోవడంతో పోలింగ్ సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఇక సాయంత్రం 4 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సిబ్బంది పోలింగ్ సిబ్బంది వారికి కేటాయించిన వాహనాలలో తరలివెళ్లారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్దకు బస్సులు వచ్చే అవకాశం లేకపోవడంతో బంగ్లా రోడ్డులోనే బారులు తీరాయి. దీం తో సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బంగ్లా రోడ్డు వరకు పోలింగ్ సామగ్రితోపాటు తమ లగేజీని తీసుకువచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. మహిళా ఉద్యోగులు మరింత ఇబ్బంది పడ్డారు. ఆయా రూట్‌లకు సిబ్బం దిని వాహనాలలో పంపేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో మరింత ఆలస్యం అయింది. దీంతో సిబ్బంది మరింత అసహనానికి గురయ్యారు.

144 సెక్షన్ అమలు

బల్లికురవ : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉందని ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని బల్లికురవ ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలలో ఉన్న పో లింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారని ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియెగించుకోవాలన్నారు. ఎక్కడైనా ఎవరైనా పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలింగ్ నిర్వహణకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నా రు. ఫ్యాక్షన్ గ్రామం వేమవరంలో వెబ్ కెమెరాల ద్వా రా ఓటింగ్ జరుగుతుందన్నారు. అలానే రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. పోలింగ్ కేద్రానికి రెండు వందల మీటర్ల దూరం ఎవరు ఉండరాదని అయన తెలిపారు. అలానే పలు రూట్లలో పోలీ సు సిబ్బందిని ఏర్పాటు చేశామని ఎక్కడైన ఎవైన గొడవలు జరిగితే వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

చీరాల : పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు అన్ని పూర్తి చేసినట్లు ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పోలింగ్ అధికారులు, పోలీసులకు ఎన్నికల నియమావళి, విధి నిర్వహణపై అవగాహన శిక్షణలో భాగంగా అధికారులు దిశానిర్దేశం చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పోలీస్ శాఖ పరంగా డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పోలింగ్ రోజు పోలీస్ అధికారులు, సిబ్బంది తీసుకోవల్సిన జాగ్రత్తలు, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ జరిగేందుకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. పీవోలు, ఏపీవోలకు తమ, తమ ఎన్నికల సామగ్రిని అందజేశారు. ఎన్నికల ఏ ర్పాట్లకు సంబంధించి ఈఆర్వో సూర్యనారాయణరెడ్డి మా ట్లాడుతూ మొత్తం పోలింగ్ ప్రక్రియలో భాగంగా పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు 22 రూట్లు నిర్దేశించామన్నారు. పీవోలు, ఏపీవోలతోపాటు ఓపీవోలు మొత్తం 1239 మంది పోలింగ్ ప్రక్రియలో విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ అధికారులకు తగిన శిక్షణ ఇచ్చి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని అందజేశామన్నారు. పోలింగ్ అధికారులు, మెటీరియల్ తరలింపుకు 20 ఆర్టీసీ బస్సులు, 43 ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం రాత్రికి పోలింగ్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకుంటారన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 218 బూత్‌లు ఉన్నాయన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్‌లు ఏర్పాటు చేపించామన్నారు. అలానే ఎండల తీవ్రత నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ఓటర్లకు ఇబ్బంది లేకుండా షామియాలనాలు, మంచినీటి వసతి కల్పించామన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ సామగ్రితో ఉన్న సిబ్బంది



ఈవీఎంలతో వాహనాల వద్దకు వెళ్తున్న సిబ్బంది



పర్చూరులో పోలింగ్ విధులకు హాజరైన సిబ్బంది

295 కేంద్రాల ఏర్పాటు

పర్చూరు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పగడ్బందీగా చేశారు. దీనికి సంబంధించి ఆదివారం బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సిబ్బందికి అవరసమైన ఈవీఎం, వీవీ ప్యాడ్స్ తదితర సామగ్రిని అందజేశారు. ఆయా సెక్టార్ పరిధిలోని ఎన్నికల కేంద్రాలకు బూత్‌లవారీగా పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో వాహనాల్లో సిబ్బందిని తరలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పంచాయతీ, రెవెన్యూ సారథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు 295 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో గంధం రవీందర్ తెలిపారు. దీనికి సంబంధించి 3500 మంది సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణలో సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. మైక్రో అబ్జర్వర్, వెబ్‌కేమ్‌తో పాటు, నేరుగా సీఈవో కంట్రోల్ రూంకు సమాచారం అందేలా వెబ్‌కేమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 53 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,29,333 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషలు 1,11,865, మహిళలు 1,17,462, ఇతరులు 6గురు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు.

నేడు పోలింగ్

మార్టూరు : సోమవారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు మార్టూరు మండలంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రికి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను తరలించారు. మండలంలో 72 పోలింగ్ బూత్‌లున్నాయి. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు చెందిన 57121 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, తాగునీరు. ఎండల దృష్ట్యా షామియానులను ఏర్పాటు చేశారు. అంతేగాకుండా ఓటర్లుకు ముఖ్యంగా మహిళలతో సహా ప్రత్యేకంగా బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. కేంద్రాలను ఎంపీడీవో నితిన్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్దకు పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేసినట్లు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతమైన వాతావరణంలో ఓటర్లు తమ ఓటు వేసుకునేలా ఏర్పాట్లు చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలో మేజర్ పంచాయతీ మార్టూరులో అధికంగా 19 పోలింగ్ కేంద్రాలు వలపర్ల గ్రామంలో 11 పోలింగ్ బూత్‌లున్నాయి.

ఇంకొల్లు : మండలంలోని 13 పంచాయతీలలో 20 గ్రామాలలో 54 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఆదివారం పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శ్రీదేవి పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఇంకొల్లు పంచాయతీ పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హనుమోజిపాలెంలో ఒకటి, గొల్లపాలెంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మల్లికార్జునరావు కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సిబ్బందితో పకడ్బందీ చర్యలు చేపట్టారు.







కొత్తపేటలో కేంద్రాల వద్ద సూచికలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది.. మార్టూరు కాలేజీకి సామగ్రితో వస్తున్న సిబ్బంది.. ఎన్నికల నిబంధనలను వివరిస్తున్న డీఎస్పీ ప్రసాద్



తటస్థులే కీలకం..!

వారు ఎటు మొగ్గితే అటే గెలుపు

చీరాల, మే 12 : చీరాల. పోరాటాల పురుటిగడ్డ. చైతన్యం ఈ ప్రాంత ప్రజల సొంతం. విలక్షణ తీర్పు వారి నైజం. చీరాల నియోజకవర్గ ఆవిర్భావం నుంచి జరిగిన ఎన్నికల ఫలితాలు అందుకు దర్పణం పడుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చీరాల నియోజకవర్గంలో త్రిముఖ పోటీ బలంగా కనిపిస్తోంది. వినిపిస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో తటస్థ ఓటర్లు అభ్యర్థుల జయాపజయాలపై గణనీయమైన ప్రభావం చూపనున్నారు. వారు ఎటు మొగ్గితే అటే గెలుపు ఉంటుందని రాజకీయ మేధావులు అంచనా వేస్తున్నారు. 2014 ఎన్నికలలో ఆమంచి కృష్ణమోహన్ నవోదయం (స్వతంత్ర అభ్యర్థిగా) పార్టీ తరఫున పోటీలో నిలిచారు. టీడీపీ అభ్యర్థిగా పోతుల సునీత, వైసీపీ అభ్యర్థిగా యడం బాలాజీ బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఆమంచికి 57,544 ఓట్లు రాగా, పోతుల సునీతకు 47,209 ఓట్లు, యడం బాలాజీకి 40,995 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన ఆమంచి తరువాత టీడీపీలో చేరారు. 2019 ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వైసీపీలో చేరి ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ క్రమంలో టీడీపీ వ్యూహాత్మకంగా కరణం బలరామకృష్ణమూర్తిని టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఆ ఎన్నికలలో బలరాంకు 83,163 ఓట్లు రాగా, ఆమంచికి 65,251 ఓట్లు వచ్చాయి. తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల క్రమంలో ప్రస్తుత ఎన్నికలలో టీడీపీ కూటమి అభ్యర్థిగా ఎంఎం కొండయ్య, వైసీపీ అభ్యర్థిగా కరణం బలరాం తనయుడు కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆమంచి పోటీలో ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఆ తరువాత నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో గెలిచిన పార్టీలకు దూరమయ్యారు. ఆ క్రమంలో వారివారి గెలుపులో పాలుపంచుకున్న వేలమంది తటస్థులుగా మారారు. సంప్రదాయ టీడీపీ ఓటర్లలో అత్యధికులు కొండయ్యతోనే ప్రయాణం చేస్తున్నారు. ఇక తటస్థులుగా మారినవారు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా త్రిముఖ పోటీలో ఏ అభ్యర్థికి ఓటు వేస్తే తమకు భవిష్యత్‌లో న్యాయం జరుగుతుందనే కోణంలో వారు ఆలోచిస్తున్నారు. మొత్తం మీద తటస్థ ఓటర్లు ఎటు మొగ్గితే అటు అంతిమంగా విజయం దక్కుతుందని, టీడీపీ కూటమివైపు వారు ఆలోచిస్తున్నట్లు కన్పిస్తోందని రాజకీయ విశ్లేషకులతో పాటు, ఆయా పార్టీల శ్రేణులు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అద్దంకి నియోజకవర్గంలో 2,44,057 మంది ఓటర్లు



అద్దంకి, మే 12 : అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,19,570 మంది పురుషులు కాగా, 1,24,475 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. 298 పోలింగ్ కేంద్రాలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే సంతమాగులూరు మండలంలో మొత్తం 51,401 మంది ఓటర్లు కాగా, వారి లో25,460 మంది పురుషులు, 25,938 మంది మహిళలు, ముగ్గురు ఇతరులున్నారు. బల్లికురవ మండలంలో మొత్తం ఓటర్లు 43,943 మంది కాగా, 21,871 మంది పురుషులు, 22,071 మంది మహిళలు, ఇతరులు ఒకరు ఉన్నారు. అద్దంకి రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 39,731మంది కాగా, 19,610 మంది పురుషులు, 20,119 మంది మహిళలు, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అద్దంకి పట్టణంలో మొత్తం ఓటర్లు 31,572 మంది కాగా, 15,121 మంది పురుషులు, 16,445 మంది మహిళలు, 6 మంది ఇతరులు ఉన్నారు. జె.పంగులూరు మం డలంలో మొత్తం ఓటర్లు 39,501 మంది ఓటర్లు కాగా, 19,207 మంది పురుషులు, 20,294 మంది మహిళలు ఉన్నారు. కొరిశపాడు మండలంలో మొత్తం ఓటర్లు 37,909 మంది ఓటర్లు కాగా, 18,301 మంది పురుషులు, 19,608 మంది మహిళలు ఉన్నారు.

మార్టూరులో 15389 ఓటర్లు, వలపర్ల గ్రామంలో 8230 ఓటర్లు, ద్రోణాదుల గ్రామంలో 5488 ఓటర్లు ఉన్నారు. దాంతో ఈ మూడు గ్రామాలపైనే టీడీపీ కూటమితోపాటు వైసీపీ వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఇక మిగిలిన గ్రామాలలోనాగరాజుపల్లి, బొబ్బేపల్లి, జొన్నతాళి, రాజుపాలెం, డేగరమూడి, చిమ్మిరిబండ, కోలలపూడి, కోనంకి ,బొల్లాపల్లి, తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరడంతో మార్టూరు మండలంలో కూటమికి మంచి మెజారిటీ వస్తుందన్న ధీమాలో ఉన్నారు.

యద్దనపూడి మండలంలో 14 గ్రామ పంచాయతీలలో 21525 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామాలలో 28 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. మండలంలోని పూనూరు గ్రామంలో అధికంగా 5 బూత్‌లుండగా వాటిలో 4265 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తర్వాత యద్దనపూడి గ్రామంలో 4 బూత్‌లుండగా వాటిలో 2868 మంది ఓటర్లు ఉన్నారు. ఇ క మండలంలోని శ్యామల వారిపాలెంలో 90వ బూత్‌లో అత్యల్పంగా 287 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లును పూర్తి చేసినట్లు తెలిపారు.

ఓటు వేయండి..ఉచిత వైద్య పరీక్షలు పొందండి

శ్రీ కామాక్షి కేర్ హాస్పటల్ ఎండీ దేవరాజ్

చీరాల, మే 12 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. సోమవారం ఓటు వేసిన వారు తమ ఆసుపత్రిలో ఉచితంగా షుగర్, ఈసీజీ పరీక్షలు చేయించుకోవచ్చని శ్రీ కామాక్షికేర్ హాస్పటల్ ఎండీ తాడివలస దేవరాజ్ ఆదివారం తెలిపారు. అయితే ఓటు వేసినట్లు వేలిపై సిరా గుర్తు చూపి ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే వారి సంఖ్య పెంచాలనే సదుద్దేశంతనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు దేవరాజ్ తెలిపారు.

స్వల్పంగా గాయపడ్డ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మే 12 : ఎన్నికల ప్రచార ముగింపుసభలో వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో టీడీపీ కూటమి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. కాలికి స్వల్పగాయం కావడంతో పాటు రెండు కాళ్లకు వాపులు రావడంతో నొప్పితో బాధపడుతున్నారు. వెంటనే వైద్యులు మాగుంటకు వైద్యం అందించారు. మాగుంట ఆయన అభిమానులు పరామర్శించారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే ఏలూరి

వైసీపీ పాలనలో ఐదేళ్లూ అవరోధాలే..!

- ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి
- భవిష్యత్ తరాలకు ఇదే కీలకఘట్టం
- ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 12 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవరోధాలే తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని, ప్రజలకు ఈ ఎన్నికలే సరైన అవకాశమని.. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని టీడీపీ ప్రజా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అనేక సమస్యలతో సతమతమై ఇబ్బందులు పడ్డ ప్రజలంతా భావితరాల భవిష్యత్ కోసం ఓటు అనే వజ్రాయుధంతో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. యువ ఓటర్లంతా బంగారు భవిష్యత్ కోసం ముందుకు సాగాలన్నారు. అపార రాజకీయ అనుభం, విజన్ ఉన్న చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి మంచిరోజులు రానున్నాయని, దీనికి ప్రజలు ఓటు హక్కుతో అవకాశం కల్పించాలన్నారు. ప్రజా కూటమి అనూహ్య రీతిలో భారీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పర్చూరు ప్రజల ఆకాంక్షను తీర్చేలా నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఓటు వేయకపోతే పట్టాలు రద్దు

ఓటర్లను భయపెడుతున్న వైసీపీ నాయకులు

గంగవరం (ఇంకొల్లు), మే 12 : ఓటు వేయకపోతే పట్టాలు రద్దు చేస్తామని వైసీపీ నాయకులు ఓటర్లను భయపెడుతున్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో వైసీపీ నాయకులు ఓటర్లను బెదిరిస్తున్నారని టీడీపీ గ్రామ నాయకుడు కెల్లంపల్లి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఎస్సీ కాలనీలో 30 ఎస్టీ కుటుంబాల వారున్నారు. వీరంతా టీడీపీకి అనుకూలంగా ఓటు వేస్తారనే అనుమానంతో స్థానిక వైసీపీ నాయకులు ఆదివారం రాత్రి పై విధంగా బెదిరింపులకు పాల్పడ్డారని వెంకటేశ్వర్లు ఆరోపించారు. వైసీపీకి ఓటు వేయకపోతే మీ పట్టాలు రద్దు చేయిస్తామని ఓటర్లను బెదిరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కాలనీకి వెళ్లడంతో వైసీపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు

దొనకొండ, మే 12: దొనకొండ మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శంకర జయంతి సందర్భంగా శ్రీఆదిశంకరాచార్య ఆరాధనోత్సవాలు ఆదివారం స్థానిక అడ్డురోడ్డులోని విజయాంజనేయస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదిశంకరాచార్యులు అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ఏకీకృతం చేసిన భారతీయ తత్వవేత్త అని అన్నారు. హిందూధర్మాన్ని సుస్థిరం చేయటానికి, వ్యాప్తి చేయడానికి దేశంలో నాలుగుమూలలా నాలుగు మఠాలను స్థాపించారన్నారు. ఈసందర్భంగా మహన్యాసకపూర్వ ఏకాదశి రుద్రాభిషేకాలు, బ్రాహ్మణులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం సెక్రటరీ హరికృష్ణ, కోశాధికారి ఎం.సాయిరామ అనీల్, గోపాలుని సుబ్రమణ్యం, డాక్టర్ ఎంఎం మల్లికార్జునశర్మ, అనుమల మణిబాబు, పి.మణికంఠశర్మ పాల్గొన్నారు.

పోలింగ్ ముందురోజు వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు, మరికొందరు

బల్లికురవ, మే 12 : పోలింగ్ సమయం కొన్ని గంటలలో ఉండగా వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. బల్లికురవ జడ్పీటీసీ సభ్యులు చిం తల అంజలి శ్రీనివాసరావు వైసీపీకి గుడ్‌బై చెప్పి ఆదివారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెంకు చెందిన జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాసరావు, గ్రామ వైసీపీ అధ్యక్షుడు పూరేటి వెంకటనారాయణ వారి అనుచరులతో కలిసి వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మె ల్యే గొట్టిపాటిని కొమ్మినేని వారిపాలెంకు ఆహ్వానించి ఆయన సమక్షంలో వారు టీడీపీకి మద్దతు తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్ర చారం ముగిసి ఓటింగ్‌కు గంటల వ్యవధి ఉన్న సమయంలో జడ్పీటీసీ, గ్రామ వైసీపీ నేతలు మూకుమ్మడిగా వైసీపీని వీడడంతో బిగ్ షాక్ తగిలింది. ఇప్పటికే బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో వైసీపీ నేతలు గత పదిరోజుల వ్యవధిలో పెద్ద ఎత్తున వైసీపీని వీడి సైకిల్ ఎక్కారు. కొత్త పాత నేతల కలయికలతో టీడీపీ కేడర్ జోష్‌లో ఉంది. ఎన్నికలలో మండలంలో అత్యధిక మెజారిటీ సాధిస్తామని వారు అంటున్నారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన జడ్పీటీసీ సభ్యురాలు అంజలి శ్రీనివాసరావు

టీడీపీలో చేరిన కోటపాడు వైసీపీ శ్రేణులు

పంగులూరు : మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆదివారం వీరందరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్పవరం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కోటపాడుకు చెందిన వైసీపీ కుటుంబాలు

వైసీపీ నిర్లక్ష్యం.. ప్రయాణం నరకం..!

- అభివృద్ధికి నోచుకోని ఇంకొల్లు - పర్చూరు రోడ్డు
- రూ.22కోట్ల నిధులు మంజూరు
- చేసిన కొంత పనులకు కాంట్రాక్టర్‌కు చెల్లించని బిల్లులు
- నాలుగేళ్లుగా అవస్థలు
- డైవర్షన్ రోడ్డుపైనా గుంతలు

ఇంకొల్లు, మే 12 : ఇంకొల్లు టు పర్చూరు ఆర్అండ్‌బీ రహదారి రెండులైన్లగా విస్తరణ చేసేందుకు ప్రభుత్వం రూ.22కోట్లు మంజూరు చేసింది. ఏడాదిగా ప్రారంభించిన పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేశారు. గత ఏడాది మార్చిలో రోడ్డ విస్తరణ పనులు ప్రారంభించి ఇంకొల్లులో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు పర్చూరు వరకు సాగర్ కాల్వలపై కల్వర్టర్లను నిర్మించారు. దగ్గుబాడు వద్ద వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. వంకాయలపాడు వద్ద చెరువుకట్టకు సైడు వాల్స్ కొంతమేరకు పూర్తి చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద పెద్ద చింతమానులను తొలగించారు. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగుతున్నాయి కదా ఇంకేముంది ఈ ప్రాంతవాసులు ఇంకొల్లు నుంచి పర్చూరు రహదారిలో ప్రయాణ కష్టాలు తప్పి సుఖంగా సాగుతోందని ఊహించారు.



వంకాయలపాడు చెరువు వద్ద మధ్యలో నిలిచిన పనులు

కానీ అది కలగానే మిగిలింది. ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రెండు లైన్‌లుగా అభివృద్ధి చేసేందుకు రూ.22కోట్ల నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టరు చేసిన పనులకు సుమారు రూ.5కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదే. రోడ్డు అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గత నాలుగైదు నెలలుగా కాంట్రాక్టరు పనులు చేసేందుకు నిరాకరించి ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామన్నట్లు సమాచారం. నాలుగేళ్లలుగా ప్రయాణికులు ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకయాతనలు పడుతున్నారు. ముఖ్యంగా ఇంకొల్లు నుంచి వంకాయలపాడు మార్కెట్ యార్డ్ వరకు రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ 13 కిలో మీటర్ల మేర 20నిమిషాలు సాగాల్సిన ప్రయాణం 45 నిమిషాలపైనే పడుతోందని ప్రయాణికులు చెప్తున్నారు. పూసపాడు అడ్డరోడ్డు వద్ద ఉన్న నక్కవాగుపై వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇక్కడ డైవర్షన్‌రోడ్డు వేసారు. అది కూడా గుంతలమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బంది జరుగుతోంది. వైసీపీ నిర్లక్ష్యం వల్లే ఇబ్బందిపడుతున్నామని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



డైవర్షన్ రోడ్డుపై గుంతలు.. అడ్డరోడ్డు వద్ద శిథిలమైన వంతెన


ఆందోళన చేస్తున్న పోలింగ్ రిజర్వు సిబ్బంది

రిజర్వ్ పోలింగ్ సిబ్బంది ఆందోళన

● వసతుల కల్పనలో అధికారులు విఫలం

అద్దంకి, మే 12 : వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆదివారం రాత్రి రిజర్వ్ పోలింగ్ సిబ్బంది ఆందోళనకు దిగారు. అద్దంకి నియోజకవర్గంలో సుమారు 1800 మంది సిబ్బందిని 298 పోలింగ్ స్టేషన్‌లలో విధులు నిర్వహణకు కేటాయించారు. అదే సమయంలో సుమారు 300 మంది వరకు రిజర్వ్ సిబ్బంది ఉన్నారు. అవసరమైన సమయంలో విధులు నిర్వహించేందుకు ఈ సిబ్బందిని కేటాయించే అవకాశం ఉంది. అయితే రిజర్వ్ సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. రాత్రి 9 గంటలకు వరకు కనీసం భోజనం, మంచినీటి వసతిని కూడా కల్పించ లేదని ఆందోళనకు దిగారు. అదే సమయంలో విశ్రాంతి, రాత్రి సమయంలో నిద్రించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మహిళా సిబ్బంది మరింత ఇబ్బంది పడే పరిస్థితి ఉందని, ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు పోవడంతో పాటు హెల్ప్‌లైన్‌కు కూడా తెలియజేసినట్లు తెలిపారు. సిబ్బంది ఆందోళన చేయడంతో అధికారులు మొక్కుబడిగా రాత్రి 10 గంటల సమయంలో ఉప్మా పెట్టి చేతులు దులుపుకున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మహబూబ్ సుభానీని వివరణ కోరగా సిబ్బంది సమస్యను ఆర్వో దృష్టికి తీసుకెళ్లామని, ఎలాంటి సమాధానం లేకపోవడం తో మిన్నకున్నట్లు తెలిపారు. సిబ్బందిని వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు రెండు ప్రత్యేక బస్సులు తెప్పించామని, అయితే ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సూచనలు లేకపోవడంతో విరమించుకున్నట్లు తెలిపారు.


దేవిసంధ్య (ఫైల్)


అశ్విని (ఫైల్)

ఆగి ఉన్న బైకును ఢీకొట్టిన కారు

● ఇద్దరు బాలికలు మృతి

● స్వల్పగాయాలతో బయటపడిన తండ్రీకుమార్తె

చినగంజాం, మే 12 : ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు బాలికలు మృతి చెందారు. ఈ సంఘటన చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలోని 216వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బాపట్లకు చెందిన ఎల్లావుల వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరు గ్రామంలోని స్వీటు కార్ఖానాలో పని చేస్తూ కుటుంబాని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య భారతి ముగ్గురు కుమార్తెలు దేవి సంధ్య, జస్విత, అశ్విని ఉన్నారు. ఆదివారం ఉదయం 7గంటలకు బాపట్ల వెళ్లేందుకు ఒక ద్విచక్రవాహనంపై వెంకటేశ్వర్లు, భారతి, మరో ద్విచక్రవాహనంపై వెంకటేశ్వర్లు సోదరుడు ఎంపరాల లక్ష్మణ్, దేవి సంధ్య, జస్విత, అశ్విని ఉప్పుగుండూరు గ్రామం నుంచి బయలు దేరారు. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు వారు స్వగ్రామమైన బాపట్ల బయలుదేరి వెళ్తున్నారు. వెంకటేశ్వర్లు ఎంత దూరంలో ఉన్నారో చూసేందుకు చినగంజాం రొంపేరు బ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారిపై లక్ష్మణ్ ద్విచక్రవాహనాన్ని ఆపాడు. ఈ సమయంలో హైదరాబాద్ నుంచి వి.నరేంద్రరెడ్డి తన సొంత కారులో ఒంగోలులోని అత్త గారింటికి వెళ్తూ ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. ఈ సంఘటనలో దేవిసంధ్య (12), అశ్విని(7) తీవ్ర గాయాలు కాగా, లక్ష్మణ్, జస్విత గాయపడ్డారు. వీరిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన దేవిసంధ్య అశ్వినిలను వైద్యులు పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కారు డ్రైవర్ నిద్ర మత్తులో ఉండి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు తెలుస్తుంది. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. నరేంద్రరెడ్డిని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, దేవిసంధ్య 4వ తరగతి చదువుతుంది. ముగ్గురు ఆడపిల్లలు అయినప్పటికీ ఆనందంగా జీవించేవారు. ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఒకరిని విడిచి ఒకరు ఉండేవాళ్లు కాదు. వారి అన్యోన్యతను చూసి ఓర్వలేని విధి ప్రమాద రూపంలో వారిని విడదీసింది. ముగ్గురులో మొదటి, చివరి అమ్మాయిలు మృతి చెందగా, రెండో అమ్మాయి స్వల్ప గాయాలతో చికిత్స పొందుతోంది. ఓట్లు వేసేందుకు వెళ్తూ ప్రమాదంబారిన పడడం విన్న ప్రతి ఒక్కరూ కంటతడిపెట్టారు. పిల్లలను కోల్పోయిన ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

మాగుంటను కలిసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 12: విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఒంగోలుకు వచ్చిన ఉద్యోగులు ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మాగుంటను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ మద్దతు తెలిపారు. తమతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో మాగుంట విజయం కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

దర్శిలో 2,26,370 మంది ఓటర్లు

దర్శి, మే 12: దర్శి నియోజకవర్గంలో పోటీచేస్తున్న అభ్యర్థుల భవితవ్యంపై ఓటర్లు సోమవారం పోలింగ్ ద్వారా తమ తీర్పును ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,26,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,233 మంది, మహి ళలు 1,12,129 మంది, మూడవ రకం ఓటర్లు 8 మంది ఉన్నారు.

నేడు పోలింగ్

సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం

ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకూ ఓటింగ్

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది, సామగ్రి

జిల్లాలో 18,22,470 మంది ఓటర్లు

ఒంగోలు పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు పోటీలో 140 మంది అభ్యర్థులు

సగానికి పైగా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, ఒంగోలు సెగ్మెంట్లో అన్నిచోట్లా ఏర్పాటు

ఓటుకు వేళాయె..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 486 సమస్యాత్మకంగా గుర్తించిన అధికారులు అక్కడ పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. సగానికి పైగా కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేశారు. ఒంగోలు అసెంబ్లీ స్థానాన్ని క్రిటికల్ సెగ్మెంట్‌గా గుర్తించిన నేపథ్యంలో మొత్తం పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ మధ్య పోలింగ్ జరగనుంది.


గిద్దలూరులో పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత కీలకమైన పోలింగ్ సోమవారం జరగనుంది. రానున్న ఐదేళ్ల తమ భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధిని నిర్దేశించే పాలకులను ఎంపిక చేసుకొనేందుకు ఓటు ద్వారా ప్రజలు తీర్పు ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 18,22,470 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 9,07,980 మంది కాగా, మహిళలు 9,14,379 మంది, మరో 111 మంది థర్డ్ జండర్ ఓట్లు ఉన్నాయి. వెయ్యి మంది లోపు ఓటర్లు ఉన్న దగ్గర ఒకటి, అంతకు మించి ఓటర్లు ఉంటే రెండేసి పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఇలా మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా 486 సమస్యాత్మకంగా గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థానానికి 25 మంది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 115మంది కలిపి 140 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

పోలింగ్ విధుల్లో 14,768 మంది సిబ్బంది

ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక పోలింగ్ అధికారి(పీవో), ఏపీవో, మరో నలుగురు ఇతర సిబ్బందిని నియమిస్తున్నారు. కొందరు రిజర్వుడ్ సిబ్బందితో కలిసి మొత్తం 14,768 మంది పోలింగ్ విధుల్లో ఉండనున్నారు. సమస్యాత్మకగా గుర్తించిన 486 కేంద్రాలలో ఒక్కో చోట ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. దాదాపు మూడున్నర వేలకుపైగా పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండనున్నాయి. సగానికి పైగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని చోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీలో గందరగోళం

ముందుగానే ఇంటింటికీ తిరిగి ఓటరు స్లిప్పులు ఇవ్వాలన్న ఈసీ ఆదేశం జిల్లాలో సక్రమంగా అమలు కాక ఓటర్లలో కొంత గందరగోళం నెలకొంది. అయితే పోలింగ్ సమయంలో ఆయా కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉండి స్లిప్పులు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. కాగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, మెటీరియల్‌ను పంపిణీకి యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. సంతనూతలపాడు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారైన జేసీ గోపాలకృష్ణ ఆ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఉండి పర్యవేక్షించగా, ఇతర చోట్ల ఆర్వోల సమక్షంలో పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

జిల్లా అంతటా ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రానికే సిబ్బంది, మెటీరియల్‌ను చేర్చారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకచోట సంబంధిత రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటలకే ఇక్కడికి చేరుకున్న ఆ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి మెటీరియల్ అందజేశారు. వారిని మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సుల్లో రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. అక్కడ రెవెన్యూ, మునిసిపల్ సిబ్బంది నిఏర్పాట్లు చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుండగా కేంద్రాల వద్ద మంచినీరు, ఇతర ప్రాథమిక సౌకర్యాలను కల్పించారు.

పోలింగ్ ముగిసిన వెంటనే స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు చేర్చేలా ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ ఒంగోలు సమీపంలోని రైజ్ కళాశాలలో నిర్వహించనున్నారు. అన్ని సెగ్మెంట్ల ఈవీఎంలను అక్కడికి చేర్చుతున్నారు. పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, వైపాలెం, దర్శి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాలు దూరంగా ఉండటంతో అక్కడి ఈవీఎంలను ఈవీఎంలను తొలుత ఆ ప్రాంతంలోని ఒక చోటకు చేర్చనున్నారు. ఆ తర్వాత అన్నీ కలిపి రైజ్ కాలేజీకి తెచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇక తూర్పు ప్రాంతంలోని ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గాల ఈవీఎంలు పోలింగ్ అనంతరం నేరుగా రైజ్ కాలేజీకి చేర్చనున్నారు.

ఓటర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

- ఓటు హక్కు వినియోగించుకొనే వారు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఓటరు స్లిప్పుతోపాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డును తప్పని సరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలి.
- ఈవీఎంలో బటన్ నొక్కిన తర్వాత బీప్ శబ్దం వచ్చినప్పుడు మాత్రమే ఓటు వేసినట్లు నిర్ధారణ అవుతుంది.
- ఈవీఎం బటన్‌ను వీవీప్యాడ్ నుంచి స్లిప్ బయటకు వచ్చే వరకు నొక్కి ఉంచాలి.
- వీవీప్యాడ్ స్లిప్‌తో ఓటు ఎవరికి వేసింది నిర్ధారించుకోవచ్చు.
- పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లకూడదు.
- పోలింగ్ బూత్‌లోకి వెళ్లే సరికి అక్కడ మీ ఓటు లేకపోయినా, ఓటర్ లిస్ట్‌లో పేరు గల్లంతైనా.. ఓటరు కార్డు, ఆధార్ చూపించి సెక్షన్ 49ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు.
- అప్పటికే ఎవ్వరైనా మీ ఓటు వేసినట్లయితే ధైర్యంగా టెండర్ ఓటును అడగవచ్చు.



భారీ భద్రత

» పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

» బూత్‌లోకి సెల్‌ఫోన్ నిషేధం

ఒంగోలు (క్రైం), మే 12 : జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకుంది. పటిష్ట భద్రత ఏర్పాటు చేసింది. 2,402 మంది సివిల్ పోలీసులతోపాటు 13 కంపెనీల్లోని వెయ్యి మంది కేంద్ర బలగాల సేవలను వినియోగించుకుంటోంది. రెండు నియోజకవర్గాలకు ఒక అదనపు ఎస్పీని ఎన్‌చార్జిగా నియమించారు. వీరితోపాటు 9 మంది డీఎస్పీలు, 38 మంది సీఐలు, 73 మంది ఎస్సైలు, 8 మంది ట్రైనీ ఎస్పీలు విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. బూత్‌లోకి సెల్‌ఫోన్‌ను నిషేధించారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనలను అతిక్రమించినా, శాంతిభద్రతలు ఉల్లంఘించినా ప్రజలు వాట్సాప్ నెంబర్ 9121102266కు సమాచారం ఇవ్వవచ్చు. డయల్ 100, 112 నంబర్లకు ఫోన్‌చేసి చెప్పవచ్చు. ఆదివారం స్థానిక రావ్ అండ్ నాయుడు కాలేజీ నుంచి ఎన్నికల విధుల వెళ్తున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ గరుడ్ సుమిత్ సమావేశమయ్యారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సుమిత్

నిన్న అరాచకాలు - నేడు ప్రలోభాలు

ఐదేళ్లలో అరాచకాలు, అక్రమాలు

ప్రశ్నిస్తే దాడులు, ఆపై కేసులు

ఎన్నికల వేళ అవే ప్రచారాస్త్రాలు

జనాగ్రహంతో వైసీపీ విలవిల

శాంతింపజేసేందుకు భారీ తాయిలాలు

ఓటుకు నోటు

ఆపై వస్తువుల పంపిణీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారాన్ని అడ్డంపెట్టుకొని నిన్నమొన్నటి వరకూ అరాచకాలు, భూఆక్రమాలకు జిల్లాలో వైసీపీ నాయకులు తెగబడ్డారు. వాటిని నెమరు వేసుకున్న ప్రజలు ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో గెలుపుకోసం వారిని శాంతింపజేసేందుకు భారీ ప్రలోభాలకు తెగబడ్డారు. సోమవారం పోలింగ్ జరగనుండగా కొన్ని నియోజకవర్గాల్లో అదనపు ప్రలోభాలకు తెరతీయడం అందులో భాగంగానే కనిపిస్తోంది. అయితే నిశిరాత్రి ప్రారంభమైన అదనపు ప్రలోభాలపై జనం తిరగబడటంతో వైసీపీ నాయకులు విలవిలలాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గత ఐదేళ్లలో అరాచకాలు, భూఆక్రమణలు భారీగా జరిగిన సంగతి జగమెరిగిన సత్యం. జిల్లా కేంద్రం ఒంగోలు భూఆక్రమణలతో దద్దరిల్లిపోయింది. అధికారపార్టీ వారే అందుకు కారణం. చివరికి సిట్ ఏర్పాటు ద్వారా సరిదిద్దుకునే ప్రయత్నం చేసి వైఫల్యం చెందారు. ఈ భూఆక్రమణల వ్యవహారం వైసీపీకి తలనొప్పిగా మారింది. ఇదే విషయమై ప్రజల్లోనూ విస్తృత చర్చ నడిచింది. మార్కాపురంతోపాటు ఆ డివిజన్‌లోనూ భూఆక్రమణలు భారీగా జరిగాయి, ప్రభుత్వ భూముల ఆక్రమణలతోపాటు ప్రైవేట్ వ్యక్తుల భూములు లాగేసుకున్నారు. కారుకులైన అధికార పార్టీ నాయకులు తప్పుకొని ఉద్యోగులపై నేరం మోపారు. దీంతో 15 మంది సస్పెండయ్యేందుకు కారుకులయ్యారు.

ప్రజలనెత్తిన టోపీపెట్టిన వ్యక్తికే టికెట్

కనిగిరి నియోజకవర్గంలో అధికారపార్టీ నేతలు అక్రమంగా ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో తమ పేర్లపై మార్చుకోవడం, ప్రైవేట్ వ్యక్తుల భూములను ఆక్రమించుకోవడం భారీగా జరిగింది. కనిగిరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో ప్రజల నెత్తిన టోపీ పెట్టిన వ్యక్తి ఇప్పుడు వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. సంతనూతలపాడులో సాగునీటి కాలువను ఆక్రమించి ఇంటిని నిర్మించుకున్న వైసీపీ ఎమ్మెల్యే వ్యవహారంపై లోకం కోడైకూసింది. ఇక అధికారపార్టీ నేతలు పోలీసుల అండతో సాగించిన దాడులు, ఆకృత్యాలతో అనేక కుటుంబాలు వీధులపాలయ్యాయి. మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ఒంగోలులో సుబ్బారావు గుప్తాపై చేసిన దాడి, వైసీపీ నేతల శాడిజానికి పరాకాష్టగా నిలిచింది. ఒక షాపు అద్దె విషయాన్ని అడ్డుపెట్టుకొని ఒక ఇంటిపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేసి హింసించడం ప్రజల కళ్లముందు మెదలాడుతోంది. అలాగే కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలం రావివారిపాలెం గ్రామంలో నడిరోడ్డుపై ఒక దళిత మహిళ హనుమాయమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన వైసీపీ శ్రేణుల అరాచక చర్యను అక్కడి వారు ఇప్పటికీ మర్చిపోలేదు. అంతేకాకుండా ఇదే రీతిలో వైసీపీ అంతర్గత కలహాలతో సింగరాయకొండ మండలంలో ఒక యువకుడిని లారీతో గుద్ది హత్యచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో మా ఊరుకు రోడ్డెయ్యండి అని అడిగిన పాపానికి జనసేన కార్యకర్త యోగయ్యను అధికారపార్టీ నేత వెంటాడి వేధించారు. అది భరించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గిద్దలూరు నియోజకవర్గంలో మునయ్య అనే గిరిజన యువకుడు టీడీపీలో చేరాడనే నేపంతో నెలక్రితం వైసీపీ నాయకులు దారుణంగా హత్య చేయించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎర్రగొండపాలెంలో ముఖ్య ప్రజాప్రతినిధి సారథ్యంలో భూదందాలు భారీగా జరిగాయి. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ఒక వ్యక్తి దారుణంగా హత్య, బాధిత కుటుంబ సభ్యుల పోరాటంతో పోలీసులపై చర్య తీసుకొని, అధికారపార్టీ నేతను మాత్రం కాపాడటం అక్కడ ప్రజానీకం ఇప్పటికి మరిచిపోలేదు. కొనకనమిట్ల మండలంలో కడప నుంచి వచ్చిన వైసీపీ వారు భూఆక్రమణలకు దిగడమే కాక ఒక వ్యక్తిని పొట్టనబెట్టుకున్నారు. ఇలాంటి అనేక ఉదంతాలు జనాగ్రహానికి కారణమయ్యాయి.

వెంటాడుతున్న ఓటమి భయం

జనాగ్రహం ప్రచారంలో తేటతెల్లమైంది. దీంతో పోటీలో ఉన్న ఇతర పార్టీల వారికన్నా వైసీపీ అభ్యర్థులు భారీమొత్తంలో ఓటర్లను ప్రలోభం చేసేందుకు శ్రీకారం పలికారు. ప్రత్యేకించి ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఉద్యోగులు ముకుమ్మడిగా టీడీపీ కూటమికి వేయడంతో వైసీపీ నాయకులకు మరింత భయం పెరిగింది. దీంతో ఓటు రేటును భారీగా పెంచారు. ఒంగోలులో అయితే ఓటుకు రూ.3వేలు ఇచ్చిన వైసీపీ ఆ తరువాత ఇంటింటికీ బియ్యం బస్తాను పంపిణీ చేసింది. అంతకు ముందు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అయిన ప్రయోజనం కనిపించడం లేదన్న అనుమానంతో ఆదివారం నిశిరాత్రి మరికొన్ని ప్రలోభాలకు తెరతీయగా ప్రజలు, టీడీపీ శ్రేణుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. కొన్ని ప్రాంత్రాల్లో ఈ అలజడితో పోలీసులు రంగప్రవేశం చేయడంతో వైసీపీ శ్రేణులు వెనక్కితగ్గారు. దర్శిలో కూడా వైసీపీకి ఎక్కడ తగ్గకుండా టీడీపీ ఢీ అంటే ఢీ అంది. దీంతో పరిస్థితి తమకు అనుకూలంగా లేదని గమనించి ఆదివారం నిశిరాత్రి వైసీపీ శ్రేణులు ఇంటింటికీ చీరల పంపిణీకి శ్రీకారం పలికారు. ఈ వ్యవహారాన్ని ప్రజలు వ్యతిరేకించడమే కాకుండా అనేక గ్రామాల్లో పంపిణీ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. గిద్దలూరు, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల్లో ఓటమి భయం పెరిగి ఆదివారం రాత్రి వైసీపీ నాయకులు అదనపు ప్రలోభాలకు తెరతీయగా ప్రతిచోటా ప్రజలు వాటికి అడ్డుకట్ట వేయడం విశేషం. మార్కాపురంలో అయితే వైసీపీ తరువాత ప్రలోభాల పాత్ర పోషిస్తున్న కొందరిని ప్రజలు పోలీసులకు పట్టించడం జరిగింది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

కొండపి, మే12: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు తమ ఓటు వేసుకునేందుకు, పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలోని 283 పోలింగ్ కేంద్రాలకు 283 మంది పీవోలు, ఏపీవోలు కేటాయించారు. 283 పోలింగ్ కేంద్రాల్లో 1,190 మంది ఓపీవోలు పనిచేస్తారు. 41 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఉంటారు. 216 సీసీ కెమెరాలను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. 29 మంది రూట్ అధికారులను ఏర్పాటు చేశారు. టంగుటూరు మండలంలోని రైస్ కృష్ణసాయి గాంధీ ఇనిస్టిట్యూషన్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పోలింగ్ సిబ్బంది ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ సామగ్రితో సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

టంగుటూరు, మే 12 : ఎన్నికలు ముగిసేవరకూ పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ కొనసాగుతుందని ఎన్నికల అధికారులు ఆదివారం వెల్లడించారు. ఐదుగురికి మించి ఎక్కడైనా గుమిగూడితే పోలీసులు చర్యలు తీసుకుంటారని వారు హెచ్చరించారు. ఎన్నికలు ముగిసేవరకు రెండు రోజులపాటు మే 11 సాయంత్రం 5గంటల నుంచి మే 13 సాయంత్రం 6గంటల వరకు వైన్ షాపులు, బార్లు మూసి ఉంచుతారు. అంతవరకు లిక్కర్ అమ్మకాలు నిషిద్ధం అన్నారు. పోలింగ్ ముంగిట ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు గుర్తిస్తే అలాంటి వారిని వెంటనే అరెస్ట్ చేస్తారని చెప్పారు. ఎన్నికల ఊరేగింపులు, ర్యాలీలు, సినిమాలు, టీవీల ద్వారా ప్రచారం నిర్వహించడం నిషిద్ధమన్నారు. మొబైల్స్ ద్వారా ఎన్నికల సందేశాలను పంపించడం, ఒపీనియన్ సర్వేలు నిర్వహించడం నిషేధించారన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే రెండేళ్ల జైలు లేదా భారీ జరిమానా విధించే అవకాశం ఉంటుందన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

టంగుటూరు, మే 12 : ఒంగోలు పార్లమెంట్ పరిధిలో రౌడీ రాజ్యం పోవాలంటే ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామిని గెలిపించుకోవాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవి బాబు కోరారు.

కనిగిరిలో పోలింగ్ సిబ్బంది అవస్థలు

» మండుటెండలో ఇబ్బందులు

» సౌకర్యాల లేమితో వెతలు

» వసతులులేక ఉద్యోగినుల అవస్థలు

» సామగ్రితో కేంద్రాలకు చేరిక

కనిగిరి, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కు అధికారులు సర్వం సిద్ధంచేశారు. నియోజక వర్గంలోని 297 పోలింగ్ కేంద్రాలకు 60 రూట్లకు పోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తించేందుకు ఆదివారం చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల కమిషన్ విస్తృత ఏర్పాటకై ఆదేశాలు జారీ చేయగా స్థానిక ఆర్‌ఓ జాన్‌ఇర్విన్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కనిగిరి పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి డిస్ట్రి బ్యూషన్ కేంద్రంగా కేటాయించారు. ఒక్కో పోలింగ్ కేం ద్రానికి వివిధ విభాగాల్లో విధులు నిర్వహించేందుకు ఆరు గురు చొప్పున కేటాయించారు. దీంతో కనిగిరి నియోజక వర్గంలో 1782 మంది పోలింగ్ సిబ్బందితో పాటు అద నంగా మరో 250 మందిని అత్యవసర విధులకై రిజర్వు డులో ఉంచారు. అలాగే, దాదాపు 500 మందికి పైగా పోలీసు సిబ్బంది, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మరో 150 మందిని కేటాయించారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద భోజన ఏర్పాట్లను, విధులకు హాజరయ్యే సిబ్బంది, ఉద్యోగులు వసలతుల కల్పనను పర్యవేక్షించేందుకు మరో వంద మందిని కేటాయించారు. మున్సిపల్ సిబ్బంది మరో వంద మంది విధులు నిర్వర్తించారు. దాదాపు 2500 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బది 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పో లింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వ ద్దకు ఉదయం పది గంటలలోపు చేరుకు న్నారు. ఆయా రూట్ల వారీగా మెటీరియల్ పంపిణీ చేశా రు. రిటర్నింగ్ అధికారి జాన్‌ఇర్విన్ పోలింగ్ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సోమవారం ఉదయాన్నే 5.30 గంటలకు తప్పనిసరిగా మాక్ పోలింగ్ చేసి 7 గంటలు నుంచి పోలింగ్ ప్రారంభించాలని సూచించారు.

సౌకర్యాల లేమితో సిబ్బంది అవస్థలు

ఎండల తీవ్రత అధికంగా ఉండటం, ఉక్కపోతతో సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎండ వేడిమికి పలువురు ఇబ్బందులు పడ్డారు. డిస్ట్రిబ్యూషన్‌కేంద్రం వద్ద సరిపడిన టెంట్లు వేయకపోవటంతో మండుటెండలో టెంట్లు అంచున సిబ్బంది నానా ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 12.30 గంటలకే భోజన వసతి ఏర్పాట్లు పూర్తికావాల్సి ఉండగా, 1.30కు కూడా భోజనాలు పూర్తి కాలేదు. మహిళా సిబ్బందికి కేటాయించిన భోజనస్టాల్ వద్ద మహిళలు భోజనం కోసం నిరీకించాల్సి వచ్చింది. అలాగే, టాయిలెట్స్ సరిగాలేక ఇబ్బందులు పడ్డారు.


కనిగిరిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మండుటెండలో భోజనాల కోసం బారులు తీరిన ఉద్యోగినులు

పోలింగ్ కేంద్రాలకు తరలిన పోలీసు బలగాలు


పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. నియోజక వర్గంలోని 297 పోలింగ్ కేంద్రాల వద్ద సుమా రుగా వివిద స్థాయిలో గల 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో 50 మొబైల్ పోలీసుపా ర్టీలు ఎన్నికల శాంతిభద్రతలకు వినియోగిస్తున్న ట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. పోలింగ్ సందర్భంగా డీఎస్పీ రామరాజు ఆదివారం బందోబస్తును పర్యవేక్షించారు. సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలైన కనిగిరి మం డలంలోని యడవల్లి, హనుమంతునిపాడు మండలం లోని హాజీపురం వద్ద బందోబస్తును పకడ్బందీగా ఏర్పా టుచేశారు. ఏ పోలింగ్ కేంద్రంలోనైనా సమస్య వచ్చినా వెంటనే మొబైల్‌పార్టీలు అక్కడికి చేరుకునేలా అధికారు లు చర్యలు చేపట్టారు. మొబైల్ పార్టీలతో పాటు సీఆర్పీ ఎఫ్ బలగాలు బందోబస్తులో పాల్గొననున్నాయి.

మహాశయులారా..! సోమవారం (నేడు) మీరు ఓటు వేయడానికి సిద్ధమవుతున్నారా...?! అయితే ఈవీఎంలో బటన్ నొక్కడానికి ముందు ఒక్కక్షణం ఆలోచించండి...! ఓటుకి నోటిచ్చారనే కృతజ్ఞతతోనూ, పక్కంటివారికి ఇచ్చి మాకు ఇవ్వలేదనే కోపంతోనే మీ ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు.. ఎవరు ఇచ్చినా.. ఎంత ఇచ్చినా... తీసుకోండి.. ! భద్రంగా దాచుకోండి... కాని ఓటుకు మాత్రం నోటుతో ముడిపెట్టకండి. గత ఐదేళ్ల పాలనను గుర్తుకు తెచ్చుకోండి. అప్పుడే నొక్కండి..ఈవీఎం బటన్...!

ఒక్క క్షణం..!

- ఈవీఎం బటన్ నొక్కేముందు ఆలోచించండి!
- తట్టెడు ఇసుక దొరక్క పడ్డ తంటాలు చూడండి..
- కొల్లగొట్టిన సిలికా, క్వార్ట్జ్‌ను పరికించండి
- పోలీసుల దౌర్జన్యాలను వీక్షించాం..
- కావలి వేధింపు ఘటనలు కళ్లారా చూశాం..
- ఆకాశాన్నంటిన నిత్యావసరాలు..
- గుదిబండగా మారిన గ్యాస్, కరెంట్ బిల్లులను భరించాం కదా ?
- పెట్రోలు, డీజిల్ భారాలు కూడా మోశాం కదా ?
- చివరకు దిక్కులేనివారిలా రాజధాని లేని రాష్ట్రంలో బతుకులు ఈడ్చాం..
- ఈ కష్టాలకు కారకులెవరో...?

ఇప్పుడు నొక్కండి.. గట్టిగా ఈవీఎం బటన్ !



నెల్లూరు, మే12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలసీ పేరుతో మూడు నెలలపాటు ఇసుక అనుమతులను రద్దు చేశారు. దీంతో మనింటి పక్కనున్న భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పస్తులు ఉండేలా చేశారు. ఇసుక పాలసీ పేరుతో భవన నిర్మాణ యజమానులపై వేలాది రూపాయల భారాన్ని మోపారు. అధికార వైసీపీ నాయకులు మాత్రం దర్జాగా ఇసుకను కొల్లగొట్టుకుపోయారు. సిలికా, క్వార్ట్జ్ లీజుదారులను తరిమికొట్టి, వైసీపీ పెద్దలు వాటిని కొల్లగొట్టిన వైనాన్ని చూశాం. ఇంటి పక్కనున్న గుట్టలో నుంచి కానీ, ఊరి మొగదాల ఉన్న చెరువులో బండెడు మట్టి కానీ తోలుకోలేని దౌర్భాగ్యపు పాలకులు రాజ్యమేలడం కూడా మీరే చూశారు.

● ఈ సన్నివేశాల్ని గుర్తు చేసుకోండి..

పోలీసులు రాజ్యమేలిన భయానక పరిస్థితులు చూశారు. వైసీపీ పెద్దమనుషులు చేతులకు లాఠీలు అప్పగించి, చోద్యం చూసిన పోలీసు అధికారులను చూశారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక పొదలకూరులో శవమై చెట్టుకు వేళాడిన ఉదయగిరి నారాయణ విషాదగాథ మీకు గుర్తుండే ఉంటుంది. మర్రిపాడులో విషం తాగి చనిపోయిన తిరుపతయ్య కథ కూడా మీకు తెలుసు. అధికార పార్టీ నాయకుల వేధింపులు తట్టుకోలేక కావలికి చెందిన కరుణాకర్ ఇంట్లో శవమై వేలాడిన సంఘటన చూశాం. అదే ఊర్లో బాడుగ తోలుకుని బతకడానికి వీలులేదని చేసిన వేధింపులకు నిరసనగా, కావలి ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి మృత్యువు ముంగిట వరకు వెళ్లిన అభాగ్యుడి దీన గాథ కూడా విన్నాం. రాజకీయ కక్షతో పొలం గట్లు కలిపేసుకున్న ఘటనలు... ఇంటి ప్రహరీలు పడగొట్టిన సంఘటనలు... తప్పుడు కేసులు పెట్టిన ఉదంతాలు కూడా కో కొల్లలుగా చూశాం.

● ఇక్కట్లన్నీ అనుభవించాం..

పెరిగిన నిత్యావసరాల ధరలతో పచ్చడి మెతుకులు తిన్న రోజులు... కన్నీళ్లు తెప్పించిన కరెంటు బిల్లులు.. గుదిబండగా మారిన గ్యాస్ ధరలు... పొరుగు రాష్ట్రాల కన్నా పెట్రోలు, డీజిల్ ధరలు లీటరుపై 10 రూపాయల అదనంగా చెల్లించాల్సిన పరిస్థితులు... అన్నీ కూడా గుర్తుండే ఉంటాయి. వీటన్నింటిని ఒకసారి మననం చేసుకుని ఓటెవరికి వేయాలో... ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ?

● తెలుగుతల్లిని చూసి..

ప్రతి ఒక్కరూ కుటుంబానికి ప్రాధాన్యమిస్తారు. ఆ తరువాత ఊరంటే ఇష్టపడతారు. ఈ రెండింటి తరువాత దేశమంటే గౌరవిస్తారు. యుద్ధంలోనే కాదు, క్రీడల్లో కూడా మన దేశంపై పొరుగుదేశం విజయం సాధించడానికి ఏ ఒక్కరూ అంగీకరించరు. మరి మన రాష్ట్రం అంటే గౌరవం లేదా...? ఐదేళ్లుగా రాజధానికి దూరంగా నిలువ నీడ లేక కన్నీరుమున్నీరవుతున్న తెలుగుతల్లిని చూసి ఓటెవరికి వేయాలో.. నిర్ణయించుకోండి. రాజధాని కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతుల ఆక్రందనలు గుర్తుకు తెచ్చుకొని ఓటేవరికి వేయాలో... నిర్ణయించుకోండి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయిన యువత కన్నుల చెలమల్లోంచి పాయలు కడుతున్న కన్నీటి ప్రవాహానికి కారకులెవరో గుర్తించి ఓటేయండి...? అప్పులపాలైన రాష్ట్రాన్ని, రాజధాని లేని రాష్ట్రాన్ని, అశాంతి, అభద్రత నిండిన రాష్ట్రాన్ని ఎవరు ఉద్ధరించగలరో...? ఎవరు గట్టెకించగలరో.. రాష్ట్రంలో ఎవరు శాంతిని స్థాపించగలరో... ఎవరు ఏ భయం లేని స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని సృష్టించగలరో.. ఎవరు సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండు కళ్లుగా చూసి రాష్ట్రాన్ని ఉద్ధరించగలరో...బాగా ఆలోచించి ఓటేయండి!



నెల్లూరు : ములాపేటలోని వేదసంస్కృత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పోలింగ్‌కు మేం సిద్ధం..



ఆత్మకూరులో పోలింగ్ సామగ్రితో సిబ్బంది





కల్యాణ మండపంలా..

మామిడితోరణాలు, అరటి పిలకలు, పూలహారాలతో కల్యాణమండపంలా ఉన్న ఈ పోలింగ్ కేంద్రం ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలోనిది.

ఓటరు తీర్పు నేడే!

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఎన్నికల బరిలో 129 మంది అభ్యర్థులు
- 2,470 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 7 నుంచి ప్రారంభం
- సాయంత్రం 6 వరకు క్యూలో ఉన్నోళ్లకు అవకాశం

నెల్లూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ప్రజలు ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కుతో సమర్థవంతమైన పాలకులను ఎన్నుకునేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్ సోమవారం జరగనుంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు ఒకేసారి పోలింగ్ జరుగుతోంది. జిల్లాలో ఒక పార్లమెంటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ సిబ్బంది మాక్ పోలింగ్‌ను నిర్వహించిన అనంతరం మెయిన్ పోలింగ్‌ను ప్రారంభిస్తారు. వేసవి నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ దఫా సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్‌కు అవకాశం కల్పించింది. ఆరు గంటల వరకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. నెల్లూరు పార్లమెంటుతోపాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాల బరిలో 129 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నెల్లూరు ఎంపీ స్థానానికి 14 మంది, కందుకూరు అసెంబ్లీ స్థానానికి 22 మంది, కావలికి 13, ఆత్మకూరుకు 13, కోవూరుకు 13, సర్వేపల్లికి 13, నెల్లూరు సిటీకి 15, నెల్లూరు రూరల్‌కు 13, ఉదయగిరికి 15 మంది పోటీ చేస్తున్నారు. అయితే పోటీ మాత్రం ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ మధ్యనే జరుగుతోంది.

● పటిష్ట ఏర్పాట్లు

పోలింగ్ నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఎన్నికల పరిశీలకులు నిశితంగా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 2,470 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, అత్యధికంగా కోవూరులో 324, ఉదయగిరిలో 323, కావలిలో 314 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలో 20,61,822 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 10,08,792 మంది, స్త్రీలు 10,52,819 మంది, ఇతరులు 211 మంది ఓటర్లుగా ఉన్నారు. 432 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. అక్కడ కేంద్ర బలగాలను మోహరించారు. ఎటువంటి చిన్న అవాంఛనీయ ఘటనకు పాల్పడినా తీవ్ర చర్యలు తప్పవని ఇప్పటికే ఎస్పీ హెచ్చరించడం గమనార్హం.

● కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ప్రత్యక్షంగా పోలింగ్ విధుల్లో 14,687 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. వీరంతా ఆదివారం సాయంత్రమే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నియోజకవర్గానికి ఒకచోట రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయాన్నే పోలింగ్ సిబ్బంది ఆ సెంటర్లకు చేరుకున్నారు. వారికి అప్పటికప్పుడు ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించి ఈవీఎం, వీవీప్యాట్, సిరాతో పాటు ఇతర పోలింగ్ సామగ్రిని అందజేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లో నిర్దేశించిన రూట్లలో పోలింగ్ కేంద్రాలకు బయల్దేరారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్ కేంద్రాలన్నీ పోలింగ్ సిబ్బంది చేతుల్లోకి చేరాయి. కాగా మరో 2,823 మంది సిబ్బందిని రిజర్వులో ఉంచారు. పోలింగ్ సమయంలో అవసరమైతే వీరి సేవలను వినియోగించుకుంటారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ అన్ని కేంద్రాలను పరిశీలించి ప్రక్రియను పర్యవేక్షించారు.



అంతా బాగుందా!? కోవూరులో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

● తరలివస్తున్న యువత

ఓటు వేసేందుకు యువత ఆసక్తి చూపుతోంది. జిల్లాలో ఉన్న వారే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, చదువుకుంటున్న వారు భారీగా తరలివస్తున్నారు. శనివారం, ఆదివారాల్లో చాలా మంది స్వగ్రామాలకు చేరుకున్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వీరి సందడి కనిపిస్తోంది.. వీరే కాకుండా ఓటు హక్కు కలిగిన వారంతా తమ స్వగ్రామాలకు పయనమవుతున్నారు. వీరి రాకతో ఆదివారం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. గతానికి భిన్నంగా ఓటు తమ బాధ్యత అని యువత భావిస్తోంది. 2014 ఎన్నికల్లో జిల్లాలో 74 శాతం పోలింగ్ నమోదవగా 2019లో 76 శాతం నమోదైంది. అయితే నేడు జరగనున్న ఎన్నికల్లో ఈ శాతం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	113224	115729	26	228979
కావలి	117152	121465	28	238645
ఆత్మకూరు	105873	109579	8	215460
కోవూరు	129004	138374	25	267403
నెల్లూరు సిటీ	116764	122713	67	239544
నెల్లూరు రూరల్	136691	144237	20	280948
సర్వేపల్లి	112812	119196	26	22034
ఉదయగిరి	120108	121743	10	241861
వెంకటగిరి (3 మండలాలు)	57164	59783	1	116948
మొత్తం	1008792	1052819	211	2061822

పోలింగ్ కేంద్రాలు, అభ్యర్థుల వివరాలు...

నియోజకవర్గం	కేంద్రాలు	సమస్యాత్మకం	అభ్యర్థులు
కందుకూరు	271	55	22
కావలి	314	91	13
ఆత్మకూరు	278	66	13
కోవూరు	324	55	13
నెల్లూరు సిటీ	248	36	15
నెల్లూరు రూరల్	285	36	13
సర్వేపల్లి	284	55	13
ఉదయగిరి	323	43	15
మొత్తం	2470	437	115
నెల్లూరు (ఎంపీ)			14



నెల్లూరులో ఎన్నికల సామగ్రితో సిబ్బంది

కందుకూరులో సానుకూల పవనాలు

● ఇంటూరికి వివిధ సామాజికవర్గాల మద్దతు

కందుకూరు, మే 12: నియోజకవర్గంలో చాలాకాలం తర్వాత టీడీపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకతకుతోడు అనూహ్యంగా వచ్చిన రాజకీయ మార్పులు ఆ పార్టీకి కలిసొచ్చాయి. గత రెండేళ్లుగా టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పలు ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం, ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. మరోవైపు నియోజకవర్గంలో అనాదిగా కాంగ్రెస్‌కు, వైసీపీకి ఓటుబ్యాంకుగా ఉన్న కొన్ని సామాజికవర్గాలు టీడీపీకి మద్దతు పలికాయి. మరోవైపు గ్రామగ్రామాన నేతలు వైసీపీని వీడి టీడీపీలోకి క్యూ కట్టారు. కందుకూరులో ఐదు దశాబ్దాలపాటు చక్రంతిప్పిన దివి కుటుంబం, మానుగుంట కుటుంబం నుంచి ఈసారి బరిలో ఎవరూ లేరు. ఈ అంశం కూడా టీడీపీ కలిసొచ్చింది. దీనికితోడు నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి తనసేవాకార్యక్రమాల ద్వారా వైసీపీ క్యాడర్‌ను టీడీపీలోకి తీసుకురాగలిగారు. వీటన్నింటికీ తోడు సిటింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కాదని, ఈప్రాంతంతో అనుబంధం లేని బుర్రా మధుసూదన్‌ను వైసీపీ అభ్యర్థిగా ప్రకటించటం టీడీపీకి అనుకూలమైంది. జగన్ ప్రభుత్వంపై ఉద్యోగవ ర్గానికి ఉన్న వ్యతిరేకతకు తోడు పట్టణంలో వైసీపీకి గట్టి ఓటుబ్యాంకుగా ఉన్న బ్రాహ్మణ, కాపు, వైశ్య సామాజికవర్గాల వారు ఈసారి టీడీపీకి మద్దతు పలుకుతున్నారు. అలాగే బుర్రాకు స్థానిక నాయకుల పనితీరుపై కనీస అవగాహన లేదు. దీనికితోడు పోల్ మేనేజ్‌మెంట్ ఆయనకు పెద్ద మైనస్‌గా మారిందని విశ్లేషకుల అంచనా. గత 50 రోజులుగా టీడీపీ నేతలు పట్టణంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేస్తుండగా, వైసీపీ ప్రచారంలో బాగా వెనుకపడింది. వైసీపీకి బలంగా భావిస్తున్న గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో పెత్తనంచేసే బీసీ సామాజికవర్గంపై ఎస్సీలు, ఎస్టీలు, మత్స్యకారులు, ఇతర అన్నికులాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ వ్యతిరేకతే తమకు ఓట్లు రాలుస్తుందని టీడీపీ నేతలు అంచనా వేస్తున్నారు. మొత్తంమీద టీడీపీ శ్రేణులు విజయంపై ధీమాగా ఉన్నాయి.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

● బేకరి యజమానిపై కర్రతో దాడి ● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కందుకూరు, మే 12: పట్టణంలోని కనిగిరిరోడ్డులో ఉన్న డిలీట్షియా బేకరి వద్ద ఆదివారం గంజాయి మత్తులో కొందరు యువకులు హల్‌చల్ చేశారు. మత్తులో ఏమి చేస్తున్నారో వారికే అర్థంకాని రీతిలో ప్రవర్తించటమే గాక లిఫ్ట్ పని చేయలేదని బేకరి యజమానిని బూతులు తిట్టి తలపై కర్రతో కొట్టి గందరగోళం సృష్టించారు. పట్టపగలే గంజాయి మత్తులో యువకులు నానా బీభత్సం సృష్టించి బేకరి సిబ్బందిపైనా, యజమానిపైనా దాడి చేశారు. దాడి చేసిన వారిలో కొందరు యువకులు పట్టణంలోని ఉప్పుచెరువు ప్రాంతానికి చెందినవారు కాగా మరికొందరు బయటి ప్రాంతాలవారు, ఇతర రాష్ట్రాల యువకులు ఉన్నట్లు సమాచారం. యువకులు కర్రలు, కత్తులు, ఇతర మారణాయుధాలతో వచ్చి పట్టపగలు బీభత్సం సృష్టించటం పట్ల ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమయ్యాయి. గతంలో ఈ బ్యాచ్ పట్టణంలోని సూర్య బార్ అండ్ రెస్టారెంట్ వద్ద కూడా ఇదే తరహాలో బీభత్సం సృష్టించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కొందరు యువకులను అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారయ్యారు.


కనిగిరిరోడ్డులో ఓ బేకరి వద్ద గుమిగూడిన జనం

అంకమ్మకు ఇంటూరి ప్రత్యేక పూజలు


అంకమ్మ ఆలయంలో ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 12: ఎన్నికల ప్రచారం పూర్తయి ఓట్ల యుద్ధానికి సమయం దగ్గరపడ్డ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం గ్రామదేవత అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు కోరిక మేరకు ఎన్నికల్లో అంతా శుభమే జరగాలని, ఘనవిజయం వరించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకుంటూ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, జీ.శ్రీనులతో పాటు టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ ఆలయానికి విరాళం

కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం పట్టణంలోని గుర్రంవారిపాలెంకు చెందిన గుడిపూడి సురేష్‌బాబు, రజిత దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. ఆదివారం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, గాండ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

వలేటివారిపాలెం, మే 12 : మండలంలోని కళవళ్లలో ఓ యువకుడు ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు కళవళ్లకు చెందిన తానికొండ హేమంత్ (23) తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటుండగా హేమంత్ స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఏమైందో ఏమో తెలియదు కానీ హేమంత్ ఇంటి స్లాబుకు ఫ్యాన్‌ల కోసం ఏర్పాటు చేసి ఇనుప చువ్వకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు చుట్టు పక్కల వాళ్లు చూసి హేమంత్‌ను కిందకు దించేసరికి అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న ఎస్ఐ బాలమహేంద్రనాయక్ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● పకడ్బందీగా నిర్వహించండి ● ఎన్నికల పరిశీలకుడు గౌతమ్

● సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది



కందుకూరు : అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి


కావలిటౌన్ : సామగ్రిని పరిశీలించుకుంటున్న ఎన్నికల సిబ్బంది

కావలిటౌన్, మే 12: కావలి నియోజకవర్గంలో సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం పట్టణంలోని విశ్వోదయ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు, తదితర ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 114 పోలింగ్ బూత్‌లు, బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక ఉప ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సిబ్బంది, పోలీసులు, వెబ్ కెమెరా సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకుడు, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్డీవో శీనానాయక్, తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : పోలింగ్ సామగ్రితో బయల్దేరిన పీవోలు


లింగసముద్రం జడ్పీ హైస్కూల్లో వేసిన టెంట్లు

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలోని 271 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు పోలింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి కోరారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ప్రాంగణంలో ఆదివారం ఆమె పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలింగ్ కేంద్రాలలో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించి ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది ఉండేందుకు పోలింగ్ కేంద్రాలలోనే అన్ని ఏర్పాట్లు చేసినందున ఆయా గ్రామాలలో నాయకుల ఇళ్లవద్ద బస చేయటం, వారు పంపించిన ఆహారం తీసుకోవటం లాంటి పొరపాట్లు చేయవద్దని, అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా తక్షణం నా దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో రవికుమార్ పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాల్లో 44,872 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొనేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని షామియానాలు, తాగునీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎన్నికల అధికారి దుర్గేశ్వరరావు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

కలిగిరి: మండలంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు కల్పించామన్నారు. ఓటరు స్లిప్‌లు అందని వారికి పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం ఉదయ 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

లింగసముద్రం : మండలంలో ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు జీ.శ్రీచరణ్ తెలిపారు. మండలంలోని 30,953 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు 38 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.



కావలిటౌన్ : ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు


అల్లూరు : సిద్ధం చేసిన పోలింగ్ బూత్


కలిగిరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

అంగన్‌వాడీ వర్కర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కావలి టౌన్ : ఎన్నికల విధులకు హాజరయ్యేందుకు వచ్చి రైలు ప్రమాదంలో మృతి చెందిన అంగన్‌వాడీ వర్కర్ సుభాషిణి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అంగన్వాడీ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, రెహెనా బేగంలు డిమాండ్ చేశారు. రాపూరు అంగన్వాడీ ప్రాజెక్ట్‌కు చెందిన బట్టా సుభాషిణి తన కుమారుడు విజయ్‌కుమార్‌ను తోడు తీసుకుని గూడూరు నుంచి రైలులో కావలి చేరుకుని పట్టాలు దాటే క్రమంలో తల్లీ కుమారుడు అక్కడికక్కడే మృతి చెందడం బాధకరమన్నారు. మృతులు ఒక్కొక్కరికీ రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి అంగన్వాడీ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

ఓటేసేటప్పుడు ఇవి గమనించండి!



- వేలిపై ఇంకుముద్ర వేశాక ఈవీఎం ఆన్ అవుతుంది.
- ఈవీఎం ఆన్‌చేయగానే బీప్ అనే శబ్దం వస్తుంది.
- మిషన్ దగ్గర ఆకుపచ్చ లైట్ వెలుగుతుంది.
- అప్పుడే మిషన్‌పై గుర్తు నొక్కాలి.
- అప్పుడు కూడా బీప్ శబ్దం వస్తుంది.
- వీపాట్‌లో అభ్యర్థి ఫొటోను, గుర్తు పక్కాగా గుర్తించాలి
- బటన్ నొక్కగానే ప్రింట్ అయి కింద ఉన్న బాక్స్‌లో పడుతుంది.
- హడావిడిలో ఇవన్నీ మనం ఈ విషయాలను గమనించం. అధికారులను కూడా అడగం, మిషన్ నొక్కేసి అంతా బాగుందని వెళ్లిపోతాం..
- ఒకవేళ అనుమానం వచ్చి అధికారులను అడిగినా ఏదో సర్ది చెబుతారు.
- ఇవన్నీ గమనించకపోతే మన ఓటు నమోదు కాకుండా పోయే అవకాశం కూడా ఉంది.

- నెల్లూరు (సాంస్కృతికం)

ఓటర్ స్లిప్పులు ఎగ్గొట్టి..
నగదు నొక్కేసి !

చోటామోటా నేతలతో బీఎల్వోల లాలూచీ

కావలి, మే12: అక్రమార్జనకు అవకాశం ఉన్నంతవరకు కొంత మంది దేన్నీ కూడా వదలరు. ఇందుకు ఉదాహరణ ఇదిగో... సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లకు నగదు పంచే విషయంలో కొందరు బీఎల్వోలు, వివిధ పార్టీల చోటామోటానేతలతో లాలూచీ పడి ఓటర్ల డబ్బులను కొట్టేశారు. బీఎల్వోలు అందచేసిన స్లిప్పులు చూపిస్తేనే ఓటర్లకు కావలిలో డబ్బులు పంపిణీ చేశారు. బీఎల్వోలు ప్రతివార్డుకు 100 మంది వరకు స్థానికంగా లేనివారు, డబుల్ ఎంట్రీ ఉన్నవారి స్లిప్లులు వారి వద్దనే ఉంచుకున్నారు. అలాంటి వారు ఫోన్ చేస్తే పోలింగ్‌బూత్ వద్దకు వచ్చినపుడు అక్కడ ఇస్తానని చెబుతున్నారు. డబుల్‌ఎంట్రీ స్లిప్పులను ఇళ్లకు ఇవ్వగా, బీఎల్వో వద్ద ఉన్న స్లిప్పులను తీసుకుని కొందరు డబ్బులు పంచేవద్దకు వెళ్లారు. అయితే వాటికి డబ్బులు ఇచ్చినట్లు వారు నోట్ చేసుకుని ఉండటంతో ఈ స్లిప్పులకు డబ్బులు ఇచ్చామే... మళ్లీ ఎలా వచ్చాయని ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు బీఎల్వోలు వార్డు ఇన్‌చార్జిలకే నేరుగా స్లిప్పులు ఇవ్వడంతో వారిలో కూడా కొందరు పంపిణీ డబ్బులను నొక్కారనే ప్రచారం ఉంది.

కల్లుకు గిరాకీ

మద్యం దుకాణాల మూతతో డిమాండ్



ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళాలు పడ్డాయి. దీంతో కల్లు దుకాణదారులు తమ వ్యాపారాన్ని జోరుగా కొనసాగించారు. మండలంలోని గువ్వాడి, తూర్పుబోయమడగల, జీ.కొండారెడ్డిపల్లి, ఇస్కపల్లి, జడదేవి, వరికుంట పాడు, మహమ్మదాపురం, తూర్పురొంపిదొడ్ల, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కల్లు విక్రమాలు బాగా సాగాయి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు కొనసాగాయి. అదే అదునుగా భావించిన వ్యాపారులు నాసిరకం కల్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎన్నికల వేళ కల్లు అమ్మకాలను కూడా నియంత్రించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- వరికుంటపాడు

ఈ బండితో వేట సాధ్యమేనా!?



కావలి రూరల్ : అసలే ఎన్నికలు.. ఏ క్షణాన్నైనా ఏమైనా జరగొచ్చు. అంత పకడ్బందీగా ఉండాలి. కానీ, ఈ పోలీస్ జీపును చూశారా!? ఎన్నికల విధులకు వచ్చి కావలి పోలీస్ పరేడ్ మైదానంలో ఇలా ఆగిపోయింది. ఇంకేముంది. పరుగు తీసేందుకు మొండికేసిన ఈ జీపును అక్కడే ఉన్న కొంతమంది ఇలా నెట్టుతూ కనిపించారు!?. ఈ దృశ్యం ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.

సజావుగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

- నిరంతరాయంగా పరిశీలన
- వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలనలో కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మే 12 : నేటి(సోమవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్‌ను సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే డిస్ట్రిబూషన్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలోని 2,470 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

● నిరంతరాయంగా పరిశీలన

పోలింగ్ ప్రక్రియను నెల్లూరులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరాయంగా పరిశీలించేందుకు అన్నీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. సీ విజిల్, 1950 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు అన్నీ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిస్టికల్ సర్వైయల్ టీములు నిరంతరం నిఘా ఉంచి తనిఖీలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలను కూడా పరిశీలించాలన్నారు. రాజకీయ ప్రకటనలు ప్రసారం కాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రసారమై తే వెంటనే చర్యలకు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్‌బూత్‌ల్లో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

● ఆ ప్రచారాన్ని నమ్మవద్దు..

జిల్లాలో చెరగని సిరా ద్వారా ఓటర్ల వేలిపై వారి ఇంటి వద్దే మార్కుచేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతున్నదంటూ సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. చెరగని సిరాను ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఎస్పీ

నెల్లూరు(క్రైం) : శాంతి భద్రతలు పరిరక్షిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఎస్పీ సుడిగాలి పర్యటన చేపట్టారు. పలు నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆత్మకూరులోని ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాల, ఉదయగిరిలోని ఇంటిగ్రేటెడ్ బీసీ హాస్టల్ గ్రౌండ్, కావలి, కందుకూరు పరిధిలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల, వెంకటాచలంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి, చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చామ న్నారు. బారికేడ్ల ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్, తదితర ఏర్పాట్లపై సూచనలు చేశామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగిం చుకోవడమేలక్ష్యంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. బందోబస్తు నిర్వహణ తీరును సీసీ టీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఏ చిన్న సమస్య తెలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించామన్నారు. పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లు, ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌కు సీఆర్‌పీఎఫ్ బలగాలను కేటాయించామని చెప్పారు.



వలసవాసులు వచ్చేశారు!

కావలి/ఉదయగిరి రూరల్ : ఓట్లు వేసేందుకు వలసవాసులు ఆదివారం సొంతూళ్లకు చేరడంతో మెట్టప్రాంతంలోని పల్లెలు, పట్టణాల్లో సందడి వాతా వరణం నెలకొంది. ఉదయగిరి నియోజకవర్గంలో 2,41,677 ఓట్లు ఉండగా, 40 శాతం మంది ఓటర్లు పొట్టచేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. ప్రధానంగా సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, కొండాపురం, కలిగిరి మండలాలకు చెందిన వారు బెంగుళూరు, హైదరాబాదు, చెన్నై, గోవా, పూణె, విజయవాడ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. వీరంతా రావడంతో ఆదివారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ కిటకిటలాడింది. ఇక కావలి నియోజకవర్గంలో సుమారు 20వేల మంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నట్లు సమాచారం. వీరంతా బస్సులు, రైళ్లు, సొంత వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరందరికీ ఆయా పార్టీల నాయకులు నాయ కులు ప్రయాణ, భోజనం, ఇతర ఖర్చులు భరించడంతోపాటు ఓటుకు ఇంతమొత్తం ఇస్తామని చెప్పి పిలిపించినట్లు సమాచారం. కొందరు నాయకులు ఏకంగా ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేశారు.

'గిరి'లో ఉక్కపోత

అల్లాడిపోయిన సిబ్బంది, సొమ్మసిల్లిన కానిస్టేబుల్



ఉదయగిరి రూరల్ : ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఈవీఎంల పంపిణీ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. మండుటెండలో నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఓ వైపు కారుతున్న చెమట, మరోవైపు ఎన్నికల సామగ్రి సరి చూసుకోలేక ఉద్యోగుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఏ ఉద్యోగి చేతిలో చూసినా పేపర్, అట్టముక్క, కర్చీఫ్ పట్టుకుని గాలి విసురుకుంటూ కనిపించారు. మరోవైపు తాగునీరు క్యాన్లలో ఏర్పాటు చేయడంతో దాహం తీర్చుకొనేందుకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. వాష్‌రూమ్స్, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవు. ఉక్కపోతను తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ సొమ్మసిల్లి పడిపోయాడు.

ఓటర్లకు ప్రయాణ కష్టాలు

- హక్కు వినియోగానికి వచ్చి బస్సుల కోసం పడిగాపులు
- ఆర్టీసీ గ్రామీణ సర్వీసులు రద్దు
- గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షణ
- ప్రమాదకరంగా ఆటోల్లో ప్రయాణం
- సంగంకు చార్జీ రూ.300, ఆత్మకూరు రూ.500
- అధికారుల తీరుపై ఆగ్రహం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 12: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రజలు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్లలో బస్సులు లేక అష్టకష్టాలు పడ్డారు. పనులు మానుకొని, ఎంతో ఖర్చు పెట్టుకుని కుటుంబంతోసహా రైళ్లు, ప్రైవేటు ట్రావెల్స్, ఆర్టీసీ బస్సుల్లో నెల్లూరుకి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వారివారి స్వగ్రామాలకు వెళ్లేందుకు బస్సులు లేక ఆర్టీసీ ప్రధాన బస్టాండు, ఆత్మకూరు బస్టాండ్లలో వేలాదిమంది ఉండిపోయారు. దీంతో ఆర్టీసీ సిబ్బందిని వారు ప్రశ్నించడంతో బస్సులన్నీ ఎన్నికల విధులకు వెళ్లాయని, గ్రామీణ సర్వీసులను పూర్తిగా రద్దు చేశామని చెప్పారు. దీంతో చేసేది లేక పలువురు అధిక చార్జీలు చెల్లించి ఆటోల్లో వెళ్లారు.

● అధికారుల తీరుపై ఆగ్రహం

తమ ప్రాంతాలకు బస్సులు లేవని తెలియడంతో జిల్లా అధికారులపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎన్నికలు జరుగుతుండటంతో ఆదివారమే ఓటర్లు వస్తారని అధికారులకు తెలియదా ? అని వారు ప్రశ్నించారు. ఎన్నికల విధులకు ఆర్టీసీ బస్సులను పంపినప్పుడు ప్రత్యమ్నాయ రవాణా ఏర్పాట్లు చేయా లని అధికారులకు తెలియదా ? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్టాండ్లు ఖాళీగా మారడంతో నేరుగా ఆటోలు ఆయా ప్లాట్‌ఫారమ్‌ల వద్ద వచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్నారు. నెల్లూరు నుంచి సంగంకు ఆటో చార్జి రూ.300, ఆత్మకూరుకు రూ.500, ఇలా దూరాన్ని బట్టి రూ.100నుంచి రూ.800 వసూలు చేశారు. ఒక్కొక్క ఆటోలో 15 నుంచి 25 మందిని ఎక్కించుకుని ప్రమాదకరంగా ప్రయాణించారు. ఇక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రంగంలోకి దిగి, చెన్నై, తిరుపతి, ఒంగోలు ప్రాంతాల వైపు అధిక చార్జీలు వసూలు చేస్తూ తిరిగాయి.



ఆత్మకూరు బస్టాండులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



బస్సులు లేక ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రజలు





నిర్మాణ రంగాన్ని
కూల్చేసిన జగన్


వేలాదిమంది జీవితాలు అతలాకుతలం

కార్మికుల పొట్టగొట్టిన వైసీపీ సర్కార్

నెల్లూరు (సాంస్కృతికం) మే 12 : జగన్ సీఎం పీఠం ఎక్కగానే భవన నిర్మాణ రంగాన్ని దారుణంగా దెబ్బతీశారు. ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి, దోపిడీకి శ్రీకారం చుట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అరకోటికిపైగా, జిల్లాలో లక్షన్నరకుపైగా కార్మికుల జీవితాలు అతలాకుత లం అయ్యాయి.

● కార్మిక సంక్షేమం గాలికి..

1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారు. నిర్మాణ రంగం నుంచి ఒక శాతం సెస్సు వసూలు చేసి, ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించేవారు. 2019 నాటికి దాదాపు రూ. ఆరువేలకోట్లపైగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులు ఉంటే, వాటిని జగన్ ప్రభుత్వం దారి మళ్లించింది.ఈ 58 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా లేకుండా చేసింది.జిల్లాలో ఒకటిన్నర లక్షలకుపైగా భవన నిర్మాణ కార్మికులుంటే అందులో 60వేల మందికి పైగా కార్మికశాఖలో నమోదై ఉన్నారు. 1996 నుంచి 2018 వరకు కార్మిక సంక్షేమ నిధులను భవన నిర్మాణ కార్మికులు అందుకున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు రూ.50 సభ్యత్వం, సంవత్సర చందా రూ.12 చొప్పున ఐదేళ్లకు రూ.60లు మొత్తం రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకుని గుర్తింపు కార్డు పొందాలి. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు, ప్రమాదంలో 25 శాతం అంగవైకల్యానికి రూ.25వేలు, 46 శాతం వైకల్యానికి రూ.50 వేలు, 50 నుంచి 75 శాతం వైకల్యానికి రూ.లక్ష, శాశ్వత వైకల్యానికి రూ.5లక్షలు ఇస్తారు. సహజ మరణానికి రూ.60వేలతోపాటు అంత్యక్రియలకు (మట్టి ఖర్చులు) సాయం పొందేవారు. భవన నిర్మాణ కార్మికుడి కుటుంబంలో కుమార్తె వివాహానికి ఖర్చులు, రెండు కాన్పులకు ప్రసూతిసాయం రూ.20వేలు లభించేవి. తాత్కాలిక వైకల్యం, అనారోగ్యానికి గురైన కార్మికుడికి రోజుకు రూ.2వేలు, గరిష్ఠంగా రూ.3వేలు అందచేసేవారు. ఈ సాయం 2019 సంవత్సరానికి ముందు వరకు లభించింది. 2019 నాటికి ఆర్థిక సాయం కోసం కార్మిక శాఖకు చేసుకున్న దరఖాస్తులు దాదాపు 2వేలకు పైగా ఉన్నాయి. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ నిధులకు మంగళం పాడింది. కార్మికుడు చనిపోతే కనీసం మట్టి ఖర్చులు (అంత్యక్రియలు) కూడా పైసా ఇవ్వని పరిస్థితి నెలకొంది.దీంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డెక్కి నిరసనలు, ధర్నాలు చేశారు. అయి నా సీఎం జగన్ మనసు కరగలేదు. ఈ 58నెలల జగన్ ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ కార్మికులు, పనులు లేక, సంక్షేమ పథకాలు అందక అల్లాడిపోయారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వసూలు చేసిన సెస్సు రూ.14,57, 45,650. కానీ వారి కోసం ఖర్చు చేసిం ది రూపాయి కూడా లేదు.ఈ విధంగా వైసీపీ ప్రభుత్వం కార్మికుల కడుపులు కొట్టింది.



సమాంతరంగా సచివాలయ వ్యవస్థ ● మీ సేవ కేంద్రాలపైనే ప్రజల మక్కువ

వాటి నుంచి ప్రభుత్వ సర్వీసుల తొలగింపు ● సెంటర్ల మూత, వీధినపడ్డ నిర్వాహకులు

జగనొచ్చాడు..
మీ సేవలకు రాం రాం !

సంగం, మే 12 : గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా, వేగంగా ఎల్లవేళలా ప్రజలకు సేవలు అందచేసే మీ సేవ కేంద్రాలు జగనన్న రాకతో మూతపడ్డాయి. వాటికి సమాంతరంగా సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిల్లో సేవలు అందచేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించినా మీ సేవ కేంద్రాల్లో మాదిరిగానే ప్రతి సర్వీసుకు రుసుం వసూలు చేస్తున్నారు. రెండింట్లో ఒకే రుసుం వసూలు చేయడం, సచివాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5-00 గంటల వరకే పని చేస్తుండడంతో ప్రజలు మీ సేవ కేంద్రాలపట్లే మొగ్గు చూపేవారు. అంతేకాక మీ సేవ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో వాటికి ఆదరణ తగ్గలేదు. ఈ క్రమంలో సచివాలయాల పట్ల ప్రజలు మొగ్గు చూపడం లేదని, క్రమేణా మీ సేవ కేంద్రాల్లో సర్వీసులను తొలగిస్తూ వచ్చారు. దీంతో వాటి నిర్వాహణ భారమై మూత పడ్డాయి. ఫలితంగానిర్వాహకులు వీధిన పడ్డారు.

250కి పైగా కేంద్రాలు

జిల్లాలో 2012లో మీసేవ కేంద్రాల పేరుతో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రతి మండలంలో రెండు కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందడంతో కేంద్రాల సంఖ్యను పెంచింది. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 250 కేంద్రాలకుపైగా ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాల్లో సుమారు 542 రకాల సర్వీసులను ప్రభుత్వ నిర్దేశించిన రుసుంతో అందచేసేవారు. ప్రతి పనికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా సులభంగా, వేగంగా పనులు జరిగేవి.

సచివాలయాలతో తిప్పలు

సచివాలయంలో కూడా మీసేవ కేంద్రాల్లో అందే 542 సర్వీసులను అందచేస్తామన్నారు. అయితే అక్కడుండే సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటు ఉంటున్నారు. ప్రజలు ఆ సమయంలోనే వెళ్లాలి. ఒకవేళ వెళ్లినా వారు ఇతర ప్రభుత్వ పనుల్లో బిజీబిజీగా ఉండేవారు. ఒక్కొక్కసారి ఆన్‌లైన్ పనిచేయలేదనో.. ఇతర కారణాలతో ప్రజలకు పనులు చేసేవారు కాదు. అదే మీ సేవ కేంద్రాల వారు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటారు. ఆర్వోఆర్-1బీ, అడంగల్ వంటి పత్రాలు ఫోన్ చేసి వచ్చేలోపు ఇస్తుండడంతో సౌలభ్యంగా ఉండేది. కానీ సచివాలయాల్లో అలా జరగడంలేదు.

కేంద్రాల మూత

ప్రభుత్వ సర్వీసులన్నీ మీ సేవ కేంద్రాల్లో తొలగించడంతో కేవలం ప్రైవేట్ సర్వీస్‌లపైనే మీ సేవ ఆపరేటర్లు ఆధారపడవలసి వచ్చింది. దీంతో అవి జరక్క క్రమేణా మూతపడ్డాయి. దీంతో పట్టణాల్లో తప్ప మండలాలు, గ్రామాల్లో చూద్దామన్నా మచ్చుకైనా కనిపించడం లేదు. దీంతో నిరుద్యోగులు ఉపాధి కోల్పోయారు.



సంగంలో మూతపడిన మీ సేవ కేంద్రం

బతుకు దెరువు కోల్పోయాం



సచివాలయాల ఏర్పాటుతో మీసేవ కేంద్రాలకు ప్రభుత్వ సర్వీసులు నిలిపివేయడం దారుణం. సర్వీసులన్నీ ఉంచితే ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. కానీ గత ప్రభుత్వంలో ఏర్పాటైన మీసేవ కేంద్రాలు ఉండ కూడదనే ఉద్దేశంతో మీ సేవ కేంద్రాలపై కక్షి కట్టి సర్వీసులను తొలగించింది. దీంతో మా బతుకు దెరువు పోయింది.

- జీ. గిరిష్, మీసేవ నిర్వాహకుడు, సంగం